www.peoplesnews.in

హైదరాబాద్

పీపుల్స్ న్యూస్ దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 184 శనివారం, నవంబర్ 21, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad



మతం, కులం పేరుతో
బీజేపీ రాజకీయాలు!

● ఓట్ల కోసమే ప్రజల మధ్య విభజనలకు ప్రయత్నం ● అమిత్‌షాకు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్..
దక్షిణాది ప్రయోజనాలకు డీలిమిటేషన్ ప్రమాదకరమని ఆందోళన



హైదరాబాద్,నవంబర్ 20 : ఓట్ల కోసం బీజేపీ కుల, మత రాజకీయాలకు పాల్పడుతోందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. హిందూ, ముస్లింల ఓట్ల కోసం ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వారి మధ్య పెద్దగా పోటీ లేదని వ్యాఖ్యానించారు. నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే అమిత్‌షా హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఓవైసీని ఓడించాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ మాత్రం అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.హైదరాబాద్‌లోని హోటల్ పార్క్ హయత్‌లో శుక్రవారం జరిగిన 'ఏబీపీ న్యూస్ సదరన్ రైజింగ్ సమ్మిట్-2026'లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని జాతీయ,

మిగతా2లో...

నాగరికతల అనుసంధానానికి
సాంకేతికతే వారధి

● ఎస్‌సీఓ దేశాల మధ్య సాంస్కృతిక సహకారానికి ప్రధాని మోడీ పిలుపు
● తొలి నాగరికతా సంభాషణల వేదిక ప్రారంభం.. వారసత్వ సంపదనుడ
భవిష్యత్ తరాలకు అందించడంలో సాంకేతికత కీలకం



న్యూఢిల్లీ,నవంబర్ 20 : ప్రపంచ దేశాల మధ్య సాంస్కృతిక నంబంధాలను బలోపేతం చేయడంలో ఆధునిక సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. భిన్న సంస్కృతులు, సంప్రదాయాలు, నాగరికతల మధ్య పరస్పర అవగాహన పెంపొందించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. శుక్రవారం ఢిల్లీలో తొలి షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) నాగరికతా సంభాషణల వేదికను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల మధ్య సంబంధాలు కేవలం వాణిజ్యం, భద్రతకే పరిమితం కాకూడదని, సాంస్కృతిక అనుబంధానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వేల ఏండ్ల

మిగతా2లో...

ఉక్రెయిన్‌పై
రష్యా భీకర దాడులు

● 400 డ్రోన్లు, 100 క్షిపణులతో విరుచుకుపడిన రష్యా సేనలు ● 8 మంది మృతి.. 28 మందికి గాయాలు.. కీవ్‌లో మూడు వంతెనలు ధ్వంసం



కీవ్,నవంబర్ 20 : అమెరికా, చైనా దేశాధినేతలతో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ త్రైపాక్షిక చర్చలు జరిపిన కొద్ది గంటల్లోనే ఉక్రెయిన్‌పై రష్యా సేనలు భారీ దాడులకు పాల్పడ్డాయి. శుక్రవారం

మిగతా2లో...

సిద్దిపేటలో పోటీకి రా.. ప్రజల ముందే
తేల్చుకుందాం!

కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు ద్రోహం చేసింది కాంగ్రెస్సే
299:512 నిష్పత్తికి అంగీకరించినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తా..
నిరూపించలేకపోతే సీఎం పదవికి రాజీనామా చేస్తావా?



హైదరాబాద్, నవంబర్ 20 : సిద్దిపేట సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. దమ్ముంటే వచ్చే ఎన్నికల్లో సిద్దిపేట నుంచి తనపై పోటీ చేయాలని, ప్రజల ముందే ఎవరి సత్తా ఏమిటో తేల్చుకుందామని ముఖ్యమంత్రికి సవాల్ విసిరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట

మిగతా2లో...

విద్యారంగానికి దిక్సూచి..
చుక్కా రామయ్య

● 101వ జన్మదిన వేడుకల్లో ఘనంగా సత్కారం..
విద్యా సేవలను కొనియాడిన ప్రముఖులు



కావేరి జలాలు ఉంటే తమిళనాడుకు
ఇచ్చేవాళ్లం

● మా రాష్ట్రంలో తాగడానికి కూడా నీళ్లు లేవు
● కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వ్యాఖ్యలు



హైదరాబాద్,నవంబర్ 20 : కావేరి జలాల వివాదంపై కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ రాష్ట్రంలో సరిపడా నీటి నిల్వలు ఉంటే తప్పకుండా తమిళనాడుకు నీటిని విడుదల చేసేవారమని తెలిపారు. అయితే ప్రస్తుతం కర్ణాటకలో తాగునీటికి కూడా కొరత ఉందని, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత తనపై ఉందని స్పష్టం చేశారు.కావేరి జలాల విడుదల కోరుతూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన రెండు పిటిషన్లను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసిన నేపథ్యంలో ఆయన స్పందించారు. కర్ణాటక రిజర్వాయర్లలో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయని, పరిస్థితి తీవ్రంగా ఉందని చెప్పారు. ఈ ఏడాది కావేరి నదికి సంప్రదాయంగా నిర్వహించే 'బాగిన' పూజను కూడా చేయలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. 11 టీఎంసీల నీటి కోసం పిటిషన్లు కర్ణాటక నుంచి

మిగతా2లో...



భూముల ఆ సర్వేకు
మార్గదర్శకాలు

రైతులకు నాలుగు రోజుల ముందే నోటీసులు
ఆరు దశల్లో సర్వే ప్రక్రియ.. అభ్యంతరాల పరిష్కారం తర్వాతే తుది రికార్డులు

హైదరాబాద్,నవంబర్ 20: రాష్ట్రంలో భూముల రీ సర్వే నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. సర్వే ప్రక్రియలో అధికారులు పాటించాల్సిన నిబంధనలతో కూడిన ఉత్తర్వులను సీసీఎల్‌ఏ కమిషనర్ లోకేశ్ కుమార్ విడుదల చేశారు. గ్రామాల వారీగా భూముల కొలతలు, రికార్డుల పరిశీలన, అభ్యంతరాల పరిష్కారం, తుది రికార్డుల ఖరారు కోసం ఆరు దశల విధానాన్ని రూపొందించారు.రీ సర్వేకు నాలుగు రోజుల ముందే రైతులకు నోటీసులు ఇవ్వాలని, రెండు రోజుల ముందుగా పట్టాదారులకు గుర్తింపు జెండాలు అందించాలని ఆదేశించారు. సర్వే పూర్తయిన వెంటనే కొలిచిన భూమి విస్తీర్ణాన్ని రైతులకు తెలియజేయాలని సూచించారు. పహాణీలో

మిగతా2లో...

ఏఐ కేంద్రంగా
హైదరాబాద్

● ఐరాస వేదికపై
మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటన



హైదరాబాద్,నవంబర్ 20 : కృత్రిమ మేధ (ఏఐ), పరిశోధనా రంగాలకు హైదరాబాద్‌ను అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఐక్యరాజ్యసమితి వేదికగా జరిగిన 'గ్లోబల్ ఇంపాక్ట్ సమ్మిట్'లో ఆయన ప్రసంగించారు. తెలంగాణను ప్రపంచస్థాయి సాంకేతిక కేంద్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అంతర్జాతీయ పెట్టుబడిదారులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి 'రైజింగ్ తెలంగాణ'లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఐటీ, ఏఐ, జీవశాస్త్ర రంగాల్లో తెలంగాణకు విస్తృత అవకాశాలున్నాయని మంత్రి వివరించారు. వైద్యం, విద్య, పర్యావరణ రంగాల్లో ఏఐ వినియోగంతో సమూల మార్పులు తీసుకొస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో ఆవిష్కరణల వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెప్పారు.వరిశ్రమల అవసరాలకు అనుగుణంగా

మిగతా2లో...

మతం, కులం పేరుతో బీజేపీ రాజకీయాలు!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర రాజకీయాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. బీజేపీ జాతి, మతం, భాష పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తోందని ఆరోపించారు. ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం మతపరమైన అంశాలను ముందుకు తెస్తోందని విమర్శించారు. **దక్షిణాదికి డీలిమిటేషన్ ముప్పు** కేంద్ర ప్రభుత్వం చేపట్టాలనుకుంటున్న నియోజకవర్గాల పునర్విభజన దేశంలోని దక్షిణాది రాష్ట్రాల భవిష్యత్తుకు పెను సవాల్‌గా మారుతుందని రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. లోక్‌సభ స్థానాలను 50 శాతం పెంచితే ఉత్తరాది రాష్ట్రాలకు అధిక సీట్లు దక్కి, కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో దక్షిణాది ప్రాధాన్యం తగ్గిపోతుందని హెచ్చరించారు. మొత్తం 850 సీట్లలో ఉత్తరాదికి 650, దక్షిణాదికి 195 స్థానాలు మాత్రమే వచ్చే అవకాశం ఉందని వివరించారు.ప్రస్తుతం కేరళలో 20, ఉత్తరప్రదేశ్‌లో 80 లోక్‌సభ స్థానాలు ఉన్నాయని, 50 శాతం పెంపు తర్వాత కేరళలో 30, యూపీలో 120 స్థానాలు అవుతాయని తెలిపారు. దీంతో రెండు రాష్ట్రాల మధ్య సీట్ల వ్యత్యాసం 60 నుంచి 90కి పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ విధానం దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాధాన్యాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. జనాభా, జీడీపీ ఆధారంగా '50 శాతం ఫార్ములా' అమలు చేయాలని సూచించారు. **543 స్థానాల్లోనే మహిళలకు రిజర్వేషన్లు** మహిళా రిజర్వేషన్ల అమలుకు కొత్త చట్టాలు, రాజ్యాంగ సవరణలు అవసరం లేదని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాల్లోనే 181 స్థానాలను మహిళలకు కేటాయించవచ్చని సూచించారు. మహిళలకు నిజంగా ప్రాతినిధ్యం కల్పించాలనే చిత్తశుద్ధి కేంద్రానికి ఉంటే వెంటనే అమలు చేయాలని కోరారు. 2023లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి కాంగ్రెస్ సహకరించిందని గుర్తుచేశారు. **తెలంగాణలో బీజేపీకి ఉనికి లేదు** తెలంగాణలో బీజేపీకి రాజకీయంగా పెద్దగా ఉనికి లేదని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీకి డిపాజిట్ కూడా దక్కలేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో తమకు ప్రధాన ప్రత్యర్థి బీఆర్ఎస్ మాత్రమేనని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను రాజకీయ ప్రత్యర్థిగా భావిస్తానని, కేటీఆర్‌ను మాత్రం సీరియస్‌గా తీసుకోనని అన్నారు. కేసీఆర్‌ను 'రావణాసురుడు'గా, కేటీఆర్‌ను 'మేనేజ్‌మెంట్ కోటా' నాయకుడిగా అభివర్ణించారు. బీఆర్ఎస్ నాయకులు పగటి కలల్లో జీవిస్తున్నారని విమర్శించారు. **మోడీ పాలనపై విమర్శలు** ప్రధాని మోడీని 'విజిటింగ్ ప్రైమ్ మినిస్టర్'గా అభివర్ణించిన రేవంత్‌రెడ్డి, ఆయన విదేశీ పర్యటనలపై విమర్శలు చేశారు. సీబీఐ, ఐటీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. మోడీ 12 ఏండ్ల పాలనలో రూ.120 లక్షల కోట్ల అప్పులు చేశారని, గత ప్రధానులందరి పాలనలో కలిపి అప్పులు సుమారు రూ.53 లక్షల కోట్లు మాత్రమేనని పేర్కొన్నారు. దేశంలో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు, విద్యాసంస్థల నిర్మాణంలో గత ప్రధానుల పాత్రను ప్రస్తావించారు.అదానీకి ప్రజల సొమ్మును మోడీ ప్రభుత్వం మళ్లిస్తోందని ఆరోపించిన సీఎం, తెలంగాణలో మాత్రం పెట్టుబడుల ద్వారా ప్రజలకు ఉపాధి కల్పించడమే లక్ష్యమని చెప్పారు. రాహుల్‌గాంధీ చేపట్టిన 'ఓట్ చోర్‌గద్దీ చోర్' నినాదానికి దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తోందన్నారు. యువతలో మార్పు వస్తోందని, మోడీ పాలనపై ఉన్న భయాన్ని 12 రోజుల్లోనే జెన్‌జీ యువత తొలగించిందని వ్యాఖ్యానించారు.

సిద్దిపేటలో పోటీకి రా.. ప్రజల ముందే తేల్చుకుందాం!

(మొదటి పేజీ తరువాయి)

సభలో అభివృద్ధి, ప్రజా సమస్యలు, నిధుల గురించి మాట్లాడకుండా బీఆర్ఎస్ నేతలపై విమర్శలు, వ్యక్తిగత దూషణలకే సీఎం ఎక్కువ సమయం కేటాయించారని ఆరోపించారు.రాష్ట్రంలో మూడేండ్ల కాంగ్రెస్ పాలన అన్ని రంగాల్లో విఫలమైందని హరీశ్‌రావు విమర్శించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చేతులెత్తేసిందని, సాగునీటిని సక్రమంగా వినియోగించుకోకుండా తెలంగాణను కరువు పరిస్థితుల్లోకి నెట్టిందని ఆరోపించారు. కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్‌కు తరలించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పరోక్షంగా సహకరిస్తోందని మండిపడ్డారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలపై రుద్దిన కరువని వ్యాఖ్యానించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు సైతం ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, అనిరుధ్‌రెడ్డి కమీషన్ల వ్యవహారాన్ని ప్రస్తావించగా, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పాలన సరిగా లేదని వ్యాఖ్యానించారని గుర్తుచేశారు.

దేశవ్యాప్త బీసీ కులగణనకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి.. బీసీలకు సామాజిక న్యాయం జరగాలి: కేటీఆర్

హైదరాబాద్,నవంబర్ 20 : దేశవ్యాప్తంగా ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) కులగణన చేపట్టాలన్న డిమాండ్‌కు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. బీసీలకు జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలంటే సమగ్ర కులగణన అవసరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు.ఈ మేరకు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు శుక్రవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసి దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలన్న తమ డిమాండ్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. వారి విజ్ఞప్తిపై స్పందించిన కేటీఆర్.. బీసీల హక్కులు, సామాజిక న్యాయం కోసం చేపట్టే కులగణనకు బీఆర్ఎస్ పూర్తి మద్దతుగా నిలుస్తుందని



తెలిపారు.కులగణన ద్వారా దేశంలోని బీసీల వాస్తవ జనాభా, వారి సామాజిక, ఆర్థిక పరిస్థి తులు, విద్యా, ఉద్యోగ రంగాల్లో వారి ప్రాతినిధ్యంపై స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. జనాభాకు అనుగుణంగా హక్కులు, అవకాశాలు కల్పించేందుకు ఇది కీలకమని అభిప్రాయపడ్డారు. కేవలం జనాభా లెక్కలతో సరిపెట్టకుండా, ఆ వివరాల ఆధారంగా బీసీల అభ్యున్నతికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.గతంలోనే తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగాలన్న లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ అంశంపై చొరవ తీసుకుందని వివరించారు. అలాగే, బీసీల సమస్యలు, రిజర్వేషన్ల అంశాన్ని బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పార్లమెంట్‌లోనూ ప్రస్తావించారని తెలిపారు. బీసీలకు న్యాయమైన వాటా దక్కాలంటే కులగణనతో పాటు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల అమలుపై కూడా కేంద్రం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నా రు. దేశవ్యాప్తంగా ఓబీసీ కులగణన కోసం విద్యార్థి సంఘాలు, బీసీ సంఘాలు చేస్తున్న ప్రయత్నాలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు. ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు

(మొదటి పేజీ తరువాయి)

తెల్లవారుజామున డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడ్డాయి. ప్రపంచ శాంతికి కట్టుబడి ఉన్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో కలిసి పుతిన్ ఉమ్మడి ప్రకటన విడుదల చేసిన తర్వాత ఈ దాడులు జరగడం గమనార్హం. ఎనిమిది గంటలకు పైగా కొనసాగిన దాడుల్లో ఎనిమిది మంది మరణించగా, 28 మంది గాయపడ్డారని ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు. **400 డ్రోన్లు.. 100 క్షిపణులు**రష్యా సేనలు సుమారు 400 డ్రోన్లు, కనీసం 100 క్షిపణులను ప్రయోగించాయని ఉక్రెయిన్ ఆరోపించింది. వీటిలో 120 జెట్ ఆధారిత డ్రోన్లు ఉన్నాయని తెలిపింది. రష్యా దాడులతో రాజధాని కీవ్ తీవ్రంగా దెబ్బతింది. నగరంలో పేలుళ్ల శబ్దాలు వినిపించగా, దట్టమైన పొగలు అలుముకున్నాయి. మూడు వంతెనలు ధ్వంసమవడంతో రవాణా వ్యవస్థకు అంతరాయం ఏర్పడింది. **పోలాండ్ గగనతలంలోకి రష్యా డ్రోన్లు** దాడుల సమయంలో రష్యా దళాలు పోలాండ్ గగనతలాన్ని ఉల్లంఘించాయని ఆ దేశ ప్రభుత్వం తెలిపింది. తమ భూభాగంలో కొన్ని వస్తువులు పడటంతో యుద్ధ విమానాలను రంగంలోకి దించడంతోపాటు పేట్రియాట్ గగనతల రక్షణ వ్యవస్థలను అప్రమత్తం చేసినట్టు వెల్లడించింది. **జనావాసాలపైనా దాడులు** ఉక్రెయిన్ సైనిక, ఇంధన కేంద్రాలు, ఓడరేవులు, రవాణా మౌలిక సదుపాయాలే లక్ష్యంగా దాడులు చేసినట్టు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది. అయితే ఖార్కివ్‌లోని ఆస్పత్రితోపాటు పలు ప్రాంతాల్లో నివాస భవనాలపైనా దాడులు జరిగాయని ఉక్రెయిన్ ఆరోపించింది. మరోవైపు ఉష్ణోగ్రతలు సున్నా కంటే తక్కువకు పడిపోతున్న సమయంలో దాడుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

కరీంనగర్‌లో బీజేపీ మహా పాదయాత్ర

- 23న జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రాక.. రాష్ట్ర నేతలతో కలిసి రెండు కిలోమీటర్ల మేర యాత్ర

హైదరాబాద్,నవంబర్ 20 : కరీంనగర్‌లో ఈ నెల 23న నిర్వహించనున్న బీజేపీ మహా పాదయాత్రలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పాల్గొననున్నారు. 'ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం.. అరాచకత్వాన్ని పాతరేద్దాం' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. పాదయాత్రకు సంబంధించిన ఏర్పాట్లను పార్టీ రాష్ట్ర నాయకత్వం పర్యవేక్షిస్తోంది.ఈ నెల 23న ఉదయం 11 గంటలకు నితిన్ నబీన్ హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 12 గంటలకు కరీంనగర్ కలెక్టరేట్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం కరీంనగర్



వైశ్య భవన్‌కు వెళ్లి మహా పాదయాత్రలో పాల్గొంటారు. వైశ్య భవన్ నుంచి టవర్ సర్కిల్, శాస్త్రీ రోడ్డు మీదుగా కమాన్ వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర యాత్ర కొనసాగనుంది.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సునీల్ బన్సల్‌తో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు పాల్గొనను న్నారు. పాదయాత్రను విజయవంతం చేయాలని రామచందర్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. **ఓటర్ల జాబితా సవరణపై ప్రజలకు వివరణ** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో రాజ్యాంగ సంస్థలపై ఇండియా కూటమి చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడంతో పాటు, ఈ ప్రక్రియకు సంబంధించిన వాస్తవాలను ప్రజలకు వివరించడమే పాదయాత్ర ఉద్దేశమని బీజేపీ నాయకులు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలు, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అవగాహన

నాగరికతల అనుసంధానానికి సాంకేతికతే వారధి

(మొదటి పేజీ తరువాయి)

చరిత్ర కలిగిన భారతీయ నాగరికత ప్రపంచానికి ఎన్నో విలువలను అందించిందని పేర్కొన్నారు. దేశంలోని మ్యూజియంలు, గ్రంథాలయాలు, పురావస్తు కేంద్రాల్లో భద్రపరిచిన అపారమైన వారసత్వ సంపదను ఆధునిక సాంకేతికత సాయంతో ప్రపంచానికి పరిచయం చేయవచ్చని తెలిపారు.డిజిటల్ వేదికలు వివిధ దేశాల ప్రజలను, సంస్కృతులను దగ్గర చేస్తున్నాయని చెప్పారు. ఎస్‌సీఓ సభ్య దేశాల మధ్య భద్రత, ఆర్థిక వ్యవస్థ, అనుసంధాన రంగాల్లో సహకారంతోపాటు నాగరికతల పరస్పర మార్పిడికి కూడా అవకాశాలు విస్తరించాలని ఆకాంక్షించారు. ఉమ్మడి చరిత్ర, సంప్రదాయాలు దేశాల మధ్య స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేస్తాయని వివరించారు.మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి భారత్ ఆతిథ్యమిస్తోంది. ఢిల్లీలోని చారిత్రక పురానా ఖిల్లాలో నిర్వహిస్తున్న ఈ సమావేశాల్లో పాకిస్తాన్ సహా పలు ఎస్‌సీఓ సభ్య దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారు. సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, నాగరికతల మధ్య సంభాషణలు, అంతర్జాతీయ సహకారం వంటి అంశాలపై ఇందులో చర్చించనున్నారు.

విద్యారంగానికి దిక్సూచి.. చుక్కా రామయ్య

హైదరాబాద్,నవంబర్ 20 : ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య 101వ జన్మదిన వేడుకలు హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు రూపొందించిన 'మన చుక్కా రామయ్య.. వందేళ్ల పండుగ' పుస్తకాన్ని జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమానికి పలువురు రాజకీయ, విద్యా, సామాజిక రంగాల ప్రముఖులు హాజరై రామయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చుక్కా రామయ్యకు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. స్వాతంత్ర్య ఉద్యమం, తెలంగాణ ఉద్యమాల్లో ఆయన పోషించిన పాత్రను గుర్తుచేశారు. విద్యారంగంలో ఆయన చేసిన సేవలు ఎంతో విలువైనవని, ఐఐటీ విద్యను గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు చేరువ చేయడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. తెలంగాణలో ఆయనకు సమకాలీకులు లేరని పేర్కొన్నారు.జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. చుక్కా రామయ్య రాజ్యాంగ విలువలకు ప్రతీకగా నిలిచారని ప్రశంసించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కోదండరామ్, కూనంనేని సాంబశివరావు, జూలకంటి రంగారెడ్డి తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యను కేవలం ఉపాధి సాధనంగా కాకుండా సమాజ మార్పునకు మార్గంగా భావించిన రామయ్య సేవలు చిరస్మరణీయమని వక్తలు పేర్కొన్నారు.వందేళ్లు దాటిన వయసులోనూ విద్య, సమాజం పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత యువతకు ఆదర్శమని పలువురు అభిప్రాయపడ్డారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, నాణ్యమైన విద్య అందరికీ చేరాలనే లక్ష్యంతో ఆయన సాగించిన ప్రయాణం స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

కావేరి జలాలు ఉంటే తమిళనాడుకు ఇచ్చేవాళ్లం

(మొదటి పేజీ తరువాయి)

11 టీఎంసీల కావేరి జలాలను విడుదల చేయాలని ఆదేశించాలంటూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఆ రెండు పిటిషన్లను తోసిపుచ్చింది. అదనపు పత్రాలను సమర్పించేందుకు తమిళనాడు దాఖలు చేసిన మరో దరఖాస్తును కూడా కొట్టివేయనున్నట్టు ధర్మాసనం సూచించింది.కావేరి జలాలు, మేకెదాటు ప్రాజెక్టుపై తమిళనాడు కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలపై కాంగ్రెస్ అధిష్ఠానంతో మాట్లాడతానని డీకే శివకుమార్ తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, వాస్తవ పరిస్థితులను పార్టీ నాయకులకు వివరిస్తానని పేర్కొన్నారు.

ఏఐ కేంద్రంగా హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

యువతకు నైపుణ్య శిక్షణ అందించి, వారి ఆలోచనలను ప్రపంచస్థాయి ఆవిష్కరణలుగా మలుస్తామని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. అంతర్జాతీయ భాగస్వామ్యాలు, పెట్టుబడులకు తెలంగాణలో అనుకూల వాతావరణం కల్పిస్తున్నామని తెలిపారు.

భూముల లీ సర్వేకు మార్గదర్శకాలు

(మొదటి పేజీ తరువాయి)

నమోదైన విస్తీర్ణానికి, క్షేత్రస్థాయి కొలతలకు తేడాలుంటే వాటి కారణాలను ఫీల్డ్ రిజిస్టర్‌లో స్పష్టంగా నమోదు చేయాలని పేర్కొన్నారు.భూ వివాదాల పరిష్కారానికి తహసీల్దార్ ఆధ్వర్యంలో గ్రామస్థాయి శిబిరాలు నిర్వహించాలి. శిబిరాల అనంతరం మూడు, నాలుగు రోజుల్లో కేసులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి. గ్రామ పెద్దలు, బాధిత రైతులు, పక్క భూముల యజమానులతో చర్చించి వివాదాలను పరిష్కరించాలని ఆదేశించారు. ఉమ్మడి భూముల విభజనకు పరస్పర అంగీకారం, చట్టబద్ధత ఉంటేనే అనుమతించాలని స్పష్టం చేశారు.అభ్యంతరాలు, అప్పీళ్ల విచారణ సమయంలో అదనపు కలెక్టర్, ఆర్డీవోలు క్షేత్రస్థాయి పరిశీలనలు చేయాలని సూచించారు. అన్ని అభ్యంతరాలు పరిష్కరించిన తర్వాతే సెక్షన్ 13 కింద తుది గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఆ తర్వాతే భూభారతి రికార్డుల్లో సవరణలు చేపట్టాలని స్పష్టం చేశారు. హైదరాబాద్ జిల్లా మినహా మిగిలిన అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు ఈ మార్గదర్శకాలను అమలు చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

బాలల ప్రతిభకు బాలోత్సవం వేదిక

- **మార్కులు, ర్యాంకులకే విద్య పరిమితం కాకూడదు**
- **బాలోత్సవ నిర్వహణకు రూ.25 లక్షలు మంజూరు చేసిన మంత్రి జూపల్లి**



హైదరాబాద్,నవంబర్ 20 : పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు బాలోత్సవాలు మంచి వేదికగా నిలుస్తాయని రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. విద్యను కేవలం మార్కులు, ర్యాంకులకే పరిమితం చేయకుండా విద్యార్థుల్లో కళలు, క్రీడలు, సృజనాత్మకతను ప్రోత్సహించాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేవీ రమణాచారి అధ్యక్షతన నిర్వహించిన తెలంగాణ బాలల ఉత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బాలల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని, మూఢనమ్మకాలకు దూరంగా ఉంచాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. బాలోత్సవ నిర్వహణతోపాటు కళల అభివృద్ధికి సాంస్కృతిక శాఖ తరఫున రూ.25 లక్షలు విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులను అక్షరాస్యులుగా మార్చడంతోపాటు సమాజంలోని సామాజిక రుగ్మతలపై అవగాహన కల్పించాలని సూచించారు.విద్య, వైద్యం వ్యాపారంగా మారడం ఆందోళనకరమని, కార్పొరేట్ విద్యా విధానం వల్ల పిల్లలపై ఒత్తిడి పెరుగుతోందని పలువురు వక్తలు పేర్కొన్నారు. పిల్లల్లోని ఆసక్తులు, నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సూచించారు.రెండు రోజులపాటు జరిగే ఆరో తెలంగాణ బాలోత్సవంలో 25 విభాగాల్లో సుమారు 10 వేల మంది విద్యార్థులు పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సినీ రచయిత సుద్దాల అశోక్‌తేజ, చొక్కాపు వెంకటరమణ, బాలోత్సవ కమిటీ అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎన్.సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

సిద్ధిపేటలో కాంగ్రెస్ సామాన్య కార్యకర్తను గెలిపించుకునే సత్తా సీఎం రేవంత్ రెడ్డికి ఉంది...

- హరీష్ రావు సవాల్‌కు కాంగ్రెస్ అధికార ప్రతినిధి మదన్ మోహన్ ఘాటు మాటలు....
- సిరిసిల్ల, గజ్వేల్‌లోనూ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకునే రాజకీయ బలం మాకు ఉంది..
- సవాళ్లు కాదు, గత పదేళ్ల పాలనపై సమాధానం చెప్పాలి



బాలానగర్ నవంబర్ 20 (పీపుల్స్ న్యూస్) :సిద్ధిపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపొందితే మంత్రి పదవి ఇస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు చేసిన సవాల్‌కు కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మదన్ మోహన్ ఘాటుగా స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సిద్ధిపేటలో పోటీ చేయాలని హరీష్ రావు సవాల్ విసరడం రాజకీయ అవగాహన లేని వ్యాఖ్యలకు నిదర్శనమని ఆయన విమర్శించారు. సిద్ధిపేటలోనే కాకుండా, సిరిసిల్ల, గజ్వేల్ నియోజకవర్గాల్లో సైతం కాంగ్రెస్ పార్టీ తరఫున ఒక సామాన్య కార్యకర్తను అభ్యర్థిగా నిలబెట్టి ప్రజల మద్దతుతో గెలిపించుకునే రాజకీయ శక్తి, ధైర్యం, నాయకత్వ సామర్థ్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉన్నాయని మదన్ మోహన్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజాబలం, కార్యకర్తల బలం ఉందని, ప్రజల విశ్వాసంతో ఎలాంటి నియోజకవర్గంలోనైనా విజయం సాధించగలమని ధీమా వ్యక్తం చేశారు. హరీష్ రావు పదేపదే రాజకీయ సవాళ్లు విసరడం మానుకుని, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలు చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సిద్ధిపేటతో పాటు సిరిసిల్ల, గజ్వేల్ నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలపై బహిరంగంగా చర్చకు సిద్ధం కావాలని సూచించారు. రాజకీయాల్లో నాయకుల గొప్పతనం సవాళ్లు విసరడంలో కాకుండా ప్రజలకు చేసిన సేవలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని మదన్ మోహన్ తెలిపారు. అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలను చేరవేయడంతో పాటు వైద్య, విద్యా రంగాల్లో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలు, మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడం, రైతులకు అండగా నిలవడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, పేదల జీవన ప్రమాణాలను మెరుగు పరచడం వంటి అంశాలకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. కేవలం మాటలతోనూ, రాజకీయ సవాళ్లతోనూ ప్రజల విశ్వాసాన్ని పొందలేరని, ప్రజలకు అందించే సంక్షేమం, చేపట్టే అభివృద్ధి పనులు, పారదర్శక పాలనే నాయకులకు ప్రజాదరణ తీసుకొస్తాయని మదన్ మోహన్ పేర్కొన్నారు. హరీష్ రావు సవాళ్ల రాజకీయాలను పక్కనపెట్టి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాలని, గత పదేళ్ల పాలనకు సంబంధించిన అంశాలపై ప్రజలకు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మదన్ మోహన్ హితవు పలికారు.

30 అడుగుల నీరు ఉండి కూడా యాసంగికి నీరు లేదా?



వెంకటాపూర్ రామప్ప నవంబర్ 20 (పీపుల్స్ న్యూస్) : రామప్ప సరస్సు నిండుగా ఉన్నా, ఆయకట్టు రైతుల గొంతు ఎండిపోతుంది. ప్రస్తుతం సరస్సులో 30 అడుగులకు పైగా నీరు ఉన్నా, యాసంగి పంటకు నీరు వదులుతారా లేదా అనేది ఇంకా ప్రశ్నార్థకంగానే మిగిలి పోయింది.గతంలో 20 అడుగుల నీరు ఉన్నప్పుడే యాసంగికి నీరు ఇచ్చారు. మరి ఇప్పుడు 30 అడుగులు ఉండి కూడా నీరు ఇవ్వకపోతే, నీరు ఎవరి కోసం దాచుతున్నారు? అని రైతులు నిలదీస్తున్నారు.తాగునీటికి 10 అడుగులు పోనూ, మిగిలిన 20 అడుగుల నీటితో ఆయకట్టు మొత్తం పారించవచ్చు. అయినా అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారు? అనేది రైతుల ప్రశ్న.నీరు ఉండి కూడా పంట ఎండిపోతే, దానికి బాధ్యత ఎవరిది? రైతులు నష్టపోతే ప్రభుత్వం ఆదుకుంటుందా? అధికారులు వెంటనే స్పం దించి, ఆయకట్టు చివరి పొలం వరకు నీరు అందించకపోతే, రైతులు ఆందోళనకు దిగక తప్పదని హెచ్చరిస్తున్నారు.నీరు ఉన్నది చూపించ డానికా? పంట పండించడానికా?

లింగాల భాగ్యమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ జిల్లా నాయకులు భూక్య జంపన్న






వెంకటాపూర్ నవంబర్ 20 (పీపుల్స్ న్యూస్) : ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ వెంకటాపూర్ మండల అధ్యక్షులు లింగాల రమణారెడ్డి మాతృమూర్తి కీర్తిశేషులు లింగాల భాగ్యమ్మ గుండెపోటుతో స్వర్గస్తులయ్యారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ జిల్లా నాయకులు భూక్య జంపన్న వెంకటాపూర్ చేరుకొని భాగ్యమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ విషాద సమయంలో వారికి మనోధైర్యం కలగాలని . భాగ్యమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో తమ తోపాటు మల్లంపల్లి బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్ గోవింద్‌రావుపేట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు లకావత్ నరసింహ నాయక్ మాజీ ఎంపిటిసి మాచర్ల ప్రభాకర్ వెంకటాపూర్ టౌన్ అధ్యక్షులు నర్రా భద్రయ్య యాదగిరి మాజీ సర్పంచ్ వీర మల్లు- అనిత మాజీ ఎంపీటీసీ మాజీ కో ఆప్షన్ పాషా చంటి భద్రయ్య విజేందర్ నూనె రమేష్ మెట్టు మల్లయ్య మాజీ సర్పంచ్ మోహన్ రాథోడ్ ఉద్యమ కారులు అజ్మీరా సురేష్ సంజీవ రాంబాబు కళ్యాణ్ డేవిడ్ తిరుపతి పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్‌లో ఘనంగా 'చేయూత' పింఛన్ల పత్రాల పంపిణీ

- చేయూత' పింఛన్ల పథకం కింద కూకట్‌పల్లి నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 4,206 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేయగా, అందులో ఒక్క బాలానగర్ డివిజన్‌లోనే 702 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేశాము....




బాలానగర్ నవంబర్ 20 (పీపుల్స్ న్యూస్) :తెలంగాణ రాష్ట్రంలో పేదల సంక్షేమమే లక్ష్యంగా, సమాజంలోని అట్టడుగు వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే సంకల్పంతో తెలంగాణ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పింఛన్ల పథకం ద్వారా మరోసారి అనేక నిరుపేద కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. వృద్ధాప్యం, అనారోగ్యం, వైకల్యం, కుటుంబ పెద్దను కోల్పోవడం వంటి పరిస్థితులతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం కొత్తగా పింఛన్లు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని బాలానగర్ వార్డు కార్యాలయంలో నూతన పింఛన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పులి శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో మొత్తం 4,206 మందిని కొత్త పింఛన్ల లబ్ధిదారులుగా ఎంపిక చేయడం హర్షణీయమన్నారు. ఇందులో ఒక్క బాలానగర్ డివిజన్‌లోనే 702 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు కావడం విశేషమని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఒంటరి మహిళలు తదితర అర్హులైన వర్గాలకు ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందనుందని పేర్కొన్నారు. పింఛన్ అనేది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలిచే భరోసా అని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా వృద్ధులు, భర్తను కోల్పోయిన మహిళలు, శారీరక వైకల్యంతో ఉపాధి పొందలేని దివ్యాంగులకు ఈ పింఛన్లు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. నిత్యావసరసరుకులు, మందులు, ఇతర వ్యక్తిగత అవసరాలకు ఈ ఆర్థిక సహాయం కొంతమేర తోడ్పడుతుందని వివరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. కులం, మతం, ప్రాంతం అనే భేదాలు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి వారికి అండగా నిలిచే కార్యక్రమాలను ప్రభుత్వం మరింత విస్తృతంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి మధు మోహన్, జిల్లా ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి జల్లా శివ, కూకట్‌పల్లి నియోజకవర్గ ఎస్సీ విభాగం అధ్యక్షుడు మాట్టే ప్రసన్న కుమార్, సీనియర్ నాయకులు ఎరుపుల మహేందర్, పులి శ్రీకాంత్ గౌడ్, రవి ముదిరాజ్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు, నూతన పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు

విద్యార్థుల చేతికి రోడ్డు భద్రత బాధ్యతలు.. పల్లవి పాఠశాలలో ట్రాఫిక్ సేఫ్టీ క్లబ్ ఏర్పాటు!

- కార్యక్రమంతో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన.. రోడ్డు భద్రతా రాయబారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం







మల్కాజిగిరి కమిషనరేట్: క్రైమ్ బ్యూరో నవంబర్ 20 (పీపుల్స్ న్యూస్) :రోడ్డు ప్రమాదాల నివారణకు చిన్ననాటి నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించుకోవాలని మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు విద్యార్థులకు సూచించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి ఆదేశాల మేరకు, డీసీపీ ట్రాఫిక్-1 కె. రాహుల్ రెడ్డి పర్యవేక్షణలో, ట్రాఫిక్ తిరుమలగిరి డివిజన్ ఏసీపీ జి. శంకర్ రాజు ఆధ్వర్యంలో తుమ్మకుంటలోని పల్లవి పాఠశాలలో 'ఊ==xఎజు ఊఊxఎజు' పేరుతో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు హెల్మెట్ ధరించడం, కారులో ప్రయాణించేటప్పుడు సీట్‌బెల్ట్ పెట్టుకోవడం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, జీబ్రా క్రాసింగ్ వద్దే రోడ్డు దాటడం వంటి కీలక అంశాలపై అవగాహన కల్పించారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం, ట్రిపుల్ రైడింగ్ వంటి ఉల్లంఘనలు ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తాయని వివరించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో ట్రాఫిక్ సేఫ్టీ క్లబ్‌ను ప్రారంభించారు. విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై నిరంతర అవ గాహన కల్పించడంతో పాటు, వారిని రోడ్డు భద్రతా రాయ బా రులుగా తీర్చిదిద్దడమే ఈ క్లబ్ ప్రధాన ఉద్దేశమని పోలీసులు తెలిపారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, తోటి విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిం చాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, ఎస్‌హెచ్‌ఓ జి. పవన్ కుమార్ రెడ్డి, అదనపు ఇన్‌స్పెక్టర్ జి. జానకి రాములు, ఎస్ఐ ఎ. నవీన్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

- విద్యార్థులే రోడ్డు భద్రతా రాయబారులు!

బీజేవైఎం రాష్ట్ర కార్యాలయ జాయింట్ సెక్రటరీగా శ్యామ్ కిరణ్ రెడ్డి నియామకం



- నాపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు -- శ్యామ్ కిరణ్ రెడ్డి

హైదరాబాద్: నవంబర్ 20 (పీపుల్స్ న్యూస్) : భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) తెలంగాణ రాష్ట్ర కార్యాలయ జాయింట్ సెక్రటరీగా నియమితులైన శ్యామ్ కిరణ్ రెడ్డి, తన నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుండే, బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలుపుతూ, పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తానని పేర్కొన్నారు. బీజేవైఎం అభివృద్ధికి, యువతను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడానికి అంకిత భావంతో కృషి చేస్తానని శ్యామ్ కిరణ్ రెడ్డి తెలిపారు. అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని వెల్లడించారు.

ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవంలో అధికారుల నిర్లక్ష్యం.. సర్పంచును పక్కనపెట్టి ప్రారంభోత్సవం



మాగనూరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో అధికారుల వ్యవహారశైలి వివాదానికి దారితీస్తోంది. మాగనూరు మండలం మందిపల్లి గ్రామంలో సర్పంచు కనీస సమాచారం, ఆహ్వానం లేకుండానే ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించడంపై బీఆర్ఎస్ సర్పంచులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలో ప్రజల చేత ఎన్నికైన సర్పంచును పక్కనపెట్టి, గ్రామానికి సంబంధించిన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించడం ప్రజాప్రతినిధుల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉందని వారు ఆరోపిస్తున్నారు. ఒకవైపు మంత్రి స్థాయి నుంచి సర్పంచుల స్థాయి వరకు ప్రజాప్రతినిధుల గౌరవం, స్థానిక పాలన ప్రాధాన్యత గురించి గొప్పలు చెబుతున్న ప్రభుత్వం, మరోవైపు గ్రామ సర్పంచులను ప్రభుత్వ కార్యక్రమాలకు దూరంగా ఉంచడం ఎంతవరకు సమంజసమని బీఆర్ఎస్ సర్పంచులు ప్రశ్నిస్తున్నారు.గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాల్సిన అధికారులు ఇలాంటి వ్యవహారాలకు పాల్పడటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల సొంతింటి కల నెరవేర్చే ప్రతిష్టాత్మక కార్యక్రమం కాగా, దాని ప్రారంభోత్సవాల్లోనే ప్రజాప్రతినిధుల మధ్య విభేదాలు, ఆహ్వానాల వివాదాలు తలెత్తడం ప్రభుత్వ పాలన తీరుపై విమర్శలకు తావిస్తోంది. ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి, స్థానిక ప్రజాప్రతినిధులకు గౌరవం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సర్పంచులు డిమాండ్ చేస్తున్నారు.

రుకుల పాఠశాలలో మళ్లీ జూనియర్లపై కట్టెలతో సీనియర్ల దాడి, ముగ్గురికి తీవ్ర గాయాలు



రాజాపేట : యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సీనియర్ విద్యా ర్థుల దాడులు ఆగడం లేదు. గతంలో జూనియర్లపై బ్యాట్లు, వికెట్లతో దాడి చేసిన ఘటన మరువక ముందే మరోసారి ఎనిమిదో తరగతి విద్యార్థులపై పదో తరగతి విద్యార్థులు కట్టెలతో దాడి చేశారు. ఎన్సీసీ పరేడ్‌కు షూలు వేసుకురాలేదనే కారణంతో ముగ్గురు విద్యార్థులను చితకబాదడంతో కాళ్లు, చేతులు, నడుము భాగాల్లో గాయాలయ్యాయి. నవంబర్ 16న సోమవారం సాయంత్రం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.రాజాపేట గురుకులానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఈ దాడిలో గాయపడ్డారు. గతంలోనూ ఇలాంటి ఘటన చోటుచేసుకోగా మరోసారి దాడి జరగడం పాఠశాల పర్యవేక్షణ తీరుపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. ఘటనపై నవంబర్ 17న క్రమశిక్షణ కమిటీ ఇరువర్గాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులను పిలిపించి విచారించి కౌన్సెలింగ్ నిర్వహించింది. ఈ ఘటనపై పాఠశాల యాజమాన్యం శుక్రవారం తాజాగా పత్రికా ప్రకటన విడుదల చేసింది. నవంబర్ 17న క్రమశిక్షణ కమిటీ సమావేశమై సంబంధిత విద్యార్థులు, బాధితులు, వారి తల్లిదండ్రులను విచారించినట్లు వెల్లడించింది.వారం రోజుల పాటు సస్పెండ్

అనంతరం దాడికి పాల్పడిన ముగ్గురు పదో తరగతి విద్యార్థులను వారం రోజుల పాటు సస్పెండ్ చేయాలని నిర్ణయించి, తల్లిదండ్రులతో కలిసి ఇంటికి పంపించినట్లు తెలిపారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, పరస్పర గౌరవం, సోదరభావం పెంపొందించడమే లక్ష్యమని, క్రమశిక్షణ విషయంలో ఎలాంటి ఉపేక్ష ఉండదని స్పష్టం చేసింది. అయితే గురుకులంలో వరుసగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, గత ఘటనపైనా సమీక్షించి విద్యార్థుల భద్రతకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు..

సీఎం హుందాతనాన్ని కాపాడుకోవాలి : ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



గజ్వేల్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధిపేట పర్యటనలో ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై మాట్లాడకుండా కేసీఆర్, హరీశ్ రావు, వారి కుటుంబంపై వ్యక్తిగత విమర్శలకే ప్రాధాన్యం ఇవ్వడం దురదృష్టకరమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. సీఎం పర్యటనతో తమ ప్రాంతానికి అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిధులు వస్తాయని, పెండింగ్ ప్రాజెక్టు కాలువలకు మోక్షం కలుగుతుందని, రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా, రైతుబంధు అందుతాయని, రోడ్లు బాగుపడతాయని ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని అన్నారు. కానీ రేవంత్ రెడ్డి మాత్రం తిట్ల పురాణంతో సరిపెట్టారని మండిపడ్డారు.గజ్వేల్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒంటేరు ప్రతాప్ రెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జిల్లాల పర్యటనకు వచ్చినప్పుడు ముందుగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో మాట్లాడి ప్రాంతంలోని సమస్యలను తెలుసుకునేవారని గుర్తు చేశారు. విద్యుత్, సాగునీరు, రోడ్లు, అభివృద్ధి పనులకు సంబంధించిన సమస్యలను సభలో ప్రస్తావించి, అవసరమైన నిధులు వెంటనే మంజూరు చేసేవారని తెలిపారు.కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాల స్క్రిప్ట్‌తో వస్తే.. రేవంత్ రెడ్డి విమర్శలు, వ్యక్తిగత దూషణల స్క్రిప్ట్‌తో వసు?నారని ఎద్దేవా చేశారు. కానీ సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి మాట్లాడే మాటలకు ఒక హుందాతనం ఉండాలని, దిగజారుడు వ్యాఖ్యలు చేయడం వల్ల ముఖ్యమంత్రి పదవికే గౌరవం తగ్గుతుందని అన్నారు. ఎక్కడికి వెళ్లినా కేసీఆర్ కుటుంబాన్ని విమర్శించడం మానుకోవాలని, ప్రజలు ఇలాంటి వ్యాఖ్యలను హర్షించడం లేదని పేర్కొన్నారు.

తన సొంత పార్టీ ఎమ్మెల్యేలే ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రభుత్వ పనితీరుపై వ్యాఖ్యలు చేస్తున్నారని, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి నిధులు విడుదల కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని గుర్తు చేశారు. సొంత పార్టీ ఎమ్మెల్యేల సమస్యలు పరిష్కరించలేని ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుల వెంట పడటం ఏమిటని ప్రశ్నించారు.

కేసీఆర్ కుటుంబంపై చేసిన వ్యాఖ్యల ను తీవ్రంగా ఖండిస్తున్నామని, రేవంత్ రెడ్డి తన మాటతీరును మార్చుకోవాలని సూచించారు.

రేవంత్ రెడ్డి మానసిక స్థితి సరిగా ఉందో లేదో అర్థం కావడం లేదు : వేముల ప్రశాంత్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 20:రేవంత్ రెడ్డి మానసిక స్థితి సరిగా ఉందో లేదో అర్థం కావడం లేదు లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. మొన్న సిరిసిల్ల పోయి అక్కడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తాను అన్నాడు. నిన్న సిద్దిపేట పోయి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తాను అంటున్నాడు నీ కేబినెట్‌లోనే 3 మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. ముందు అవి నింపు అని ఎద్దేవా చేశారు.ముందు అవి ఇవ్వడానికే నీకు లాగు తడుస్తుంది. ఎవరికి ఇస్తే ఏ ఎమ్మెల్యే వెళ్లిపోతాడో అని భయపడుతున్నావు నీ కేబినెట్‌లో ఉన్న మంత్రి పదవులే నీకు నింపడం చేత కావడం లేదన్నారు.రెండేళ్ల తర్వాత నువ్వు గెలుస్తావో గెలవవో తెలియని ఎన్నికల్లో మంత్రి పదవి ఇస్తానని తుపాకి రాముడి మాటలు చెప్తున్నావు. ప్రజలే నీకు బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

కాంగ్రెస్ మంత్రులకు కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి రిక్వెస్ట్



హైదరాబాద్, నవంబర్ 20: సొంతపార్టీ నేతలపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రాన్ని దొంగలకు, పెట్టుబడిదారులకు, కాంట్రాక్టర్లకు దోచిపెట్టకండి అంటూ మంత్రులకు ఎమ్మెల్యే రిక్వెస్ట్ చేశారు. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని విమర్శించారు. కనీసం కాంగ్రెస్ మంత్రులైనా నిజాయితీగా పాలన చేయాలని హితవుపలికారు. పేదలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి విషయంలో న్యాయంగా వ్యవహరించాలన్నారు.ప్రభుత్వానికి మంచి బుద్ధిని ప్రసాదించాలని అయ్యప్ప స్వామిని వేడుకుంటున్నానని ఎమ్మెల్యే అన్నారు. అహంకారంతో మాట్లాడటం మానేసి మంచిగా పాలనచేయాలన్నారు. మంచి పాలన అందిస్తే ప్రజలు మళ్లీ ఆశీర్వదిస్తారని తెలిపారు. 'ప్రతిపక్షాలపై విరుచుకుపడటం కాదు.. మీరిచ్చిన హామీలేంటి? ఇప్పుడు చేస్తున్నదేంటి?' అని ప్రశ్నించారు. నిజాయితీగా, అవినీతి లేకుండా పాలన చేస్తున్నారా లేదా అనేది ఒక్కసారి గుండె మీద చేయి వేసుకుని ఆత్మపరిశీలన చేసుకోవాలంటూ రాష్ట్ర మంత్రులను ఉద్దేశించి ఎమ్మెల్యే రాజ్‌గోపాల్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు.


మండిపోతున్న కూరగాయల ధరలు



మహబూబాబాద్: కూరగాయల ధరలు మండిపోతున్నాయి. గత 15రోజుల్లో వాటిరేట్లు రెండింతలయ్యాయి. దీంతో పేదలు, మధ్య తరగతి వారు కొనడానికి విలవిల్లాడుతున్నారు. ఇప్పటికే బియ్యం ధరలు, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశన్నంటడంతో పాటు కూరగాయల రేట్లు అధికమవడంతో పేదలపై ఆర్థిక భారం పడుతోంది. తెలంగాణలో ఎల్‌నినో ప్రభావం, ఆంధ్రప్రదేశ్‌లో తుఫాన్‌తో నేపథ్యంలో దిగుబడులు భారీగా తగ్గాయి. ఒకప్పుడు కూరగాయల మార్కెట్‌కు రూ.100 తీసుకువెళ్తే చేతి సంచి నిండేది.. ఇప్పుడు రూ.500 తీసుకుపోయిన సంచి నిండక పోగా, వారం గడవక పాయే అని వాపోతున్నారు.తెలంగాణ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో భూగర్భజలాలు అడుగంటి పోవడంతో కూరగాయల పంటలు గతంలో కంటే తక్కువగా సాగు చేయడం వేసిన పంటలు కూడా చేతికందకుండా ఎండి పోయాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వరుస తుపాన్‌లతో పంటలు దెబ్బతిని అక్కడా దిగుబడి దక్కడంతో ఒక్కసారిగా కూరగాయల ధరలకు రెక్కలొచ్చి సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. నిత్యావసర సరుకులతో పాటు కూరగాయలు, ఇలా అన్నింటి ధరలు పెరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.తెలంగాణలో ఎల్‌నినో.. ఏపీలో తుఫాన్ ప్రభావంతో..ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఇప్పటికే 365 కరువు మండలాలను ప్రకటించగా, మహబూబాబాద్ జిల్లాలో ఏడింటిని కరువు మండలాలుగా ప్రకటించిన సంగతి తెలిసిందే!

తెలంగాణ వ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో భూగర్భజలాలు అడుగంటి వర్షాలు సరిగా కురవక లోటు వర్షపాతం నమోదు కావడంతో చెరువులు, కుంటలు, వ్యవసాయ బావులు, బోర్లలో నీటిమట్టం తగ్గిపోయి పంటలు వేయలేకపోయారు. కాస్తకూస్తో వేసిన పంటలు సైతం ఎండిపోయి చేతికందకుండా పోయాయి. దీంతో రైతులు చేసేదేమి లేక ఆకాశం వైపు ఎదురు చూస్తూ కూర్చున్నప్పటికీ వరుణ దేవుడు కరుణించకపోవడంతో వర్షాలు కురవక పంటలు పూర్తిగా దెబ్బతిన దిగుబడులు తగ్గిపోయాయి.ష్ట్రఅన2.3.యజూస్ట్రఈ క్రమంలో కూరగాయల వ్యాపారులు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుని అమ్ముతున్నారు. ఏపీలో సైతం వరుస తుఫాన్‌లతో పంటలు పూర్తిగా దెబ్బతిని కూరగాయల ధరలు ఒక్కసారిగా అమాంతం పెరగడంతో కూరగాయల ధరలు రెట్టింపు ధరలు పలుకుతున్నాయి. దీంతో మార్కెట్‌కు వచ్చిన వినియోగదారుల జేబులకు చిల్లులు పడుతున్నాయి.బియ్యం, నిత్యావసర సరుకుల ధరలు పెరిగి ఆర్థిక భారం మోస్తుంటే మళ్లీ కూరగాయల ధరలు విపరీతంగా పెరగడంతో సామన్య, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోజువారీ కూలీ చేసేవారు, చిరు ఉద్యోగులు, సన్నకారు రైతులు ఆర్థికంగా ఇబ్బందు లు పడుతూ అప్పులు చేస్తున్నారు. ఇంటి అద్దె లు మొదలుకుని అన్నింటి వస్తువుల ధరలు పెరిగి పోవడంతో చాలీచాలనీ వేతనాలతో సతమతమవుతున్నారు. సామాన్య, మధ్యతరగతి వర్గాల్లో ఇంటిల్లి పాది కష్ట పడితే తప్ప పూటగడవని పరిస్థితి నెలకొంది. గతంలో కూరగాయలకు రోజూరూ.50 వెచ్చిస్తే సరిపోయేదని.. పెరగిన ధరలతో రోజూ ఒక్క కూరగాయలకే రూ.100 ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇలా నెలకు రూ.3 వేలు కేటాయిస్తున్నారు.నిత్యావసర సరుకులు, బియ్యం, ఇతరత్రా వస్తువులు ఎలా కొనుగోలు చేసేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పడే ఇలా ఉంటే ఎల్‌నినో ప్రభావంతో ముమ్ముందు కుటుంబాలు గడిచేది ఎలా అని ఆందోళన చెందుతున్నారు. కూరగాయల ధరల పెరుగుదలతో కొనుగోలు స్థోమత లేని పేదలు పచ్చటి మెతుకులతో పూట గడుపుతున్నారంటే అతిశయోక్తి కాదు.

హైదరాబాద్ డాక్టర్ శివరంజని కృషి.. రూ.9 కోట్ల మెడిసిన్ రూ.2.5 లక్షలకే, ఏడుగురు చిన్నారులకు ఉచిత చికిత్స



హైదరాబాద్ : హైదరాబాద్ డాక్టర్ శివరంజని కృషితో అరుదైన జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న ఏడుగురు చిన్నారులకు ఉచిత చికిత్స అందనుంది. ఈ వ్యాధి చికిత్సలో ఉపయోగించే మెడిసిన్ ధర ఏడాదికి రూ.9 కోట్లు ఉండగా.. తాజాగా రూ.2.5 లక్షలకు తగ్గింది. ఈనెల 30న హైదరాబాద్‌లో ఇద్దరు చిన్నారులకు, బెంగళూరులో మరో ఐదుగురికి తొలి విడత మందులు అందజేస్తారు. భవిష్యత్తులో ఈ ఔషధాన్ని భారత్‌లోనే తయారు చేసి మరింత మందికి అందుబాటులోకి తీసుకురావాలని డాక్టర్ శివరంజని లక్ష్యంగా పెట్టుకున్నారు.ఒక అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ప్రాణాధారంగా నిలిచే ఔషధం అందుబాటులో ఉన్నా.. దాని ధర కోట్ల రూపాయల్లో ఉండటంతో తల్లిదండ్రులు చికిత్స చేయించలేని పరిస్థితి. అలాంటి కుటుంబాలకు హైదరాబాద్‌కు చెందిన పీడియాట్రిషియన్ డాక్టర్ శివరంజని సంతోష్ కొత్త ఆశలు కల్పించారు. ఆమె అవిశ్రాంత ప్రయత్నాలు, అంతర్జాతీయ సంస్థల సహకారంతో ఏడాది చికిత్సకు రూ.9 కోట్ల వరకు ఖర్చయ్యే ఔషధాన్ని సుమారు రూ.2.5 లక్షలకే అందుబాటులోకి తీసుకొచ్చారు. అంతేకాదు.. ఈ మందును అరుదైన జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న ఏడుగురు చిన్నారులకు ఏడాది పాటు ఉచితంగా అందించనున్నారు. ఈనెల 30వ తేదీ నుంచి ఈ మందుల పంపిణీ ప్రారంభం కానుంది.నెదర్లాండ్స్‌కు చెందిన ఫార్మాస్యూటికల్ అకౌంటబిలిటీ ఫౌండేషన్ (పీఏఎఫ్), ది హేగ్‌లోని ట్రాన్స్‌వాల్ ఫార్మసీ సహకారం తీసుకున్నారు. ఈ మెడిసిన్‌లోని క్రియాశీల పదార్థాన్ని ఉపయోగించి ఫార్మాస్యూటికల్ కాంపౌండింగ్ విధానంలో ప్రత్యామ్నాయ ఫార్ములేషన్‌ను రూపొందించారు. దీంతో ఏడాది చికిత్సకు ఒక్కో చిన్నారికి సుమారు రూ.2.5 లక్షల ఖర్చుతో ఈ మందును అందించే అవకాశం ఏర్పడింది.డాక్టర్ శివరంజని వద్ద చికిత్స పొందుతున్న అరవ్ అనే చిన్నారికి ఏహెచ్‌డీఎస్ ఉన్నట్లు నిర్ధారణ కావడంతో ఈ ప్రయత్నం మొదలైంది. ఆ బిడ్డకు మందు అందించేందుకు తల్లి పవిత్ర సిరోల్మర్ తీవ్రంగా శ్రమించారు. జర్మనీ నుంచి కేవలం ఒక నెలకు సరిపడా మందుల కోసం రూ.12 లక్షల నుంచి రూ.13 లక్షల వరకు సమకూర్చాల్సి వచ్చింది.

మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ ఇళ్లలో ఈడీ సోదాలు.. రూ.40.96 కోట్ల ధాన్యం పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు



ఖానాపూర్ : మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ ఇళ్లపై ఈడీ దాడులు నిర్వహించింది. కస్టమ్ మిల్లింగ్ రైస్ వ్యవహారంలో సోదాలు చేపట్టింది. ఆమె రైస్ మిల్లుకు ప్రభుత్వం కేటాయించిన ధాన్యంలో భారీగా నిల్వలు లెక్కల్లో తేలలేదని పౌరసరఫరాల శాఖ ఆరోపించింది. మొత్తం రూ.40.96 కోట్ల విలువైన 9,639 టన్నుల ధాన్యం పక్కదారి పట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. విజిలెన్స్ తనిఖీల తర్వాత ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టిన తెలంగాణలో మరో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్‌కు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. రూ.40.96 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి పట్టినట్లు వచ్చిన ఆరోపణలపై శుక్రవారం ఉదయం ఖానాపూర్, హైదరాబాద్‌లో రేఖా నాయక్‌కు సంబంధించిన 2 ప్రాంతాల్లో ఈడీ అధికారులు ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఆమె రైస్ మిల్లుకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ధాన్యం, బియ్యం నిల్వలు, సరఫరా వివరాలతో పాటు కీలక రికార్డులను పరిశీలిస్తున్నారు.ఖానాపూర్ మండలం సత్తెనపల్లిలో రేఖానాయక్‌కు చెందిన ఏఆర్ఎస్ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లు ఉంది. ఈ మిల్లుకు రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కేటాయించి.. మిల్లింగ్ అనంతరం నిర్ణీత పరిమాణంలో బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అప్పగించేలా ఒప్పందాలు చేసుకుంది.

పీఎం స్వనిధి అమలులో ఏపీ మెప్మాకు జాతీయ అవార్డులు.. మంత్రి నారాయణ హర్షం



అమరావతి, నవంబర్ 20: పీఎం స్వనిధి స్కీమ్ అమలులో మెప్మాకు(పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) జాతీయ స్థాయిలో అవార్డులు రావడంపై మంత్రి నారాయణ హర్షం వ్యక్తం చేశారు. పీఎం స్వనిధి పథకం ద్వారా వీధి వ్యాపారులకు మెప్మా ఆధ్వర్యంలో తక్కువ వడ్డీకే రుణాలను ఏపీ ప్రభుత్వం మంజూరు చేయిస్తోంది. పథకం అమల్లో జాతీయ స్థాయిలో మూడో స్థానంలో, ఎక్కువ మందికి రుణాల మంజూరులో రెండో స్థానంలో, స్పెషల్ క్యాంప్‌ల నిర్వహణలో ప్రథమ స్థానంలో ఏపీ మెప్మా నిలిచింది. అలాగే వీధి వ్యాపారుల కుటుంబాలకు సంక్షేమ పథకాలను అమలు చేసే స్వనిధి సే సమృద్ధి కార్యక్రమంలో రాష్ట్రంలోని మున్సిపాలిటీలు ముందంజలో ఉన్నాయి.జాతీయ స్థాయిలో రామచంద్రాపురం, అమలాపురం మున్సిపాలిటీలు.. మొదటి, రెండో స్థానాల్లో అవార్డులు పొందాయి. అలాగే డిజి టల్ లావాదేవీల నిర్వహణలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ జాతీయ స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో అవార్డులు పొందిన అధికారులు, ఆయా మున్సిపాలిటీల సిబ్బందికి మంత్రి నారాయణ అభినందనలు తెలియజేశారు. సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధతో పట్టణాల్లో మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయన్నారు. రాబోయే రోజుల్లో మెప్మా ద్వారా మహిళలను ఆర్థికంగా వృద్ధి చెందేలా మరిన్ని చర్యలు
తీసుకుంటామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

పగిడ్యాల ఎంపీపీ ఎన్నిక మరోసారి వాయిదా.. కోరం లేక నిలిచిన ప్రక్రియ



నంద్యాల, నవంబర్ 20: జిల్లాలోని పగిడ్యాల మండల పరిషత్ అధ్యక్ష (ఎంపీపీ) ఎన్నిక మరోసారి వాయిదా పడింది. కోరం లేకపోవడంతో ఎన్నిక నిర్వహించలేమని అధికారులు ప్రకటించారు. తదుపరి ఎన్నిక తేదీని త్వరలో ప్రకటిస్తామని రిటర్నింగ్ అధికారి (ఆర్వో) నగేష్ వెల్లడించారు. శుక్రవారం ఎంపీపీ ఎన్నిక నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే, అవసరమైన కోరం హాజరు కాకపోవడంతో ఎన్నిక ప్రక్రియ ముందుకు సాగలేదు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే జయసూర్య, ఎంపీ బైరెడ్డి శబరి వర్గీయుల మధ్య ఏకాభిప్రాయం కుదిర్చేందుకు టీడీపీ అబ్జర్వర్ చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ, ఆ చర్చలు ఫలించలేదు.ఇరువర్గాల నేతలు తమ పట్టు వీడకపోవడంతో సమస్య కొలిక్కి రాలేదు. చర్చల నేపథ్యంలో ఎంపీటీసీ సమావేశ మందిరం నుంచి వెనుదిరిగినట్లు తెలుస్తోంది. దీంతో కోరం లేకపోవడంతో అధికారులు ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన పగిడ్యాల ఎంపీపీ ఎన్నిక మరోసారి వాయిదా పడటంతో స్థానికంగా ఉత్కంఠ కొనసాగుతోంది. తదుపరి ఎన్నిక తేదీని అధికారులు ప్రకటించిన తర్వాతే
ఎన్నిక ప్రక్రియపై స్పష్టత రానుంది.

శ్రీరంగం శ్రీ రంగనాథస్వామివారికి టీటీడీ ఈవో పట్టువస్త్రాల సమర్పణ



తిరుపతి : తమిళనాడు రాష్ట్రంలోని ప్రముఖ వైష్ణవ దివ్యక్షేత్రం శ్రీరంగంలోని శ్రీ రంగనాథస్వామి వారికి శుక్రవారం టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీరంగం ఆలయానికి చేరుకున్న టీటీడీ ఈవోకు ఆలయ జాయింట్ కమిషనర్ ప్రకాష్, ప్రధానార్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ మర్యాదలతో ఊరేగింపుగా స్వామివారి సన్నిధికి తీసుకెళ్లి పట్టువస్త్రాలు సమర్పించారు.స్వామివారి దర్శనం అనంతరం ఆలయ అధికారులు ఈవోకు తీర్థప్రసాదాలు అందజేశారు. తమిళ కార్తీక ఏకాదశిని పురస్కరించుకుని 2006 నుంచి టీటీడీ ప్రతి ఏటా శ్రీరంగం శ్రీ రంగనాథస్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తోంది. ప్రాచీన శ్రీవైష్ణవ దివ్యక్షేత్రాలతో ఆధ్యాత్మిక అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తూ ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తోంది. అదేవిధంగా, తిరుమల శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం సందర్భంగా శ్రీరంగం ఆలయం నుంచి కూడా ప్రతి ఏటా శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ బొక్కసం ఇన్‌చార్జి గురురాజస్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ ,విజిలెన్స్ గార్డు నియామక నిబంధనల్లో ఎలాంటి మార్పులు చేయలేదు




తిరుమల : టీటీడీ విజిలెన్స్ విభాగంలోని సెక్యూరిటీ, విజిలెన్స్ గార్డు పోస్టుల ప్రత్యక్ష నియామకాలకు సంబంధించి మాజీ సైనికులు, పౌరుల మధ్య అమలులో ఉన్న 1:2 నిష్పత్తిని రద్దు చేస్తూ టీటీడీ సాధికార మండలి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని టీటీడీ స్పష్టం చేసింది.ఈ నిష్పత్తిని మార్చి కొత్త విధానంలో నియామకాలు చేపట్టే అంశం కేవలం ప్రతిపాదన దశలోనే ఉందని, దీనిపై ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని తెలియజేసింది. గతంలో అమలులో ఉన్న నియామక విధానమే ప్రస్తుతం కూడా యథాతథంగా కొనసాగుతోందని, నియామక నిబంధనల్లో ఎలాంటి మార్పులు చేయలేదని స్పష్టం చేసింది. ఈ అంశంపై ఎలాంటి అపోహలకు తావివ్వకుండా, అసత్య ప్రచారాలను నమ్మవద్దని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి అల్టిమేటం.. రాత్రికి రాజీనామాపై నిర్ణయం..!



కడప జిల్లా : రాజకీయాలు ఒక్కసారిగా హీట్ ఎక్కాయి. కడప జడ్పీ చైర్మన్ పీఠం విషయంలో తలెత్తిన విభేదాలతో జమ్మల మడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు రెడీ అవ్వడమే కాకుండా రాత్రికి జరిగే చర్చల తర్వాత ఫైనల్ నిర్ణయం ప్రకటిస్తానని అల్టిమేటం కూడా జారీ చేశారు. దీంతో ఈ అంశం రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపుతోంది. ఈ నేపథ్యంలో ఆదినారాయణ రెడ్డితో పాటు.. జడ్పీటీసీలుగా గెలిచిన ఆయన సోదరుల కుమారులు కూడా తమ పదవులకు రాజీనామా చేసేందుకు సిద్ధమైనట్టు సమాచారం.ఏపీ అధికార కూటమిలో కడప జిల్లా రాజకీయాలు ఒక్కసారిగా హీట్ ఎక్కాయి. కడప జిల్లా పరిషత్ చైర్మన్ పీఠం విషయంలో తలెత్తిన విభేదాలతో జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు రెడీ అవ్వడమే కాకుండా రాత్రికి జరిగే చర్చల తర్వాత ఫైనల్ నిర్ణయం ప్రకటిస్తానని అల్టిమేటం జారీ చేశారు. దీంతో ఈ అంశం రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపుతోంది.ఈ వ్యవహారంపై ఆదినారాయణ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. "నాకు ఎమ్మెల్యే పదవి కొత్త కాదు.. రాజకీయ మార్పు చాలా తేలిక. మాకు బీజేపీ అధిష్టానం సపోర్ట్ ఉంది, నాకు మంత్రి పదవులు అవసరం లేదు. మేము చెబుతున్న సమస్యకు పరిష్కారం లభిస్తుందో..? లేదో..? వేచి చూస్తున్నాం. రాత్రికి జరిగే చర్చల అనంతరం నా రాజీనామాపై స్పష్టమైన ప్రకటన చేస్తాను" అని ఆయన తేల్చి చెప్పారు.బుజ్జగింపుల పర్వం...
ఉదయం నుంచే ఆదినారాయణ రెడ్డి రిజైన్ చేస్తున్నారనే ప్రచారం సాగుతుంది. దీంతో బీజేపీ అధిష్టానం అప్రమత్తమైనట్టు తెలుస్తుంది. ఇందులో భాగంగా విజయవాడకు చేరుకున్న ఆదినారాయణ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులతో బీజేపీ నాయకులు మాధవ్, విష్ణు కుమార్ రాజు తదితరులు సమావేశమై చర్చలు జరిపారు. అనంతరం ఈ పరిణామాలపై మాధవ్ స్పందిస్తూ కూటమిలో ఐక్యతను చాటే ప్రయత్నం చేశారు. కూటమి ఒక కుటుంబంలాటిందని, ఫ్యామిలీలో అక్కడక్కడ చిన్న చిన్న సమస్యలు రావడం సహజమని ఆయన చెప్పుకొచ్చారు. అన్నీ చర్చల ద్వారా పరిష్కారం అయిపోతాయనే ఆశాభావం కూడా వ్యక్తం చేశారు.టీడీపీ పెద్దల తీరుపై జడ్పీటీసీ రాజేష్ రెడ్డి ఆగ్రహం...మరోవైపు ఈ రభసపై జమ్మలమడుగు జడ్పీటీసీ రాజేష్ రెడ్డి తీవ్ర స్థాయిలో రియాక్ట్ అయ్యారు. తాను జడ్పీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యానని, కడప జిల్లా పరిషత్ చైర్మన్ బరిలో తాము ఉన్నామని తెలియజేశారు. అయితే తమకు కాకుండా ఆ పదవిని టీడీపీకి ఇవ్వడం అన్యాయమని ఆయన అన్నారు. తమ ఆత్మగౌరవానికి భంగం వాటిల్లినందున, తనతో పాటు తన సోదరుడు కూడా జడ్పీటీసీ పదవికి రిజైన్ చేస్తారని రాజేష్ రెడ్డి అన్నారు. మొత్తం మీద, రాత్రికి జరిగే కీలక భేటీలో బీజేపీ నేతలు ఆదినారాయణ రెడ్డి వర్గాన్ని ఏ మేరకు సముదాయిస్తారో, ఆయన ఏం నిర్ణయం తీసుకుంటారో అనేదానిపై ఉత్కంఠ నెలకొంది.

నేరాల నియంత్రణకు ఏపీ పోలీసుల 'త్రినేత్ర' యాప్... రాష్ట్రవ్యాప్తంగా అమలుకు డీజీపీ గ్రీన్ సిగ్నల్..!




అమరావతి, నవంబర్ 20: సైబర్ నేరగాళ్లు ఎక్కువగా జార్ఖండ్, రాజస్థాన్, హర్యాణా వంటి ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ సిమ్ కార్డులు, మ్యూల్ బ్యాంక్ ఖాతాలను ఉపయోగిస్తూ దర్యాప్తు సంస్థలకు చిక్కకుండా నేరాలకు పాల్పడుతుంటారు. ఇలా రాష్ట్ర సరిహద్దులు దాటి జరుగుతున్న మోసాలను అరికట్టడంలో "త్రినేత్ర" యాప్ ఒక వారధిలా పని చేస్తోంది. ఈ యాప్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల పోలీస్ స్టేషన్లు, ప్రత్యేక సైబర్ క్రైమ్ యూనిట్లు ఒకే డిజిటల్ వేదికపై అనుసంధానమై ఎప్పటికప్పుడు సమాచారాన్ని పంచుకునే వీలు కలుగుతుంది.రోజురోజుకూ రాష్ట్రంలో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్నాయి. ఈ సైబర్ క్రైమ్‌కు అడ్డుకట్ట వేసేందుకు ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ సాంకేతిక అస్త్రాలను రెడీ చేస్తోంది. ఇప్పటికే కృష్ణా జిల్లాలో విజయవంతంగా పనిచేస్తూ నేర నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తున్న "త్రినేత్ర" యాప్‌ను ఇకపై రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా నిర్ణయం తీసుకున్నారు.ప్రతి జిల్లాలో ప్రత్యేక సైబర్ బృందాలు...
ప్రతి జిల్లాలో 20 మంది నిపుణులైన సిబ్బందితో ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేయనున్నట్టు డీజీపీ వెల్లడించారు. ఈ టీమ్‌ల ద్వారా సోషల్ మీడియా స్కామ్‌లు, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, ఫిషింగ్, ఓటీపీ మోసాలతో పాటు కలకలం రేపుతున్న "డిజిటల్ అరెస్ట్" వంటి కేసుల దర్యాప్తును వేగవంతం చేయనున్నారు. ఈ టీమ్‌లు స్థానిక పోలీస్ స్టేషన్లకు సాంకేతిక సహకారం అందిస్తూ నేరగాళ్ల ఆటకట్టించనున్నాయి.ఆధునిక నిఘా.. సత్వర చర్యలు...సైబర్ నేరాల నియంత్రణకు "త్రినేత్ర" యాప్ ప్రధాన లక్ష్యమైనప్పటికీ, సాధారణ నేరాలను ముందుగానే పసిగట్టి నిరోధించడంలోను కూడా ఇది సమర్థవంతంగా పని చేస్తుంది. కమాండ్ సెంటర్‌లోని రియల్ టైమ్ మానిటరింగ్, డేటా అనాలిసిస్ వంటి ఆధునిక సదుపాయాల ద్వారా నేరగాళ్లను వేగంగా గుర్తించే వీలు ఉంటుంది. ఇతర రాష్ట్రాల సరిహద్దులు దాటి జరుగుతున్న సైబర్ మోసాలను అరికట్టేందుకు ఈ సమన్వయ వ్యవస్థ ఎంతో కీలకంగా మారనుంది. సాంకేతిక నిఘాతో పాటు, సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంపై కూడా పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టనుంది.కృష్ణా జిల్లాలో వచ్చిన మంచి ఫలితాలు ఆధారంగా.. మిగిలిన అన్ని జిల్లాల్లోనూ ఈ యాప్‌ను వేగంగా అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సిబ్బందికి శిక్షణ ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారులను డీజీపీ ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తుంది. "త్రినేత్ర" రాష్ట్రవ్యాప్త అమలుతో ఏపీ పోలీసింగ్‌లో, ముఖ్యంగా సైబర్ నేరాల నియంత్రణలో ఒక కొత్త శకం ప్రారంభం కానుందని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.అంతర్రాష్ట్ర సమన్వయం...సైబర్ నేరగాళ్లు ఎక్కువగా జార్ఖండ్, రాజస్థాన్, హర్యాణా వంటి ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ సిమ్ కార్డులు, దొంగ బ్యాంక్ ఖాతాలను ఉపయోగిస్తూ పెద్ద సంఖ్యలో నేరాలకు పాల్పడుతుంటారు. ఇలా రాష్ట్ర సరిహద్దులు దాటి జరుగుతున్న మోసాలను అరికట్టడంలో "త్రినేత్ర" యాప్ ఒక వారధిలా పని చేస్తోంది. ఈ యాప్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల పోలీస్ స్టేషన్లు, ప్రత్యేక సైబర్ క్రైమ్ యూనిట్లు ఒకే డిజిటల్ వేదికపై అనుసంధానమై ఎప్పటికప్పుడు సమాచారాన్ని కలుగుతుంది.

ఏపీ నుంచి అరుణాచలం వెళ్లే భక్తులకు శుభవార్త.. 'కార్తిగై దీపం' కోసం కొత్త ఎక్స్‌ప్రెస్ రైలు



అమరావతి, నవంబర్ 20: ఏపీ నుంచి అరుణాచలం వెళ్లే భక్తులకు ముఖ్యమైన గమనిక. అరుణాచలంలో నిర్వహించే కార్తిగై దీపం వేడుక సందర్భంగా రైల్వే అధికారులు స్పెషల్ రైలు ప్రకటించారు. విశాఖపట్నం నుంచి అరుణాచలానికి ఎక్స్‌ప్రెస్ నడపనున్నారు. అంతేకాదు తిరుపతి నుంచి విశాఖపట్నానికి ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు రైల్వేశాఖ తెలిపింది. ఏపీకి చెందిన భక్తులు ఈ విషయాన్ని గమనించి ఈ రైలు సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు.విశాఖపట్నం – తిరువణ్ణామలై ప్రత్యేక రైలు (08579) నవంబర్ 22, 2026 (ఆదివారం) రాత్రి 11.50 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి.. మరుసటి రోజు నవంబర్ 23 (సోమవారం) సాయంత్రం 5.50 గంటలకు తిరువణ్ణామలై చేరుకుంటుంది. తిరువణ్ణామలై – విశాఖపట్నం ప్రత్యేక రైలు (08580) తిరుగు ప్రయాణంలో నవంబర్ 23న రాత్రి 9 గంటలకు బయలుదేరి.. నవంబర్ 24 (మంగళవారం) మధ్యాహ్నం 2 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైలు దువ్వాడ, అనకాపల్లి, సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, తిరుపతి, చిత్తూరు, కాట్పాడి స్టేషన్లలో ఆగుతుంది. ఈ రైలులో జనరల్ సిట్టింగ్ 4, +రాజ లగేజీ 2, సెకండ్ ఏసీ 2, థర్డ్ ఏసీ 6, స్లీపర్ క్లాస్ 8 కోచ్‌లు ఉంటాయి.ఇటు తిరుపతి నుంచి విశాఖపట్నం (07423, 07424) మధ్య ప్రత్యేక రైళ్లను ప్రకటించారు. తిరుపతి–విశాఖపట్నం రైలు (07423) నవంబర్ 21, 2026 (శనివారం) రాత్రి 9.50 గంటలకు తిరుపతిలో బయలుదేరి.. నవంబర్ 22 (ఆదివారం) మధ్యాహ్నం 1.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైలుకు రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, గుడివాడ, కైకలూరు, భీమవరం టౌన్, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, ఎలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ రైల్వే స్టేషన్లలో హాల్ట్ ఇచ్చారు. ఈ రైలులో జనరల్ సిట్టింగ్ 4, +రాజ లగేజీ 2, సెకండ్ ఏసీ 2, థర్డ్ ఏసీ 6, స్లీపర్ క్లాస్ 8 కోచ్‌లు ఉంటాయి.విశాఖపట్నం – తిరుపతి (07424) రైలు నవంబర్ 24, 2026 (మంగళవారం) రాత్రి 11 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి.. నవంబర్ 25 (బుధవారం) మధ్యాహ్నం 12.30 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఈ రైలు దువ్వాడ, అనకాపల్లి, తుని, సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, న్యూ గుంటూరు, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుంది. ఈ రైలులో జనరల్ సిట్టింగ్ 4, +రాజ లగేజీ 2, సెకండ్ ఏసీ 2, థర్డ్ ఏసీ 6, స్లీపర్ క్లాస్ 8 కోచ్‌లు ఉంటాయి. తిరుపతి–విశాఖపట్నం– తిరుపతి మధ్య నడిచే రైళ్లలో (07423, 07424) టికెట్ ఛార్జీలు సాధారణ ధర కంటే 1.3 రెట్లు ఎక్కువగా ఉంటాయని అధికారులు ప్రకటించారు. తిరువణ్ణామలై వెళ్లే భక్తులు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని రైల్వే అధికారులు సూచించారు.

గోదావరి పుష్కరాలపై కీలక ప్రకటన.. పుష్కర స్నానాలకు ముహూర్తం ఏమీ లేదు.. కాకపోతే ఈ ఒక్క విషయం తెలుసుకోండి



అమరావతి, నవంబర్ 20: వచ్చే ఏడాది నిర్వహించే గోదావరి పుష్కరాలలో పుణ్య స్నానాలకు ప్రత్యేకంగా ఎలాంటి ముహూర్తం లేదని దేవదాయశాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ తెలిపారు. ఇప్పటికే వైదిక పండితులంతా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారని.. గోదావారి పుష్కరాలు జరిగే ఆ 12 రోజుల్లో మొదటి సూర్యోదయం నుంచి చివరి రోజు సూర్యాస్తమయం వరకూ ఏ సమయంలోనైనా పుణ్య స్నానం ఆచరించవచ్చు అన్నారు రామచంద్ర మోహన్. 2027 జూన్ 26 నుంచి జులై 7 వరకు పుష్కరాలకు తేదీలు ఖరారు చేసిందని.. మొదటి రోజు నుంచి 12వ రోజు వరకు ప్రతి రోజూ సూర్యోదయం నుంచి ఏ ఘడియలోనైనా, ఏ ఘాట్‌లోనైనా పుణ్యస్నానం చేయొచ్చన్నారు. మొదటి సూర్యోదయం నుంచి చివరి రోజు సూర్యాస్తమయం వరకు ఎప్పుడైనా స్నానం చేయొ చ్చన్నారు. పుష్కరాల రోజుల్లో గోదావరి రేవుల్లో ఎక్కడ స్నానం ఆచరించినా పుణ్యమేనని రామచంద్రమోహన్ తెలిపారు. గోదా వరి పుష్కరాల సమయంలో 12చోట్ల హారతులు, యాగాలు, హోమాలు నిర్వహిస్తామని.. పుష్కరాలకు ముందు గోష్పాద క్షేత్రం నుంచి కలశ యాత్ర నిర్వహించబోతున్నట్లు తెలిపారు.
గోదావరి తీరంలో సూర్య, బృహస్పతి ఆలయాలు నిర్మిస్తా మన్నారు రామచంద్రమోహన్. దేవాదాయశాఖ, పర్యాటకశాఖ, ఆర్టీసీ సంయుక్తంగా ఆరు సర్క్యూట్లుగా విభజించి 35 దేవాల యాలు అనుసంధానం అయ్యేలా ప్యాకేజీలు రూపొందిం చబోతు న్నామన్నారు. గోదావరి పుష్కరాలకు వచ్చే యాత్రికులు తమకు నచ్చిన ఆలయాలను దర్శించుకునేలా ఒక్కో ప్యాకేజీలో 6 నుంచి 7 ఆలయాలు దర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈసారి గోదావరి పుష్కరాలకు సుమారు 10 కోట్ల మంది వస్తారనే అంచనాలు ఉన్నాయని.. అందుకే అన్ని శాఖల్ని సమన్వయం చేసుకుని పనులు చేస్తున్నామన్నారు. గోదావరి పుష్కరాలకు ఆరు జిల్లాల్లోని అన్ని ఘాట్లలో భక్తులు పుణ్యస్నా నాలు ఆచరించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గోదావరి పుష్కరాల కోసం దేవదాయ శాఖ ద్వారా ఆరు జిల్లాల పరిధిలో రూ.126 కోట్లతో 563 పనులకు ప్రతిపాదనలు రాగా.. వీటిలో 520 పనులకు పరిపాలనామోదం లభించిందన్నారు. 400 పైగా పనులకు టెండర్లు పూర్తిచేయగా.. ఆ పనులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. 2027 మార్చి చివరి నాటికి గోదావరి పుష్కరాల పనులన్నీ పూర్తి చేస్తామన్నారు.

కూతురి పెళ్లి కోసం రూ.25 వేల అప్పు.. 4.5 ఎకరాల భూమి కోల్పోయిన మహిళకు 30 ఏళ్ల తర్వాత న్యాయం!




కూతురి పెళ్లి కోసం తీసుకున్న అప్పు ఓ మహిళకు మూడు దశాబ్దాల పాటు కంటిమీద కునుకు లేకుండా చేసింది. కేవలం రూ.25 వేల కోసం తాకట్టు పెట్టిన 4.5 ఎకరాల భూమి చివరకు చేజారిపోయింది. అప్పు తీర్చేందుకు రూ.2.5 లక్షలు ఇస్తానన్నా వడ్డీ వ్యాపారి కనికరించలేదు. అసలు, వడ్డీ కలిపి రూ.10 లక్షలు కట్టాల్సిందేనని పట్టుబట్టాడు. అంత మొత్తం చెల్లించలేక ఆ మహిళ ఏళ్ల తరబడి తన భూమికి దూరమైంది. అయితే మూడు దశాబ్దాల తర్వాత ఆమెకు ఊహించని ఊరట లభించింది. అధికారుల చొరవతో ఒక్క రూపాయి కూడా చెల్లించకుండానే తన 4.5 ఎకరాల భూమిని తిరిగి దక్కించుకుంది. మహారాష్ట్రలోని లాతూర్ జిల్లాలో జరిగిన ఈ ఘటన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. లాతూర్ జిల్లా చాకూర్ తాలూకా కల్ముటి గ్రామానికి చెందిన ముండుబాయి ఇరప్ప దావ్రే.. దాదాపు 30 ఏళ్ల క్రితం తన కుమార్తె వివాహ ఖర్చుల కోసం ఓ ప్రైవేటు వడ్డీ వ్యాపారి వద్ద రూ.25 వేలు అప్పు తీసుకుంది. ఇందుకోసం తనకున్న 4.5 ఎకరాల భూమిని తాకట్టు పెట్టింది. తొలుత పంటలో వాటా ఇస్తానని చెప్పిన వడ్డీ వ్యాపారి.. ఆ తర్వాత భూమిపై ఆధిపత్యం చెలాయించాడు. నకిలీ సాక్షులను ఉపయోగించి భూమిని తన పేరు మీదకు మార్చుకున్నాడు.అయితే తీసుకున్న అప్పు తీర్చి తన భూమిని తిరిగి దక్కించుకోవాలని ముండుబాయి ప్రయత్నించింది. ఇందుకోసం అసలు, వడ్డీ కలిపి 2.5 లక్షల వరకు చెల్లించేందుకు సిద్ధమైంది. కానీ వడ్డీ వ్యాపారి మాత్రం అప్పు, వడ్డీ కలిపి మొత్తం 10 లక్షలు చెల్లించాలని లెక్కలు చెప్పాడు. భూమి కావాలంటే చెప్పినంత కట్టాల్సిందేనని డిమాండ్ చేశాడు. దీంతో చేసేదేమీ లేక మండుబాయి ఆవేదనతో ఉండిపోయింది. అలా దాదాపు 30 ఏళ్లు గడిచిపోయింది. తాజాగా కుటుంబ సభ్యులు ఆర్థికంగా అండగా నిలవడంతో ముండుబాయి లతూర్ జిల్లా అధికారులను ఆశ్రయించింది. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన కలెక్టర్ భరత్ బస్తవాడ్.. రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో తహసీల్దార్ అనుమతితో రెవెన్యూ అధికారులు భూమి రికార్డుల్లో మార్పుల చేసి, ముండు బాయినే యజమానిగా నమోదు చేశారు. దీంతో 30 ఏళ్ల కిందట కోల్పోయి 4.5 ఎకరాల భూమి ఆమెకు తిరిగి దక్కింది .గురువారం లాతూర్ జిల్లా పర్యటనకు వచ్చిన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ.. ముండుబాయికి భూమికి సంబంధించిన 7/12 (సాత్‌బారా) పత్రంతో పాటు ఇతర ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. తన భూమిని ఎలాంటి డబ్బు చెల్లించకుండానే తిరిగి ఇప్పించారని ఆమె ఆనందం వ్యక్తం చేసింది. ఈ విషయంలో సహకరించిన కలెక్టర్, ఎస్పీ అమోల్ తాంబే, స్థానిక తహసీల్దార్‌కు
కృతజ్ఞతలు తెలిపింది.

వీసా, మాస్టర్ కార్డ్, జేపీ మోర్గాన్‌పై సైబర్ దాడి.. కస్టమర్ల సమాచారం లీక్!



వీసా, మాస్టర్ కార్డ్, జేపీ మోర్గాన్ ఛేజ్ సంస్థలకు సంబంధించిన సమాచారం సైబర్ దాడిలో లీక్ అయింది. ఈ విషయాన్ని ఆ సంస్థలే ఈరోజు (శుక్రవారం) ప్రకటించాయి. అయితే పేమెంట్స్ సమాచారం భద్రంగానే ఉందని పేర్కొన్నాయి. కస్టమర్ల వివరాలు మాత్రం లీక్ అయ్యాయని వెల్లడించాయి. తమ థర్డ్ పార్టీ సర్వీసులపై ఈ సైబర్ దాడి నిన్న (గురువారం) జరిగిందని ఆయా సంస్థలు తెలిపాయి.తమ థర్డ్ పార్టీ సర్వీసులపై హ్యాకర్లు దాడి చేశారని జేపీ మోర్గాన్ ఛేజ్ వివరించింది. ఆసియా-పసిఫిక్ పరిధిలో తమ సర్వీసు ప్రొవైడర్లు సైబర్ దాడికి గురయ్యాయని వీసా సంస్థ తెలిపింది. మరోవైపు మాస్టర్ కార్డ్ వినియోగదారుల మెయిల్ ఐడీలు లీకయ్యాయి. కాగా ఇటీవలి కాలంలో అమెరికాలో వరుసగా సాంకేతిక సమస్యలు, సైబర్ దాడులు వెలుగు చూడడంతో వైట్‌హౌస్ సైబర్ సెక్యూరిటీ చీఫ్ సీన్ కెయిర్న్స్ రాజీనామా చేశారు. ఆయనపై ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ కూడా అసంతృప్తిగా ఉన్నట్టు తెలుస్తోంది. కొన్ని రోజుల క్రితమే సాంకేతిక లోపాల కారణంగా అక్కడ వేలాది విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

తీరం దాటిన తుపాను అక్వాన్.. ఒడిశా, ఉత్తరాంధ్ర తీరాలకు భారీ వర్ష సూచన



బంగాళాఖాతంలో ఏర్పడిన అక్వాన్ తుపాను ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరాల మధ్య గోపాల్‌పూర్ సమీపంలో తీరం దాటింది. శుక్రవారం ఉదయం7.30 నుంచి 8.30 గంటల మధ్య తీరం దాటిన సమయంలో గంటకు 70-80 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయని, అప్పుడప్పుడు 90 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు నమోదయ్యాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఉదయం 8.30 గంటలకు తుపాను దక్షిణ కోస్తా ఒడిశా, ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ పరిసరాల్లో గోపాల్‌పూర్ సమీపంలో కేంద్రీకృతమై ఉన్నట్లు తెలిపింది.తుపాను ప్రస్తుతం ఉత్తర-ఈశాన్య దిశగా కదులుతూ ఒడిశా మీదుగా ప్రయాణించే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. రానున్న మూడు గంటల్లో తీవ్ర వాయుగుండంగా, ఆ తర్వాత ఆరు గంటల్లో వాయుగుండంగా బలహీనపడే అవకాశం ఉందని అంచనా వేసింది. తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్రలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలో భారీ వర్షపాతం నమోదైంది. ఇచ్ఛాపురం, సోంపేట, మందస ప్రాంతాల్లో 12 సెంటీమీటర్లకు పైగా వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.ఒడిశాలో భారీ వర్షాలు.. 3 లక్షల మందికి పైగా తరలింపుతుపాను ప్రభావంతో ఒడిశాలోని తీర ప్రాంత జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. గంజాం జిల్లాలోని పాత్రపూర్ బ్లాక్‌లో సుమారు 200 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పూరీలో 73 మిల్లీమీటర్లు, పాంచదీప్‌లో 84 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రానున్న రెండు రోజుల పాటు ఒడిశాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తుపాను ముప్పు నేపథ్యంలో ఒడిశా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ప్రమాదకర ప్రాంతాల నుంచి మూడు లక్షల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించింది. సహాయక చర్యల కోసం 423 బృందాలను రంగంలోకి దించింది. శుక్రవారం ఉదయం 9 గంటల నాటికి 34 ప్రాంతాల్లో నీటిని తొలగించే పనులు చేపట్టగా.. మరో రెండు ప్రాంతాల్లో చెట్ల తొలగింపు చర్యలు కొనసాగుతున్నాయి. పూరీ సహా తీర ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్, ఇతర సహాయక బృందాలు అప్రమత్తంగా ఉన్నాయి.విశాఖకు తుపాను ముప్పు తప్పినా.. సముద్రం అల్లకల్లోలంతుపాను ప్రభావంతో విశాఖపట్నం తీరంలో ముప్పు తప్పినప్పటికీ సముద్రం అల్లకల్లోలంగా ఉందని అధికారులు తెలిపారు. తీర ప్రాంతంలో గంటకు 20-30 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి. ఉత్తరాంధ్రలో శుక్రవారం వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. శ్రీకాకుళం జిల్లా సోంపేట తీరంలో అలలు ఎగిసిపడటంతో మత్స్యకారులు చేపల వేటను నిలిపివేశారు.మరోవైపు పశ్చిమ బెంగాల్ దక్షిణ ప్రాంత జిల్లాల్లోనూ తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి.

ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్.. 37 గంటల మిషన్‌లో ఏం జరిగిందంటే..



ఇరాన్ అణు కేంద్రాలపై 2025 జూన్‌లో అమెరికా జరిపిన సైనిక దాడి 'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్' సంబంధించిన సంచలన వివరాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఆ దాడిలో పాల్గొన్న బీ-2 స్టెల్త్ బాంబర్ విమానాల పైలట్లు తొలిసారిగా తమ అనుభవాలను వెల్లడించారు. దాదాపు 15 ఏళ్లపాటు సాగిన ప్రణాళిక, శత్రుదేశానికి తెలియకుండా చేపట్టిన రహస్య ప్రయాణం, చివరి నిమిషంలో మారిన దాడి వ్యూహం.. ఇలా ఎన్నో ఆసక్తికర అంశాలను వివరించారు. అమెరికా సైనిక పత్రిక 'ఎయిర్ అండ్ స్పేస్ ఫోర్సెస్ మ్యాగజైన్' ఈ కథనాన్ని ప్రచురించింది ఇరాన్‌లోని ఫోర్డో అణు కేంద్రంపై దాడికి సంబంధించిన ప్రణాళిక 2009లోనే ప్రారంభమైందని కథనం వెల్లడించింది. టెహ్రాన్‌కు నైరుతి దిశలోని పర్వత ప్రాంతాల్లో అనుమానాస్పద నిర్మాణాలను అమెరికా నిఘా వర్గాలు గుర్తించాయి. ఆ తర్వాత సుమారు 15 ఏళ్లపాటు ఆ కేంద్ర నిర్మాణం, విద్యుత్ వ్యవస్థలు, గాలి ప్రసరణ మార్గాలు, భూగర్భ గదులపై అధ్యయనం చేశారు. భూమి లోతుల్లో, పర్వతాల కింద నిర్మించిన రక్షణ కేంద్రాలను ఛేదించేలా జీబీయూ-57 భారీ బంకర్ బస్టర్ బాంబును రూపొందించారు.దాడికి కొన్ని రోజుల ముందు ఫోర్డో కేంద్రంలోని గాలి ప్రసరణ మార్గాలను ఇరాన్ కాంక్రీటుతో మూసివేసేందుకు ప్రయత్నించినట్లు అమెరికా గుర్తించిందని కథనం పేర్కొంది దీంతో ముందుగా ఆ కాంక్రీటు పొరను ఛేదించి, ఆ తర్వాత భూగర్భ కేంద్రాలను లక్ష్యంగా చేసుకునేలా దాడి క్రమాన్ని మార్చాల్సి వచ్చింది. దాడికి కేవలం 16 గంటల ముందే తమ ప్రణాళికకు ఆమోదం లభించిందని పైలట్లు చెప్పారు. ఆ తర్వాత దాదాపు 37 గంటలపాటు వారి ప్రయాణం సాగింది. మధ్యలో గగనతలంలోనే ఇంధనం నింపుకున్నారు. 30 నుంచి 45 నిమిషాల వ్యవధిలో కొద్దిసేపు నిద్రపోతూ ప్రయాణాన్ని కొనసాగించారు.దాడి సమయంలో అమెరికా బీ-2 బాంబర్ విమానాలు సుమారు 18 గంటలపాటు ప్రయాణించి ఇరాన్ గగనతలానికి చేరుకున్నాయి. లక్ష్యానికి సమీపంలోకి వచ్చినప్పుడు టెహ్రాన్ నగర దీపాలు కనిపించాయి. దీంతో ఒక పైలట్ ఆశ్చర్యంతో 'ఓ మై గాడ్.. ఇది టెహ్రాన్!' అంటూ స్పందించాడు. లక్ష్యాలను చేరుకున్న తర్వాత విమానాల్లోని బాంబుల ద్వారాలు తెరుచుకున్నాయి. ఒక్కొక్కటి సుమారు 30 వేల పౌండ్ల బరువున్న భారీ బంకర్ బస్టర్ బాంబులను ఫోర్డో అణు కేంద్రం లక్ష్యంగా విడుదల చేశారు. బాంబులు విమానం నుంచి విడిపోయిన తర్వాత పైలట్లకు విమానాన్ని నియంత్రించడం కొంత సులభమైంది. బాంబులు లక్ష్యాన్ని తాకాయా లేదా అన్న ఉత్కంఠతో పైలట్లు వెనక్కి తిరిగి చూశారు. కొన్ని సెకన్ల తర్వాత కొండల మధ్య భారీ అగ్నిగోళం కనిపించింది .

భారత్‌కు పాక్ మంత్రి రాక.. మోదీ సర్కారుపై విపక్షాల విమర్శలు



ఢిల్లీలో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ సమావేశం కోసం పాకిస్థాన్ వాతావరణ శాఖ మంత్రి ముసాదిక్ మాలిక్ భారత్‌కు రావడంతో రాజకీయ దుమారం చెలరేగింది. ఈ క్రమంలో కేంద్రం అనుసరిస్తున్న విదేశాంగ విధానాలపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. సింధూ జలాల ఒప్పందం నిలిపివేత సమయంలో ముసాదిక్ మాలిక్ తీవ్ర, అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. 'మా నీళ్లను ముట్టుకుంటే చేతులు నరికేస్తాం' అంటూ ఆయన అప్పట్లో హెచ్చరికలు చేశారు. అయితే ఇప్పుడు ముసాదిక్ మాలిక్ భారత్‌లో పర్యటించడం వివాదానికి దారి ఇచ్చింది. బీజేపీ విదేశాంగ విధానం గందరగోళ మయంగా ఉందని సమాజ్‌వాది పార్టీ నాయకుడు ఫక్రుల్ హసన్ విమర్శించారు.మరోవైపు కాంగ్రెస్ ముసాదిక్ మాలిక్ రాకపై సెటైర్లు పేల్చింది. ఉగ్రవాదానికి ఎప్పుడూ వ్యతిరేకమని చెప్పే బీజేపీ.. పాకిస్థాన్ మంత్రిని స్వాగతిస్తోందని చురకలంటించింది. 'విదేశ వ్యవహారాల అంశంలో కేంద్రం అయోమయ స్థితిలో ఉంది. భారతీయ క్రికెటర్లను పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఆడాలని బీజేపీ కోరుతుంది. మరోవైపు అదే పార్టీ.. పాక్ మంత్రులకు ఆహ్వానం పలుకుతోంది. గందరగోళ ప్రధానమంత్రి మోదీ ఒత్తిడిలో పని చేస్తున్నట్టున్నారు' అని ఇండి కూటమి నాయకుడు సురేంద్ర రాజ్‌పూత్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారి.. పాకిస్థాన్ వాతావరణ శాఖ మంత్రిపై మండిపడ్డారు. గతంలో ముసాదిక్ మాలిక్ చేసిన వ్యాఖ్యలు ఉగ్రవాదుల హెచ్చరికలకు ఏమాత్రం తీసిపోవని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా నవంబర్ 20 నుంచి 22 వరకు ఎస్‌సీఓ సమావేశం జరగనుంది. ఇందులో చైనా, రష్యా, భారత్, పాకిస్థాన్, ఇరాన్, కజకిస్థాన్, కిర్గిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, బెలారస్ దేశాలు పాల్గొంటాయి.


తిరుప్పనకుండ్రం కొండపై కార్తీక దీపం వివాదం.. సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు



తమిళనాడులోని తిరుప్పరంకుండ్రం కొండపై కార్తీక దీపం వెలిగించే అంశంపై సుప్రీంకోర్టు శుక్రవారం కీలక తీర్పు వెలువరించింది. ఆ కొండపై కార్తీక దీపం వెలిగించే రాతి స్తంభానికి సమీపంలో సికిందర్ బాదుషా దర్గా ఉండటంతో దశాబ్దాలుగా వివాదం కొనసాగుతోన్న సంగతి తెలిసిందే. ఇటీవల మద్రాసు హైకోర్టు దీనిపై తీర్పు వెలువరిస్తూ.. దీపం వెలిగించే సంప్రదాయాన్ని పునరుద్ధరించాలని సూచించింది. దీంతో తమిళనాడు ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్లగా.. విచారణ చేపట్టి తీర్పు చెప్పింది.తమిళనాడులోని తిరుప్పరంకుండ్రం కార్తీక దీపం వివాదంపై సుప్రీం కోర్టు శుక్రవారం కీలక ఆదేశాలు వెలువరించింది. నవంబరు 24న పౌర్ణమి రోజు కొండపై కార్తీక దీపాన్ని వెలిగించేందుకు అనుమతినిచ్చింది. అయితే, రాత్రి స్తంభం వద్ద దీపం వెలిగించే ఆచారాన్ని పునరుద్ధరించాలన్న ఆదేశాలను సమర్థిస్తూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పులోని కొన్ని భాగాలపై జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ విపుల్ ఎం పంచోలీలతో కూడిన ధర్మాసనం స్టే విధించింది. కొండ పైభాగం యాజమాన్య హక్కులు, ఈ ఆచారం నిర్వహించే ప్రదేశంపై హిందూ భక్తులు, హజ్రత్ సుల్తాన్ సికిందర్ బదుషా ఔలియా దర్గా మధ్య వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ మధ్యంతర అనుమతులు ఇచ్చింది.

"కొండ పైభాగం మొత్తం దర్గాకు చెందినది. దర్గాకు, రాతి స్తంభానికి మధ్య ఎంత దూరం ఉన్నప్పటికీ, ఆ రాతి స్తంభం ఉన్న కొండపైభాగంలో దీపం వెలిగించే ప్రసక్తే లేదు" అని తివారీ అన్నారు. మసీదు, ధ్వజస్తంభం ఉన్న కొండపైభాగంతో పాటు రాతి స్తంభం ఉన్న ప్రదేశం కూడా దర్గా ఆస్తియేనని ఆయన కోర్టుకు నివేదించారు.

తమిళనాడుకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ.. కావేరీ నీటి అభ్యర్థన తిరస్కరణ..



కావేరీ నదీ జలాల పంపిణీ వివాదంలో తమిళనాడుకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కర్ణాటక నుంచి అదనంగా 11 టీఎంసీల నీటిని విడుదల చేయించాలని కోరుతూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. రాష్ట్రంలో నీటి కొరత కారణంగా పంటలు దెబ్బతింటున్నాయని తమిళనాడు ప్రభుత్వం వాదించినప్పటికీ, అదనపు నీటిని విడుదల చేయాలని కర్ణాటకకు ఆదేశాలు జారీ చేసేందుకు కోర్టు నిరాకరించింది జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ నిర్ణయం తీసుకుంది. కావేరీ నదిలో తమకు రావాల్సిన నీటి వాటాను కర్ణాటక సక్రమంగా విడుదల చేయడం లేదని తమిళనాడు ప్రభుత్వం ఆరోపించింది. జూలై నుంచి తమకు సుమారు 11 టీఎంసీల నీరు బకాయి ఉందని పేర్కొంది. ఈ నీటిని విడుదల చేయకపోవడంతో రాష్ట్రంలోని వ్యవసాయ రంగంపై ప్రభావం పడుతోందని, ముఖ్యంగా కావేరీ డెల్టా ప్రాంతంలోని పంటలు దెబ్బతింటున్నాయని కోర్టుకు వివరించింది. కావేరీ జల నిర్వహణ ప్రాధికార సంస్థ, కావేరీ జల నియంత్రణ కమిటీ ఆదేశాలు ఇచ్చినప్పటికీ తమకు రావాల్సిన నీరు అందడం లేదని తమిళ నాడు వాదించింది తమిళనాడు వాదనలను కర్ణాటక ప్రభుత్వం వ్యతిరేకించింది తమ రాష్ట్రంలోని పలు జిల్లాలు కూడా కరవు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని కోర్టుకు తెలిపింది. కావేరీ పరీవాహక ప్రాంతంలోని జలాశయాలకు నీటి రాక గణనీయంగా తగ్గిందని, ఇలాంటి పరిస్థితుల్లో అదనపు నీటిని విడుదల చేయాలని ఆదేశించడం సాధ్యం కాదని కర్ణాటక తరఫు న్యాయవాదులు వాదించారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం తమిళనాడు పిటిషన్‌ను
కొట్టివేసింది.

అమెరికాను కదిలించిన భారతీయ వృద్ధురాలు! కాంగ్రెస్‌లో కొత్త బిల్లు



అమెరికాలో మూడు దశాబ్దాలుగా ఉంటున్న ఓ భారతీయ వృద్ధురాలిని డిపోర్ట్ చేయడం యావత్ దేశాన్ని కదిలించింది. ఇంతటి అన్యాయం మరొకరి విషయంలో జరగకూడదని కంకణం కట్టుకున్న నలుగురు కాంగ్రెస్ (అమెరికా చట్టసభలు) సభ్యులు కొత్త బిల్లును తీసుకొచ్చారు. ప్రొటక్ట్ అవర్ నైబర్స్ యాక్ట్ పేరుతో ఈ బిల్లును కాంగ్రెస్‌మన్ జూన్ జెరామెండీ ప్రవేశపెట్టారు. ఈ బిల్లుకు ప్రతినిధుల సభ సభ్యులు లతీఫా సైమన్, జో లాఫ్‌గ్రెన్, వాన్ వార్గాస్ మద్దతు తెలిపారు.
కాలిఫోర్నియాలోని శాన్‌ఫ్రాన్సిస్కో బే ఏరియాలో దాదాపు 30 ఏళ్లగా ఉంటున్న హర్జీత్ కౌర్ (73), ఇమిగ్రేషన్ శాఖ అధికారులు గతేడాది బలవంతంగా భారత్‌కు పంపించేశారు. ఆమె తన డిస్ట్రిక్ట్‌లోనే దశాబ్దాలుగా ఉంటున్నారని ప్రతినిధుల సభ సభ్యుడు సైమన్ పేర్కొన్నారు. ఆమెపై ఎలాంటి నేరారోపణలు లేకపోయినా పంపించేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇమిగ్రేషన్ శాఖ నిబంధనలన్నీ ఆమె తూచా తప్పకుండా పాటించిందని చెప్పారు. అధికారుల సూచన మేరకు హర్జీత్ కౌర్ ప్రతి ఆ రు నెలలకు ఒకసారి వారి ముందు విచారణకు హాజరయ్యేవారని చెప్పారు. గత 13 ఏళ్లగా ఆమె క్రమం తప్పకుండా ఇలాగే చేశారని అన్నారు.కానీ, ట్రంప్ సర్కారు ఆదేశాల నేపథ్యంలో ఇమిగ్రేషన్ అధికారులు కౌర్‌ను అన్యాయంగా, నిర్హేతుకంగా నిర్బంధించి ఆ తరువాత పంపించేశారని చెప్పారు. ఎన్నో ఏళ్లుగా అమెరికాలో తమకంటూ ఓ జీవితాన్ని నిర్మించుకున్న కౌర్ లాంటి వేల మందిని అన్యాయంగా డిపోర్ట్ చేశారని జెరామెండీ ఆవేదన వ్యక్తం చేశారు.
అమెరికన్ ఇమిగ్రేషన్ కౌన్సిల్ లెక్కల ప్రకారం, డిపోర్టేషన్ ఆదేశాలు ఎదుర్కొంటున్న 1.19 మిలియన్ల మంది ప్రస్తుతం అమెరికాలోనే ఉంటున్నారు. ఇప్పటికే వేల మంది అక్కడ సుస్థిర నివాసం ఏర్పాటు చేసుకుని స్థిరపడ్డారు. అయినప్పటికీ ట్రంప్ సర్కారు కఠిన వైఖరి ఆధారంగా ఇమిగ్రేషన్ అధికారులు తుది డిపోర్టేషన్ ఆదేశాల అమలుకు దిగారు.
ఈ నేపథ్యంలో తుది డిపోర్టేషన్ ఆదేశాలు జారీ చేసిన 10 ఏళ్ల కలాపరిమితి తరువాత అవి వాటంతట అవే రద్దైపోయేలా నలుగురు కాంగ్రెస్ సభ్యులు కొత్త బిల్లు తీసుకొచ్చారు. అమెరికా అంతర్గత భద్రతా విభాగం విజ్ఞప్తి మేరకు ఇమిగ్రేషన్ జడ్జ్ ఈ ఆదేశాలను పునరుద్ధరించే అవకాశం ఉంటుంది. అయితే, ఇందుకోసం స్పష్టమైన కారణాలను కూడా చెప్పాల్సి ఉంటుంది.

సంపాదకీయం

అమెరికా కలకు అడ్డంకులు!

- గ్రీన్‌కార్డ్ నిబంధనల కఠినతరం.. భారతీయ ఐటీ నిపుణుల్లో ఆందోళన



అమెరికాలో స్థిరపడాలన్న భారతీయ యువత, ఉద్యోగులు, ఐటీ నిపుణుల కలలకు ట్రంప్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు అడ్డంకులుగా మారుతున్నాయి. ఒకప్పుడు ఉన్నత విద్య, మంచి ఉద్యోగం, అధిక వేతనం, మెరుగైన జీవితం కోసం అమెరికా వెళ్లడం భారతీయ యువతకు ప్రధాన ఆకర్షణగా ఉండేది. అక్కడ ఉద్యోగం సంపాదించి, కొన్నేళ్లలో గ్రీన్‌కార్డ్ పొంది కుటుంబంతో సహా శాశ్వతంగా స్థిరపడాలన్నది లక్షలాది మంది ఆశయం. కానీ ప్రస్తుతం అమెరికా అనుసరిస్తున్న వలస విధానాలు ఈ ఆశలను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ముఖ్యంగా ఉపాధి ఆధారిత గ్రీన్‌కార్డుల జారీ ప్రక్రియను కఠినతరం చేయడం, విదేశీ ఉద్యోగులను నియమించుకునే సంస్థలపై ఆంక్షలు విధించడం భారతీయ నిపుణుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం 'అమెరికన్లకే ప్రాధాన్యం' అనే విధానానికి పెద్దపీట వేస్తోంది. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో విదేశీ ఉద్యోగుల నియామక ప్రక్రియను మరింత కఠినతరం చేస్తోంది. ఫిజికల్ థెరపిస్టులు, నర్సుల నుంచి ఐటీ, సాంకేతిక రంగాల్లో అత్యంత నైపుణ్యం కలిగిన ఉద్యోగుల వరకు ఈ మార్పుల ప్రభావం పడే అవకాశం ఉంది. విదేశీ ఉద్యోగులను శాశ్వతంగా నియమించుకునే ముందు అమెరికా పౌరులకు తగిన అవకాశాలు కల్పించారా? స్థానికంగా అర్హులైన ఉద్యోగులు అందుబాటులో ఉన్నారా? అనే అంశాలను కంపెనీలు మరింత స్పష్టంగా నిరూపించాల్సి ఉంటుంది. దీంతో విదేశీ ఉద్యోగులకు గ్రీన్‌కార్డ్ స్పాన్సర్ చేయడం సంస్థలకు కష్టతరంగా మారనుంది.**గ్రీన్‌కార్డ్ ప్రక్రియలో మార్పులు** అమెరికాలో శాశ్వత నివాస హోదా పొందేందుకు గ్రీన్‌కార్డ్ కీలకమైనది. ఇది లభిస్తే అక్కడ దీర్ఘకాలికంగా నివసించడంతో పాటు ఉద్యోగం చేసుకునే అవకాశం ఉంటుంది. అయితే ఉపాధి ఆధారిత గ్రీన్‌కార్డుల మంజూరులో కీలకమైన పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ (ప్రూ=వీ) విధానాన్ని అమెరికా కార్మిక శాఖ మరింత కఠినతరం చేసే చర్యలు చేపడుతోంది. సుమారు రెండు దశాబ్దాల తర్వాత ఈ విధానంలో ప్రధాన మార్పులు తీసుకురావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఉద్యోగ ప్రకటనలు, నియామక ప్రక్రియ, స్థానిక అభ్యర్థుల ఎంపిక, విదేశీ ఉద్యోగుల అర్హతల పరిశీలన వంటి అంశాల్లో కంపెనీలపై అదనపు బాధ్యతలు పడనున్నాయి. ఇప్పటికే గ్రీన్‌కార్డ్ కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న వారికి ఈ మార్పులు మరింత నిరాశ కలిగించే అవకాశముంది.**భారతీయ ఐటీ నిపుణులకు ఎదురుదెబ్బ** అమెరికాలో భారతీయుల సంఖ్య గణనీయంగా ఉంది. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్, సమాచార సాంకేతిక, వైద్య, పరిశోధన, ఇంజినీరింగ్ రంగాల్లో భారతీయులు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. హెచ్-1బీ వీసాల ద్వారా అమెరికాకు వెళ్లిన వేలాది మంది ఉద్యోగులు అక్కడే స్థిరపడాలని భావిస్తున్నారు. అయితే గ్రీన్‌కార్డ్ మంజూరులో ఉన్న పరిమితులు, భారతీయులకు అధిక సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటం వల్ల పరిస్థితి ఇప్పటికే సంక్లిష్టంగా మారింది. ఇప్పుడు కొత్త నిబంధనలు అమల్లోకి వస్తే ఈ సమస్య మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. అమెరికాలో ఉద్యోగం చేస్తున్నప్పటికీ శాశ్వత నివాస హోదా లేకపోవడం వల్ల ప్రతి వీసా పొడిగింపు సమయంలోనూ అనిశ్చితిని ఎదుర్కోవాల్సి వస్తోంది. ఉద్యోగం మారాలన్నా, కుటుంబ భవిష్యత్తు గురించి నిర్ణయం తీసుకోవాలన్నా అనేక పరిమితులు ఎదురవుతున్నాయి.**ఐటీ సంస్థలపై ఆంక్షలు.. ఉద్యోగులకు ఆందోళన** భారతీయ ఐటీ రంగానికి చెందిన ప్రముఖ సంస్థలు అమెరికాలో భారీ స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్, కాగ్నిజెంట్, క్యాప్‌జెమినీ వంటి సంస్థల ద్వారా వేలాది మంది భారతీయులు అమెరికాలో ఉపాధి పొందుతున్నారు. ఈ సంస్థలపై గ్రీన్‌కార్డ్ స్పాన్సర్‌షిప్, ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఆంక్షలు విధించే పరిణామాలు ఉద్యోగుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. కంపెనీలు విదేశీ ఉద్యోగులను నియమించుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటే కొత్త నియామకాలు తగ్గే అవకాశం ఉంది. ఇప్పటికే అక్కడ పనిచేస్తున్న ఉద్యోగుల గ్రీన్‌కార్డ్ దరఖాస్తులపైనా ప్రభావం పడవచ్చు. కంపెనీలకు అనిశ్చితి ఏర్పడితే ఉద్యోగుల భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకమవుతుంది. ఈ పరిస్థితి భారతీయ ఐటీ రంగానికి కూడా సవాలుగా మారనుంది. **179 ఏళ్ల నిరీక్షణ.. భారతీయులకు గ్రీన్‌కార్డ్ అందని ద్రాక్ష!** అమెరికాలో గ్రీన్‌కార్డ్ కోసం భారతీయులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య దీర్ఘకాల నిరీక్షణ. దేశాల వారీగా కేటాయించే పరిమితులు, దరఖాస్తుల సంఖ్యలో భారీ వ్యత్యాసం కారణంగా భారతీయుల దరఖాస్తులు పేరుకుపోతున్నాయి. కొన్ని అంచనాల ప్రకారం ప్రస్తుత పరిస్థితుల్లో కొందరు భారతీయ దరఖాస్తుదారులకు గ్రీన్‌కార్డ్ రావడానికి 179 సంవత్సరాల వరకు పట్టవచ్చన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇది ప్రతి ఒక్కరి నిరీక్షణ సమయం కాకపోయినా, వ్యవస్థలో ఉన్న తీవ్ర అసమానతను తెలియజేస్తోంది. ప్రతిభ, అర్హత, అనుభవం ఉన్నప్పటికీ కేవలం దేశాల వారీ కోటా కారణంగా జీవితకాలం ఎదురుచూడాల్సిన పరిస్థితి అన్యాయంగా కనిపిస్తోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు అమెరికా ప్రభుత్వం సమగ్ర విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది.**పబ్లిక్ ఛార్జ్ నిబంధనతో మరో సమస్య** గ్రీన్‌కార్డ్ దరఖాస్తుల పరిశీలనలో పబ్లిక్ ఛార్జ్ నిబంధన కూడా కీలకంగా మారుతోంది. దరఖాస్తుదారులు భవిష్యత్తులో ప్రభుత్వ ఆర్థిక సహాయంపై ఆధారపడే అవకాశం ఉందా? వారి ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది? అప్పులు, ఆదాయం, కుటుంబ బాధ్యతలు ఏమిటి? వంటి అంశాలను అధికారులు పరిశీలించే అవకాశం ఉంది. దీనివల్ల దరఖాస్తుదారులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కొన్నిసార్లు అవసరమైన అర్హతలు ఉన్నప్పటికీ అదనపు పరిశీలనలు, పత్రాల సమర్పణ, విచారణల కారణంగా దరఖాస్తులు ఆలస్యమవుతున్నాయి. ఇమ్మిగ్రేషన్ అధికారులు నివాసాలను సందర్శించడం, సంబంధిత వివరాలను ధ్రువీకరించడం వంటి చర్యలు కూడా విదేశీ కుటుంబాల్లో ఆందోళన పెంచుతున్నాయి.**కుటుంబాల భవిష్యత్తుపై సందిగ్ధత** అమెరికాలో ఉద్యోగం చేస్తున్న భారతీయుల సమస్య కేవలం వ్యక్తిగత ఉద్యోగ భద్రతకు మాత్రమే పరిమితం కాదు. అక్కడే చదువుకుంటున్న పిల్లలు, ఉద్యోగాలు చేస్తున్న జీవిత భాగస్వాములు, కుటుంబ ఆర్థిక బాధ్యతలు అన్నీ ఈ నిర్ణయాలతో ముడిపడి ఉన్నాయి. గ్రీన్‌కార్డ్ వస్తుందో లేదో తెలియని పరిస్థితిలో పిల్లల విద్య, భవిష్యత్తు, ఆస్తుల కొనుగోలు, కుటుంబ స్థిరత్వం వంటి అంశాలపై నిర్ణయాలు తీసుకోవడం కష్టమవుతోంది. హెచ్-1బీ వీసా కొనసాగింపుపై అనిశ్చితి నెలకొంటే ఒక్కసారిగా దేశం విడిచి రావాల్సిన పరిస్థితి కూడా ఏర్పడవచ్చు. ఇన్నేళ్లుగా అక్కడే జీవనం సాగిస్తున్న కుటుంబాలకు ఇది మానసికంగా, ఆర్థికంగా పెద్ద దెబ్బ. అందుకే కొందరు భారతీయులు అమెరికాలో కొనసాగడం కంటే స్వదేశానికి తిరిగి రావడమే మంచిదనే ఆలోచనకు వస్తున్నారు.**అమెరికాకే నష్టమా?** విదేశీ ఉద్యోగులపై ఆంక్షలు విధించడం వల్ల అమెరికాలోని స్థానికులకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది. అయితే ప్రపంచవ్యాప్తంగా ప్రతిభ కలిగిన నిపుణులను ఆకర్షించడం అమెరికా ఆర్థిక, సాంకేతిక అభివృద్ధికి ప్రధాన కారణాల్లో ఒకటి. సిలికాన్ వ్యాలీ నుంచి వైద్య పరిశోధనా కేంద్రాల వరకు విదేశీ నిపుణుల సేవలు ఎంతో కీలకంగా ఉన్నాయి. భారతీయులు సహా వివిధ దేశాల నుంచి వచ్చిన నిపుణులు అమెరికా అభివృద్ధిలో విశేష పాత్ర పోషిస్తున్నారు. అలాంటి వారిపై అధిక ఆంక్షలు విధిస్తే పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య సిబ్బంది కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. అంతర్జాతీయ సంస్థలు ఇతర దేశాల్లో పెట్టుబడులు పెట్టేందుకు మొగ్గుచూపవచ్చు. ప్రతిభావంతులైన యువత కెనడా, ఆస్ట్రేలియా, యూరప్ వంటి ప్రత్యామ్నాయ దేశాల వైపు వెళ్లే అవకాశమూ ఉంది.

ఏపీఈసీ సదస్సు.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలక మలుపు

● అగ్రదేశాల ఆధిపత్య పోరు.. వాణిజ్య సహకారానికి పరీక్ష

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పెరుగుతున్న అనిశ్చితి, అగ్రదేశాల మధ్య వాణిజ్య పోటీ, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఏపీఈసీ సదస్సు ప్రాధాన్యత సంతరించుకుంది. ఆసియాపసిఫిక్ ప్రాంతం ప్రపంచ వాణిజ్యంలో కీలక పాత్ర పోషిస్తున్న తరుణంలో ఈ సదస్సు చర్చలు, నిర్ణయాలు అంతర్జాతీయ ఆర్థిక సంబంధాలపై ప్రభావం చూపనున్నాయి. అమెరికా, చైనా మధ్య ఆధిపత్య పోరు, వాణిజ్య ఆంక్షలు, సుంకాల విధింపులు ప్రపంచ దేశాలను కొత్త ఆర్థిక వ్యూహాల వైపు నడిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశాల మధ్య పరస్పర సహకారం, సమన్వయం, వాణిజ్య స్వేచ్ఛను కాపాడటం అత్యంత అవసరం.ప్రపంచీకరణతో దేశాల ఆర్థిక వ్యవస్థలు పరస్పరం అనుసంధానమయ్యాయి. ఒక దేశంలో ఉత్పత్తి రంగం మందగించినా, ముడిసరుకు సరఫరాలో అంతరాయం ఏర్పడినా దాని ప్రభావం అనేక దేశాలపై పడుతోంది. ఎగుమతులు, దిగుమతులు, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలు అంతర్జాతీయ సంబంధాల్లో కీలకంగా మారాయి. అయితే అగ్రదేశాలు తమ ఆర్థిక ప్రయోజనాల కోసం అనుసరిస్తున్న విధానాలు ప్రపంచ వాణిజ్యానికి సవాళ్లు విసురుతున్నాయి. సుంకాల పెంపు, వాణిజ్య ఆంక్షలు, దేశీయ పరిశ్రమలకు అధిక ప్రాధాన్యత ఇచ్చే విధానాలు మార్కెట్లలో అస్థిరతకు దారితీస్తున్నాయి. వీటి ప్రభావం అభివృద్ధి చెందుతున్న దేశాలపై మరింత తీవ్రంగా పడుతోంది. ఉత్పత్తి వ్యయాలు పెరగడం, పెట్టుబడులు తగ్గడం, ఎగుమతి అవకాశాలు పరిమితం కావడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి.అమెరికా, చైనా మధ్య కొనసాగుతున్న పోటీ కేవలం వాణిజ్య రంగానికే పరిమితం కాకుండా సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ, సెమీకండక్టర్లు, డిజిటల్ రంగాల్లోనూ విస్తరించింది. ప్రపంచ మార్కెట్‌పై ఆధిపత్యం సాధించేందుకు అగ్రదేశాలు అనుసరిస్తున్న వ్యూహాలు ఇతర దేశాలను కూడా ప్రభావితం చేస్తున్నాయి. సరఫరా వ్యవస్థలను తమకు అనుకూలంగా మార్చుకోవడం, కీలక సాంకేతిక రంగాలపై నియంత్రణ సాధించడం, పెట్టుబడుల ప్రవాహాలను



ప్రభావితం చేయడం వంటి ప్రయత్నాలు పెరుగుతున్నాయి. ఈ పోటీ ప్రపంచ దేశాలకు అవకాశాలను కల్పిస్తున్నప్పటికీ, ఆర్థిక విభజనకు దారితీసే ప్రమాదం కూడా ఉంది. దేశాలు వేర్వేరు వాణిజ్య కూటములుగా విడిపోతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉంది.ఏపీఈసీ వేదిక చిన్న, మధ్యస్థాయి దేశాలకు కూడా ఎంతో కీలకమైనది. అగ్రదేశాల మధ్య కుదిరే ఒప్పందాలు, విధాన నిర్ణయాలు చిన్న దేశాల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీయకుండా చూడాలి. అభివృద్ధి చెందుతున్న దేశాలకు సమాన అవకాశాలు కల్పించడం, వాణిజ్య అడ్డంకులను తగ్గించడం, పెట్టుబడులను ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలను పెంచడం వంటి అంశాలపై సదస్సు దృష్టి సారించాలి. పెద్ద ఆర్థిక వ్యవస్థల ప్రయోజనాలకే పరిమితమయ్యే విధానాలు ప్రపంచ దేశాల మధ్య అసమానతలను మరింత పెంచుతాయి. అందుకే సమాన భాగస్వామ్యం, పారదర్శక వాణిజ్య విధానాలు, పరస్పర ప్రయోజనకర ఒప్పందాలు అవసరం.ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానం పాత్ర రోజురోజుకూ పెరుగుతోంది. కృత్రిమ మేధ, డిజిటల్ వాణిజ్యం, ఆధునిక తయారీ రంగాలు భవిష్యత్ ఆర్థిక అభివృద్ధికి కీలకంగా మారుతున్నాయి. ఈ రంగాల్లో సహకారం పెరిగితే దేశాలకు అభివృద్ధి అవకాశాలు విస్తరిస్తాయి. కానీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆధిపత్య సాధనంగా ఉపయోగించడం, ఇతర దేశాలకు అందుబాటును పరిమితం చేయడం వల్ల అభివృద్ధి అసమానంగా మారుతుంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడం, డిజిటల్ భద్రత, నైపుణ్యాభివృద్ధి, పరిశోధనలకు ప్రోత్సాహం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న మరో ప్రధాన సమస్య సరఫరా వ్యవస్థల అస్థిరత. యుద్ధాలు, రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య ఆంక్షలు, ప్రకృతి వైపరీత్యాలు సరఫరా వ్యవస్థలను దెబ్బతీస్తున్నాయి. దీని ప్రభావం వస్తువుల ధరలు, పరిశ్రమల ఉత్పత్తి, వినియోగదారులపై పడుతోంది. ఒకే దేశంపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ సరఫరా వ్యవస్థలను అభివృద్ధి చేసుకోవడం, ప్రాంతీయ వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడం అవసరం. ఏపీఈసీ దేశాలు పరస్పర సహకారంతో ఈ సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించాలి.అగ్రదేశాల మధ్య పోటీ సహజమే అయినప్పటికీ, అది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే స్థాయికి చేరకూడదు. దేశాల మధ్య విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవడం, వాణిజ్య సంబంధాలను కొనసాగించడం, అంతర్జాతీయ ఒప్పందాలను గౌరవించడం అవసరం. ఆర్థిక ప్రయోజనాల కోసం ఇతర దేశాలపై ఒత్తిడి తీసుకురావడం కంటే పరస్పర విశ్వాసాన్ని పెంపొందించే విధానాలు అనుసరించాలి. ప్రపంచ దేశాల అభివృద్ధి ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్నందున, ఏ ఒక్క దేశం ఒంటరిగా స్థిరమైన ఆర్థిక ప్రగతిని సాధించడం కష్టమే.ఏపీఈసీ సదస్సు కేవలం చర్చల వేదికగా మిగిలిపోకుండా, ఆచరణాత్మక నిర్ణయాలకు కేంద్రంగా మారాలి. వాణిజ్య అడ్డంకుల తగ్గింపు, పెట్టుబడుల ప్రోత్సాహం, సాంకేతిక సహకారం, పర్యావరణ పరిరక్షణ, అభివృద్ధి చెందుతున్న దేశాలకు మద్దతు వంటి అంశాల్లో స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలి. అగ్రదేశాల ఆధిపత్య పోరుకు బదులుగా సమాన భాగస్వామ్యం, సహకారం, శాంతియుత వాణిజ్యానికి ప్రాధాన్యత ఇచ్చినప్పుడే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వాన్ని సాధించగలదు. దేశాల మధ్య పోటీ అభివృద్ధికి దోహదపడాలి తప్ప, సంక్షోభాలకు కారణం కాకూడదు. ఇదే ఏపీఈసీ సదస్సు ప్రపంచానికి అందించాల్సిన ప్రధాన సందేశం.

బిల్కిస్ బానో కేసు.. న్యాయంపై నమ్మకానికి పరీక్ష

● దోషులకు ఊరట.. బాధితురాలి హక్కులపై మరోసారి చర్చ

2002 గుజరాత్ అల్లర్ల సమయంలో బిల్కిస్ బానోపై జరిగిన సామూహిక అత్యాచారం, ఆమె కుటుంబ సభ్యుల హత్య దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన ఘటన. ఈ కేసులో దోషులుగా తేలిన వారికి శిక్ష విధించినప్పటికీ, విడుదల, తిరిగి జైలు, తాజాగా ఇద్దరు దోషులకు బెయిల్ వంటి పరిణామాలు న్యాయవ్యవస్థ తీరుపై మరోసారి చర్చకు తెరలేపాయి. న్యాయం అనేది కేవలం నేరస్తులకు శిక్ష విధించడంతోనే పూర్తవుతుందా? బాధితురాలి భద్రత, గౌరవం, అభిప్రాయానికి కూడా సమాన ప్రాధాన్యత ఉండాలా? అనే ప్రశ్నలు ముందుకొస్తున్నాయి.ఈ కేసులో 11 మంది దోషులకు 2022లో గుజరాత్ ప్రభుత్వం ముందస్తు విడుదల కింద మినహాయింపు ఇచ్చి జైలు నుంచి విడుదల చేసింది. ఈ నిర్ణయంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంది. 2024 జనవరిలో ఆ విడుదల ఉత్తర్వులను రద్దు చేస్తూ, గుజరాత్ ప్రభుత్వానికి ఈ విషయంలో అధికార పరిధి లేదని స్పష్టం చేసింది. దీంతో దోషులు తిరిగి జైలుకు వెళ్లాల్సి వచ్చింది. తాజాగా ఇద్దరు దోషులకు అప్పీల్ విచారణ పెండింగ్‌లో ఉండగా బెయిల్ మంజూరు చేయడం మరోసారి వివాదానికి కారణమైంది. **బాధితురాలి వాదనకు ప్రాధాన్యత ఏది?**నేర విచారణలో నిందితుల హక్కులతో పాటు బాధితుల హక్కులను కూడా న్యాయస్థానాలు కాపాడాల్సిన బాధ్యత ఉంది. బెయిల్, శిక్ష తగ్గింపు, విడుదల వంటి నిర్ణయాలు తీసుకునే సమయంలో బాధితురాలి అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవడం న్యాయ ప్రక్రియలో కీలక అంశం. బిల్కిస్ బానో తనకు సమాచారం ఇవ్వకుండా, తన వాదన వినకుండా బెయిల్ నిర్ణయం తీసుకున్నారని ఆవేదన



వ్యక్తం చేయడం ఈ అంశాన్ని మరింత ప్రాధాన్యత కలిగిస్తోంది. బాధితురాలి భద్రతా ఆందోళనలను తేలికగా తీసుకోకూడదు. న్యాయస్థానాలపై ప్రజలకు విశ్వాసం నిలవాలంటే చట్టపరమైన ప్రక్రియతో పాటు మానవీయ కోణం కూడా ప్రతిబింబించాలి. **న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం నిలవాలి** న్యాయస్థానాలు నిందితులకు చట్టం కల్పించిన హక్కులను కాపాడటం ఎంత ముఖ్యమో, బాధితులకు న్యాయం జరిగేలా చూడటం కూడా అంతే ముఖ్యం. ముఖ్యంగా సామూహిక అత్యాచారం, హత్య వంటి తీవ్రమైన నేరాల్లో బెయిల్ లేదా ఇతర ఉపశమన నిర్ణయాలు తీసుకునేటప్పుడు సమగ్ర పరిశీలన అవసరం. శిక్ష అనుభవించిన కాలం, ఆరోగ్య పరిస్థితులు, అప్పీళ్లలోని న్యాయపరమైన అంశాలు పరిశీలించాల్సిందే. అదే సమయంలో నేర తీవ్రత, బాధితురాలి భద్రత, సమాజంపై ప్రభావం వంటి అంశాలు కూడా విస్మరించరాదు. చట్టం ముందు అందరూ సమానమే అనే సూత్రం నిర్ణయాల్లో స్పష్టంగా కనిపించాలి.**బాధితుల గొంతుక వినిపించే వ్యవస్థ కావాలి**దేశంలో న్యాయ ప్రక్రియలో బాధితుల భాగస్వామ్యానికి మరింత ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉంది. నేర బాధితులు తమకు సంబంధించిన నిర్ణయాల గురించి తెలుసుకునే అవకాశం, తమ అభిప్రాయాన్ని తెలియజేసే హక్కు, భద్రతకు సంబంధించిన హామీలు పొందాలి. బాధితుల వేదనను పదేపదే గుర్తుచేసే పరిస్థితులు తగ్గించాలి. న్యాయం కోసం సంవత్సరాల తరబడి పోరాడే వారికి వ్యవస్థ నుంచి తగిన మద్దతు లభించాలి. న్యాయ ప్రక్రియ బాధితులకు మరో బాధగా మారకుండా ఉండేలా చర్యలు చేపట్టాలి.బిల్కిస్ బానో కేసు దేశ న్యాయవ్యవస్థకు ఒక కీలక పరీక్షగా నిలుస్తోంది. చట్టం, న్యాయం, మానవ హక్కులు, బాధితుల గౌరవం వంటి అంశాలన్నీ ఈ కేసులో ముడిపడి ఉన్నాయి. నిందితులకు చట్టపరమైన హక్కులు కల్పించడం న్యాయవ్యవస్థ బాధ్యతే అయినా, బాధితురాలి హక్కులు, భద్రత, ఆవేదనను విస్మరించకూడదు. న్యాయం అనేది తీర్పులకే పరిమితం కాకుండా బాధితులకు భరోసా కల్పించే ప్రక్రియగా ఉండాలి. చట్టంపై ప్రజలకు విశ్వాసం పెరిగేలా, న్యాయవ్యవస్థ నిష్పాక్షికతకు అద్దం పట్టేలా ప్రతి నిర్ణయం ఉండాలి. అప్పుడే న్యాయానికి నిజమైన గౌరవం లభిస్తుంది.

రాజీవ్ గృహకల్ప స్థలంలో భూకబ్జాలు.. పట్టించుకోని అధికారులు



కుత్బుల్లాపూర్ : నవంబర్ 20 (పీపుల్స్ న్యూస్) :జగద్గిరిగుట్ట డివిజన్‌లోని రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురవు తున్నాయని సంక్షేమ సంఘం సలహాదారు నరసింహారెడ్డి ఆరోపించారు. పోలీస్ స్టేషన్ ఎదురుగా, రాజీవ్ గృహకల్ప వాటర్ ట్యాంక్ పక్కన కొందరు వ్యక్తులు రాత్రికి రాత్రే డబ్బాలు ఏర్పాటు చేసి, వాటి వెనుక పిల్లర్లతో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. ఈ అక్రమాలను అడ్డుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజీవ్ గృహకల్ప నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వం సుమారు 24 ఎకరాల 78 సెంట్ల స్థలాన్ని కేటాయించి, 104 బ్లాకుల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించిందన్నారు. అయితే 54 బ్లాకులు మాత్రమే నిర్మించి, 1,779 నిరుపేద కుటుంబాలకు ఇళ్లను పంపిణీ చేశారని వివరించారు. మిగిలిన స్థలంలో ప్లేగ్రౌండ్లు, గుడి, మజీదు, చర్చి తదితర సామాజిక అవసరాల కోసం స్థలాలను కేటాయించారని పేర్కొన్నారు. ప్రస్తుతం మిగిలిన ప్రభుత్వ స్థలాలను కొందరు గుడి, బడి పేరుతో ఆక్రమించుకుంటున్నారని సంక్షేమ సంఘం ఆరోపిస్తోంది. ఈ విషయంపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందన లేదని నరసింహారెడ్డి అన్నారు.
అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్రమ నిర్మాణాలను అడ్డుకో వడంతో పాటు ప్రభుత్వ స్థలాలను
కాపాడాలని కోరారు.

మాదాపూర్‌లో గంజాయి దందా.. స్విగ్గీ డెలివరీ బాయ్ అరెస్ట్!



- డెలివరీ ఉద్యోగం ముసుగులో గంజాయి విక్రయాలు.. 1,089 గ్రాముల గంజాయి స్వాధీనం
- ఒడిశా నుంచి కిలో గంజాయి కొనుగోలు.. చిన్న ప్యాకెట్లుగా చేసి రూ.400--500కు విక్రయం

సైబరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో నవంబర్ 20 (పీపుల్స్ న్యూస్) :ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ఉద్యోగం చేస్తూనే అక్రమంగా గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న యువకుడిని మాదాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 1,089 గ్రాముల గంజాయితో పాటు ఎలక్ట్రానిక్ తూకం యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన బలరాం మొహంతా (28) మాదాపూర్‌లోని సిద్దిక్‌నగర్‌లో నివాసం ఉంటూ స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. అదనపు ఆదాయం సంపాదించాలనే ఉద్దేశంతో ఒడిశాకు చెందిన బాబు అనే వ్యక్తి వద్ద కిలో గంజాయిని రూ.15 వేలకు కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకొచ్చినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అనంతరం గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి ఒక్కో ప్యాకెట్‌ను రూ.400 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

●విశ్వసనీయ సమాచారంతో దాడులు

గంజాయి విక్రయాలపై సమాచారం అందుకున్న మాదాపూర్ పోలీసులు, డివిజన్ క్లోజ్ టీమ్ సిబ్బందితో కలిసి సిద్దిక్‌నగర్‌లోని రోడ్ నంబర్ 4లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా కనిపించిన బలరాం మొహంతాను అదుపులోకి తీసుకుని విచారించగా గంజాయి విక్రయాల వ్యవహారం వెలుగులోకి వచ్చింది.
నిందితుడి వద్ద, అతని నివాస గదిలో తనిఖీలు నిర్వహించి మొత్తం 1,089 గ్రాముల గంజాయి, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు.

●గంజాయి సరఫరాదారు పరారీ

ఈ వ్యవహారంలో గంజాయి సరఫరా చేసిన ఒడిశాకు చెందిన బాబు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. అతడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

మెట్రో స్టేషన్ పార్కింగ్‌లో బైక్‌లే టార్గెట్.. యువకుడి చేతివాటం!

- సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడి గుర్తింపు.. ఐదు చోరీ బైక్‌లు స్వాధీనం
- సుమారు రూ.3 లక్షల విలువైన ద్విచక్ర వాహనాలు రికవరీ చేసిన మియాపూర్ పోలీసులు



సైబరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో నవంబర్ 20 (పీపుల్స్ న్యూస్) : మెట్రో రైల్వే స్టేషన్ పార్కింగ్ ప్రాంతాల్లో నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న యువకుడిని మియాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి సుమారు రూ.3 లక్షల విలువైన ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి పట్టణానికి చెందిన ముత్యాల కళ్యాణ్ రాజ్ (19) విద్యార్థిగా ఉంటూ మోటార్ సైకిళ్ల చోరీలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ముఖ్యంగా మియాపూర్ మెట్రో రైల్వే స్టేషన్ పార్కింగ్ ప్రాంతాల్లో హ్యాండిల్ లాక్ వేయకుండా వదిలేసిన ద్విచక్ర వాహనాలను నిందితుడు లక్ష్యంగా చేసుకునేవాడు. పార్కింగ్ ప్రాంతంలో వాహనాలను పరిశీలించి, సరైన భద్రత లేని బైక్‌లను గుర్తించి చోరీలకు పాల్పడేవాడు.
ఈ క్రమంలో కేసుల దర్యాప్తులో భాగంగా మియాపూర్ మెట్రో స్టేషన్ పార్కింగ్ ప్రాంతంలోని సీసీ కెమెరాల దృశ్యాలను పోలీసులు పరిశీలించారు. అందులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తి కదలికలను గుర్తించి, తదుపరి విచారణతో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.
విచారణలో నిందితుడి నుంచి స్వాధీన పంచనామా ద్వారా ఐదు చోరీ బైక్‌లను పోలీసులు రికవరీ చేశారు. వీటిలో యమహా ఎంటీ-15, కేటీఎం డ్యూక్, సుజుకి యాక్సెస్, హోండా ప్యాషన్, టీవీఎస్ జూపిటర్ వాహనాలు ఉన్నాయి. వీటి మొత్తం విలువ సుమారు రూ.3 లక్షలుగా పోలీసులు వెల్లడించారు.

● ప్రజలకు పోలీసుల సూచనలు

ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేసే సమయంలో తప్పనిసరిగా హ్యాండిల్ లాక్ వేయాలని, అదనపు భద్రత కోసం వీల్ లాక్ లేదా డిస్క్ లాక్ వినియోగించాలని పోలీసులు సూచించారు. అధికారిక పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలను నిలిపి ఉంచాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు లేదా 100/112కు సమాచారం అందించాలని కోరారు.

● పోలీసు సిబ్బందికి అభినందనలు

కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్, అదనపు డీసీపీ ఎం. సుధర్శన్, కేపీహెచ్‌బీ ఏసీపీ ఈ. రవికిరణ్ రెడ్డి మార్గదర్శకత్వంలో మియాపూర్ ఎస్‌హెచ్ఓ, డీఐ, ఎస్ఐలు, సిబ్బంది సమన్వయంతో సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించి నిందితుడిని పట్టుకోవడంతో పాటు చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఉన్నతాధికారులు తగిన బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.

పోలీసింగ్‌కు కొత్త దిశ.. భవిష్యత్ ప్రణాళికలకు డీజీపీ శ్రీకారం!

- పోలీస్ శాఖలో సమూల మార్పులకు కార్యాచరణ.. కీలక అంశాలపై మినీ స్టాఫ్ ఆఫీసర్స్ సమావేశంలో సమీక్ష
- 2,000 మంది హోంగార్డుల నియామకానికి కసరత్తు.. పోలీస్ మాన్యువల్ రూపకల్పన, వార్షిక శిక్షణ క్యాలెండర్‌పై ప్రత్యేక దృష్టి







హైదరాబాద్, క్రైమ్ బ్యూరో నవంబర్ 20 (పీపుల్స్ న్యూస్) : తెలంగాణ పోలీస్ శాఖను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు డీజీపీ సి.వి. ఆనంద్ కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. పోలీసింగ్‌లో నూతన విధానాలు, శాఖ అభివృద్ధి, సిబ్బంది సంక్షేమం, శిక్షణ తదితర కీలక అంశాలపై శుక్రవారం నిర్వహించిన మినీ స్టాఫ్ ఆఫీసర్స్ సమావేశంలో ఉన్నతాధికారులతో సమగ్రంగా చర్చించారు.
వచ్చే నెలలో నిర్వహించనున్న పోలీస్ రిట్రీట్, మహిళా పోలీస్ అధికారుల సదస్సు ఏర్పాట్లపై సమీక్షించారు. నూతన తెలంగాణ పోలీస్ మాన్యువల్ రూపకల్పనను పూర్తి చేసి విడుదల చేయడం, పోలీస్ బ్రాస్, పైప్ బ్యాండ్లను పునరుద్ధరించడం వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్రస్థాయి డ్యూటీ మీట్‌తో పాటు ఆల్ ఇండియా పోలీస్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణపైనా చర్చించారు.

● శిక్షణ, నియామకాలపై ప్రత్యేక దృష్టి

పోలీస్ శాఖలో సిబ్బంది నైపుణ్యాలను పెంపొందించేందుకు వార్షిక శిక్షణ క్యాలెండర్ సిద్ధం చేయాలని నిర్ణయించారు. 2,000 మంది హోంగార్డుల నియామకానికి సంబంధించిన నోటిఫికేషన్, ఇతర ప్రక్రియలపై సమీక్షించారు. ప్రస్తుత అవసరాలు, పెరుగుతున్న విధుల భారానికి అనుగుణంగా తెలంగాణ పోలీస్ శాఖలో మంజూరైన సిబ్బంది సంఖ్యను పునఃసమీక్షించే అంశాన్ని పరిశీలించారు.

● రిటైర్డ్ పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యం

విశ్రాంత పోలీసు అధికారుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలపైనా సమావేశంలో చర్చించారు. పోలీసు సిబ్బంది సంక్షేమం, శాఖాగత అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు.

●అధికారులకు బాధ్యతలు.. పనులకు గడువులు

సమావేశంలో చర్చించిన ప్రతి అంశానికి సంబంధించి సంబంధిత అధికారులకు నిర్దిష్ట బాధ్యతలు అప్పగించడంతో పాటు, పనుల పూర్తికి గడువులు నిర్ణయించారు. నిర్ణీత సమయంలో లక్ష్యాలను సాధించేలా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని డీజీపీ సి.వి. ఆనంద్ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో డీజీ విమెన్ సేఫ్టీ వింగ్ డా. సౌమ్య మిశ్రా, టీజీపీఏ డైరెక్టర్ అభిలాష బిస్తు, డీజీ ఏసీబీ అండ్ సీఐడీ చారు సిన్హా, టీజీఎస్పీ ఏడీజీ సంజయ్ కుమార్ జైన్, ఏడీజీ (లా అండ్ ఆర్డర్) డా. అకున్ సబర్వాల్, ఐజీ (పి అండ్ ఎల్) డా. గజరావ్ భూపాల్‌తో పాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రూ.30 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వార్డు అధికారి!

- రూ.40 వేలు డిమాండ్ చేసి.. చివరకు రూ.30 వేలకు బేరం కుదుర్చుకున్న వైనం
- వారసత్వ ఇంటి ఆస్తి పేరు మార్పు కోసం లంచం.. యెల్లంపేట మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ వల



హైదరాబాద్ : క్రైమ్ బ్యూరో నవంబర్ 20 (పీపుల్స్ న్యూస్): ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల బాగోతానికి అడ్డుకట్ట పడటం లేదు. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు అధికారులు లంచాలకు డిమాండ్ చేస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. తాజాగా కుత్బుల్లాపూర్ పరిధిలోని యెల్లంపేట మున్సిపల్ కార్యాలయంలో ఓ వార్డు అధికారి రూ.30 వేల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు.
ఏసీబీ విడుదల చేసిన ప్రెస్‌నోట్ వివరాల ప్రకారం.. యెల్లంపేట మున్సిపల్ కార్యాలయంలో వార్డు అధికారిగా పనిచేస్తున్న డి. రవీందర్ రెడ్డి, ఫిర్యాదుదారుడి తండ్రి పేరు మీద ఉన్న వారసత్వ ఇంటి ఆస్తిని అతని పేరుపైకి మార్చి మ్యుటేషన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు లంచం డిమాండ్ చేశాడు. తొలుత రూ.40 వేలు ఇవ్వాలని కోరిన అధికారి, అనంతరం ఆ మొత్తాన్ని రూ.30 వేలకు తగ్గించాడు.
ఈ వ్యవహారంపై ఫిర్యాదు అందుకున్న రంగారెడ్డి రేంజ్ ఏసీబీ అధికారులు శుక్రవారం వలపన్ని తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో తన కార్యాలయంలోనే ఫిర్యాదుదారుడి నుంచి రూ.30 వేల లంచం నేరుగా స్వీకరిస్తుండగా డి. రవీందర్ రెడ్డిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.
అధికారిక హోదాను దుర్వినియోగం చేసి అక్రమ ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినట్లు ఏసీబీ ప్రెస్‌నోట్‌లో పేర్కొంది. నిందితుడిని అరెస్టు చేసి నాంపల్లిలోని ఎస్పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచి న్యాయ రిమాండ్‌కు తరలించనున్నట్లు వెల్లడించింది. ఈ కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉందని, ఫిర్యాదుదారుడి భద్రత దృష్ట్యా వివరాలను గోప్యంగా ఉంచినట్లు తెలిపింది.

● లంచం అడిగితే 1064కు ఫిర్యాదు చేయండి

ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. వాట్సాప్ నంబర్ 9440446106, ఫేస్‌బుక్, ఎక్స్ సామాజిక మాధ్యమాల ద్వారా కూడా సమాచారం అందించవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల పేర్లు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఏసీబీ స్పష్టం చేసింది.

గంజాయి విక్రేతలపై ఉక్కుపాదం.. కమ్యూనల్ రౌడీలపై ప్రత్యేక నిఘా!

- డ్రగ్స్ మాఫియాపై పీడీ, పిట్‌ఎన్‌డీపీఎస్ చట్టాల ప్రయోగానికి డీజీపీ ఆదేశాలు
- అక్రమ ఆస్తుల జప్తునకు చర్యలు.. చార్మినార్ జోన్‌లో ప్రత్యేక సోషల్ మీడియా సెల్ ఏర్పాటుపై సమీక్ష

హైదరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో నవంబర్ 20 (పీపుల్స్ న్యూస్) : నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు తెలంగాణ పోలీస్ శాఖ ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది. గంజాయి విక్రయాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, అలవాటుపడిన నేరస్తులు, మతపరమైన ఘర్షణలకు కారణమయ్యే కమ్యూనల్ రౌడీ షీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ మేరకు చార్మినార్ జోన్ పరిధిలో నేరాల నియంత్రణపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.పోలీస్ కమిషనర్ డా. మహేశ్ మురళీధర్ భగవత్, అదనపు సీపీ (లా అండ్ ఆర్డర్) తఫ్సీర్ ఇక్బాల్, చార్మినార్ జోన్ డీసీపీ కిరణ్ ఖారే ప్రభాకర్‌తో కలిసి జోన్ పరిధిలోని అదనపు డీసీపీలు, డీఐలు, ఎస్‌హెచ్ఓలతో సమావేశమై నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.



● డ్రగ్స్ విక్రయిస్తే కఠిన చర్యలు

గంజాయి విక్రయాలకు పాల్పడే వారిపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని అధికారులకు స్పష్టం చేశారు. పదేపదే నేరాలకు పాల్పడుతూ ప్రవర్తన మార్చుకోని వారిపై పీడీ చట్టాన్ని ప్రయోగించాలని సూచించారు. అలవాటుపడిన మాదకద్రవ్యాల విక్రేతలపై పిట్‌ఎన్‌డీపీఎన్ చట్టం కింద చర్యలు తీసుకోవడంతో పాటు, అక్రమ సంపాదనతో కూడబెట్టిన చరాస్తులు, స్థిరాస్తులను గుర్తించి జప్తు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

● డ్రగ్స్ బాధితులకు పునరావాసం

మాదకద్రవ్యాల నిర్మూలన కోసం 'నషా ముక్త్ భారత్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. మాదకద్రవ్యాలకు అలవాటుపడిన బాధితులను గుర్తించి డీ-అడిక్షన్ కేంద్రాలకు తరలించడం, వారికి అవసరమైన చికిత్సతో పాటు పునరావాసం కల్పించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

● నేరస్తులకు శిక్షలు పడేలా ప్రత్యేక కార్యాచరణ

పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు నేరస్తులకు త్వరితగతిన శిక్షలు పడేలా కోర్టు కేసులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కేసుల్లో శిక్షలు పడేందుకు కీలకంగా పనిచేసిన పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ప్రోత్సహించేందుకు తరచూ రివార్డ్ మేళాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

● కమ్యూనల్ రౌడీల కదలికలపై నిఘా

మతపరమైన ఘర్షణలకు పాల్పడే కమ్యూనల్ రౌడీ షీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. తప్పుడు సమాచారం, వదంతులు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, మత ఘర్షణలను నివారిస్తూ శాంతిభద్రతలను కాపాడాలని స్పష్టం చేశారు.



● సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా

ఆన్‌లైన్ వేదికల ద్వారా వదంతులు, తప్పుడు ప్రచారాలను అరికట్టేందుకు చార్మినార్ జోన్‌లో ప్రత్యేక సోషల్ మీడియా సెల్ ఏర్పాటు చేసే అంశంపై సమావేశంలో చర్చించారు. సైబర్ నేరాల నియంత్రణకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని, సీఈఐఆర్ పోర్టల్‌ను సమర్థవంతంగా వినియోగించి పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల రికవరీని వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

అనుమానాలు.. డబ్బు గొడవలు.. సహజీవన భాగస్వామి దారుణ హత్య!

- ఆమెపై అనుమానంతో కత్తితో గొంతు కోసిన నిందితుడు.. ఆరాంఘర్ వద్ద నిందితుడి అరెస్ట్
- బహదూర్‌పురా పోలీసుల ఛేదన.. హత్యకు ఉపయోగించిన కత్తి, సెల్‌ఫోన్ స్వాధీనం



హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో నవంబర్ 20 (పీపుల్స్ న్యూస్) :అనుమానాలు, ఆర్థిక వివాదాలు చివరకు ఓ మహిళ ప్రాణాలను బలిగొన్నాయి. సహజీవనం చేస్తున్న మహిళతో తరచూ గొడవలు పడుతూ, ఆమెపై అనుమానం పెంచుకున్న వ్యక్తి కత్తితో గొంతు కోసి హత్య చేసిన ఘటన హైదరాబాద్‌లో కలకలం రేపింది. ఈ హత్య కేసును బహదూర్‌పురా పోలీసులు ఛేదించి నిందితుడిని అరెస్టు చేశారు.పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రంలోని సమస్తిపూర్ జిల్లాకు చెందిన ధమేంద్ర కుమార్ అలియాస్ ఫరూక్ అలియాస్ ధమేంద్ర పాస్వాన్ (26) జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వలస వచ్చాడు. ఆరాంఘర్ ప్రాంతంలోని ఎస్ఏఎస్ గ్రూప్ ఆఫ్ మెటల్స్ స్క్రాప్ యూనిట్‌లో కార్మికుడిగా పనిచేస్తూ రోజుకు సుమారు రూ.1,000 సంపాదించేవాడు.

ఈ క్రమంలో 2024లో దానమా హట్స్ కాంపౌండ్ వద్ద అస్మా బేగం (31)తో అతడికి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా సంబంధంగా మారడంతో ఇద్దరూ సహజీవనం చేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

అయితే కొంతకాలంగా ఇద్దరి మధ్య మనస్పర్థలు మొదలయ్యాయి. అస్మా బేగంకు ఇతరులతో సంబంధాలు ఉన్నాయంటూ నిందితుడు అనుమానం పెంచుకున్నట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు ఆమె తరచూ డబ్బులు అడుగుతుండటంతో ఇద్దరి మధ్య వివాదాలు తలెత్తేవని పేర్కొన్నారు. ఈ అనుమానాలు, ఆర్థిక గొడవల నేపథ్యంలో అస్మా బేగంపై నిందితుడు కక్ష పెంచుకున్నట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.

● కత్తితో గొంతు కోసి హత్య

ఈ నేపథ్యంలో నవంబర్ 17న ఇద్దరి మధ్య మరోసారి గొడవ జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఆ సమయంలో ఆగ్రహానికి గురైన నిందితుడు వంటగదిలోని కత్తితో అస్మా బేగం గొంతు కోయడంతో తీవ్ర రక్తస్రావమై ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసుల ప్రెస్‌నోట్‌లో పేర్కొన్నారు.

● ఆరాంఘర్ వద్ద నిందితుడి అరెస్ట్

ఈ ఘటనపై మృతురాలి తండ్రి మహమ్మద్ ఉస్మాన్ అలీ ఫిర్యాదు మేరకు బహదూర్‌పురా పోలీసులు క్రైమ్ నంబర్ 373/2026, బీఎన్ఎస్ సెక్షన్ 103(1) కింద హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అందుబాటులో ఉన్న ఆధారాలు, సమాచారంతో నిందితుడిని గుర్తించి నవంబర్ 19న ఆరాంఘర్ ఎక్స్ రోడ్డు సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. నేరానికి ఉపయోగించినట్లు ఆరోపణలు ఉన్న కత్తితో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

● పోలీసు బృందానికి అభినందనలు

ఫలక్‌నుమా డివిజన్ ఏసీపీ ఎం.ఏ. జావేద్ నాయకత్వంలో, రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్. శ్రీనివాస్ ఐపీఎస్ పర్యవేక్షణలో బహదూర్‌పురా ఇన్‌స్పెక్టర్, ఎస్‌హెచ్‌ఓ మహ్మద్ హఫీజుద్దీన్ నేతృత్వంలోని పోలీసు బృందం కేసును ఛేదించి నిందితుడిని అరెస్టు చేసింది. కేసు దర్యాప్తులో పోలీసు బృందం సమర్థవంతంగా పనిచేసిందని ఉన్నతాధికారులు వెల్లడించారు.

ఆదర్శ మాతృమూర్తి తండా రాధమ్మ ఆమె సేవలు అందరికీ ఆదర్శనీయం..



- కలాం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎండి సర్వర్ అహ్మద్..

ములుగు జిల్లా ప్రతినిధి నవంబర్ 20 (పీపుల్స్ న్యూస్) :ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లోని లక్ష్మీదేవి పేటకు గ్రామానికి చెందిన తండా రాధమ్మ సేవలు అందరికీ ఆదర్శ నియమని కలం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మొహమ్మద్ సర్వర్ అహ్మద్ అన్నారు. మండలంలోని లక్ష్మీదేవి పేట గ్రామంలో ఇటీవల తండరాధమ్మ అనారోగ్యంతో మృతి చెందగా,ఈ సందర్భాన్ని సంతాపాన్ని పురస్కరించుకొని ప్రముఖ సాఫ్ట్వేర్ ఇంజనీర్ చెవుల అమరేందర్ సూచన మేరకు వారి కుమారులు తండా రమేష్ తండా శ్రీను లను చిన్న నాటి మిత్రులు కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరామర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండ రాధమ్మ లక్ష్మీదేవి పేట గ్రామంలో శివాలయంలో సుమారు కొన్ని ఏళ్లుగా నిరంతరం పూజా కార్యక్రమాలు చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఆమె కుమారులను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో కలం ఫౌండేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నల్లవెల్లి సాంబయ్యపటేల్, ప్రధాన కార్యదర్శి పెండ్యాల సలేంద్రం మడుపోజు రాధాకృష్ణ ఎండి సాదిక్ పుంద్ర కుమార్ కారు పోతుల యాదగిరి కారుపోతుల సత్యం కారూపోతుల దేవేందర్ మొలుగూరి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కార్ల అద్దాలు పగులగొట్టి చోరీలు.. 14 కేసుల నిందితుడు అరెస్ట్!

- పార్కింగ్‌లో ఉన్న వాహనాలే టార్గెట్.. నగదు, బంగారు ఆభరణాల అపహరణ
- రూ.97 వేల నగదు, రెండు తులాల బంగారు చెవిపోగులు స్వాధీనం.. కలాపత్తర్ పోలీసుల చర్యలు



హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో నవంబర్ 20 (పీపుల్స్ న్యూస్) :పార్కింగ్ చేసిన కార్ల అద్దాలు పగులగొట్టి లోపల ఉన్న నగదు, బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను చోరీ చేస్తున్న అలవాటుపడిన నేరస్తుడిని కలాపత్తర్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిపై ఇప్పటికే 14 క్రిమినల్ కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. అతడి నుంచి రూ.97 వేల నగదు, రెండు తులాల బరువున్న ఒక జత బంగారు చెవిపోగులను స్వాధీనం చేసుకున్నారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహమ్మద్ బాబా అలియాస్ ఖాజా మొయినుద్దీన్ (56) పార్కింగ్ ప్రాంతాల్లో నిలిపి ఉంచిన కార్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడేవాడు. కార్ల అద్దాలను పగులగొట్టి లోపల ఉంచిన నగదు, బంగారు ఆభరణాలను అపహరించేవాడు. ఈ క్రమంలో నవంబర్ 16న తాడ్‌బన్‌లోని ప్యాలెస్ ఫంక్షన్ హాల్ సమీపంలో పిల్లర్ నంబర్ 79 వద్ద పార్కింగ్ చేసిన మహీంద్రా ఎక్స్‌యూవీ 500 కారు కుడివైపు డోర్ అద్దాన్ని పగులగొట్టి అందులో ఉన్న రూ.లక్ష నగదు, రెండు తులాల బరువున్న ఒక జత బంగారు చెవిపోగులను చోరీ చేశాడు.

● సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడి గుర్తింపు

ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన కలాపత్తర్ పోలీసులు సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా నవంబర్ 19న తాడ్‌బన్ ఎక్స్ రోడ్స్‌లోని కల్లు దుకాణం వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరానికి పాల్పడినట్లు అంగీకరించడంతో అతడి నుంచి రూ.97 వేల నగదు, చోరీ చేసిన బంగారు చెవిపోగులను పంచనామా ద్వారా స్వాధీనం చేసుకున్నారు.

● 14 కేసుల్లో నిందితుడిగా గుర్తింపు

పోలీసుల రికార్డుల పరిశీలనలో నిందితుడిపై మొత్తం 14 క్రిమినల్ కేసులు ఉన్నట్లు వెల్లడైంది. వీటిలో రెండు కేసుల్లో శిక్షలు కూడా పడినట్లు పోలీసులు తెలిపారు. ఫుట్‌పాత్‌లపై నివసిస్తూ మద్యానికి అలవాటుపడిన నిందితుడు, కార్లలో విలువైన వస్తువులు ఉన్నాయా అని గమనించి అద్దాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు.

● ప్రజలకు పోలీసుల హెచ్చరిక

కార్లలో నగదు, బంగారు ఆభరణాలు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు వంటి విలువైన వస్తువులను ఉంచి వెళ్లవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. కొద్దిసేపు మాత్రమే పార్కింగ్ చేసినప్పటికీ వాహనాలను తప్పనిసరిగా లాక్ చేయాలని, విలువైన వస్తువులను వెంట తీసుకెళ్లాలని కోరారు. నేరాల నియంత్రణకు నిరంతర గస్తీ, నిఘా, ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.కలాపత్తర్ ఎస్‌హెచ్‌ఓ మహ్మద్ ఖలీల్ పాషా, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జి. సత్యం నేతృత్వంలోని పోలీసు సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. ఫలక్‌నుమా ఏసీపీ, రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్. శ్రీనివాస్ ఐపీఎస్ పర్యవేక్షణలో ఈ చర్యలు చేపట్టారు.

న్యుమోనియా అంటే ఏమిటి.. లక్షణాలు ఎలా ఉంటాయి.. తగ్గేందుకు ఏం చేయాలి..?



న్యుమోనియా అంటే కేవలం దగ్గు, జ్వరం మాత్రమే కాదు. ఇది ఊపిరితిత్తులకు సోకే ఇన్ఫెక్షన్. దీని వల్ల ఊపిరితిత్తులు సాధారణంగా పనిచేయవు. సరైన సమయంలో చికిత్స అందకపోతే ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా లక్షణాలు మొదలైన తొలి 24 గంటల్లోనే వ్యాధిని గుర్తించడం చాలా ముఖ్యం.

ఎందుకంటే ఈ ఇన్ఫెక్షన్ కారణంగా ఊపిరితిత్తుల్లో చీము, ద్రవం పేరుకుపోయి రక్తంలోకి తగినంత ఆక్సిజన్ చేరకుండా అడ్డుకుంటాయి. అందువల్ల న్యుమోనియా అనుమానం వచ్చినప్పుడు ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

న్యుమోనియా లక్షణాలు ఎలా ఉంటాయి..?న్యుమోనియా వచ్చినప్పుడు వేగంగా శ్వాస తీసుకోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతినొప్పి, తీవ్రమైన అలసట వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొందరిలో గందరగోళం, మగత, పెదవులు లేదా గోళ్లు నీలం రంగులోకి మారడం కూడా ప్రమాద సంకేతాలు. ముఖ్యంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే వెంటనే వైద్య సహాయం పొందాలి. ప్రతి ఒక్కరిలో లక్షణాలు ఒకేలా ఉండవు. వృద్ధులకు న్యుమోనియా వచ్చినప్పటికీ కొన్నిసార్లు జ్వరం కనిపించదు. పిల్లల్లో పాలు లేదా ఆహారం సరిగ్గా తీసుకోకపోవడం, అసాధారణంగా చిరాకు పడడం, చురుకుదనం తగ్గడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తాయి. వృద్ధుల్లో అకస్మాత్తుగా గందరగోళం, బలహీనత లేదా రోజువారీ పనులు చేసుకునే సామర్థ్యం తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.వైద్య పరీక్షలు చేయించాలి..

లక్షణాలు కనిపించిన తొలి 24 గంటల్లో వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల వ్యాధి తీవ్రతను అంచనా వేయవచ్చు. రోగిని ఆసుపత్రిలో చేర్చాలా లేదా ఇంటి వద్ద చికిత్స అందించవచ్చా అనే విషయాన్ని వైద్యులు నిర్ణయిస్తారు. ఇందుకోసం రక్తపోటు, రక్తంలో ఆక్సిజన్ స్థాయి, శ్వాస వేగం, గుండె కొట్టుకునే వేగం వంటి అంశాలను పరిశీలిస్తారు. అవసరాన్ని బట్టి శారీరక పరీక్షలు, రక్తపరీక్షలు నిర్వహిస్తారు. రోగి వయసు, ఇతర ఆరోగ్య సమస్యలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, స్పృహ స్థాయి, ఆక్సిజన్ స్థాయి ఆధారంగా ఆసుపత్రిలో చేర్చాలా వద్దా అనేది నిర్ణయిస్తారు.

న్యుమోనియా బ్యాక్టీరియా, వైరస్ లేదా కొన్ని సందర్భాల్లో ఫంగస్ వల్ల వస్తుంది. బ్యాక్టీరియా వల్ల వచ్చిన న్యుమోనియాకు యాంటీబయాటిక్ మందులు ఉపయోగపడతాయి. వైరస్ వల్ల వచ్చిన న్యుమోనియాకు యాంటీబయాటిక్స్ పనిచేయవు.

ఇతరులు వాడిన యాంటీబయాటిక్ మందులను సొంతంగా తీసుకోవడం వల్ల సరైన చికిత్స ఆలస్యం కావడమే కాకుండా మందులను తట్టుకునే బ్యాక్టీరియా పెరిగే ప్రమాదం ఉంటుంది.

మందులను వాడాలి..

వైద్యులు సూచించిన మందులను క్రమం తప్పకుండా వాడుతూ, నిర్ణయించిన సమయానికి తిరిగి పరీక్ష చేయించుకోవాలి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పెరగడం, గందరగోళం, జ్వరం లేదా ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. వృద్ధులు, ఇతర దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలి. సరైన చికిత్స అందకపోతే న్యుమోనియా వల్ల శ్వాసకోశ వైఫల్యం వస్తుంది. ఇన్ఫెక్షన్ రక్తంలోకి వ్యాపించే ప్రమాదం కూడా ఉంటుంది.

దగ్గు ఎక్కువగా ఉండి, జ్వరం లేకపోయినా తీవ్రమైన అలసట లేదా శ్వాస సమస్యలు ఉంటే నిర్లక్ష్యం చేయకూడదు.

పిల్లలు, వృద్ధుల్లో లక్షణాలు సాధారణంగా కనిపించవు, కాబట్టి కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. శ్వాస సంబంధిత ఇబ్బందులు కనిపించినప్పుడు వైద్య సహాయం పొందడంలో ఆలస్యం చేయకపోవడమే న్యుమోనియా వల్ల వచ్చే తీవ్రమైన సమస్యలను నివారించడంలో కీలకమని నిపుణులు సూచిస్తున్నారు.

ఘనంగా న్యాయవాది డి. శ్రీధర్ రెడ్డి జన్మదిన వేడుకలు!



- మిత్రులు, కార్యాలయ సిబ్బంది మధ్య కేక్ కట్ చేసి సంబరాలు



పటాన్ చెరు: నవంబర్ 20 (పీపుల్స్ న్యూస్) : ప్రముఖ న్యాయవాది డి. శ్రీధర్ రెడ్డి 53వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తన కార్యాలయంలో సిబ్బంది, మిత్రుల సమక్షంలో జన్మదిన వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మిత్రుడు పూర్ణచంద్ర గౌడ్ కార్యక్రమానికి హాజరై కేక్ కట్ చేసి శ్రీధర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. తన జన్మదినాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ న్యాయస్థానాల్లో ప్రజల తరఫున నిలబడి, వారి హక్కుల కోసం మరింత అంకితభావంతో పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు.ఈ వేడుకల్లో కార్యాలయ సిబ్బంది, మిత్రులు తదితరులు పాల్గొని శ్రీధర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

సీపీఆర్ తో ఆపద సమయంలో ప్రాణాలు కాపాడాలి



– జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, 2026 నవంబర్ 18, గుండె సంబంధిత అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో స్పందించి విలువైన ప్రాణాలను కాపాడేందుకు కార్డియోపల్మోనరీ రిసిసిటేషన్ (సీపీఆర్)పై ప్రతి ఒక్కరూ అవగా హన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ విద్యార్థులు వాసు, సాహితి, అశ్విత్, హర్షవర్ధన్, సందీప్ తమ అధ్యాపకులు అరుణ, రాజులతో కలిసి జిల్లా కలెక్టర్‌ను కలిసి సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న మెగా సీపీఆర్ అవగాహన, శిక్షణ కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభు త్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశా లలు, డిగ్రీ కళాశాలలు, వైద్య కళాశాలలకు చెందిన వెయ్యి మందికి పైగా విద్యార్థులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్డియో పల్మోనరీ రిసిసిటేషన్ (సీపీఆర్)పై విద్యా ర్థులకు అవగాహన కల్పించడం, అత్య వసర పరిస్థితుల్లో ఉపయోగపడే ప్రాణరక్షణ నైపుణ్యాలను నేర్పించడం, గుండె సంబంధిత అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు తక్షణమే స్పందించాల్సిన ఆవశ్యకతను తెలియజేయడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ విద్యార్థులు వాసు, సాహితి, అశ్విత్, హర్షవర్ధన్, సందీప్, అధ్యాపకులు అరుణ , రాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి బాలలే-రేపటి పౌరులు ఆనందకరమైన బాల్యంతోనే రేపటి ఉత్తమ సమాజ నిర్మాణం జరుగుతుంది

● కృష్ణవేణి, రీజనల్ జాయింట్ డైరెక్టర్ వరంగల్



ములుగు జిల్లా ప్రతినిధి నవంబర్ 20ములుగు:
జిల్లా కేంద్రంలోనీ సమీక్షత కలెక్టరేట్ కార్యాలయం-సమావేశపు హాల్లో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల ముగింపు కార్యక్రమం మరియు ప్రపంచ బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్నీ జిల్లా సంక్షేమ అధికారిని ఇ.పి.ప్రేమలత అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.
ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రీజనల్ జాయింట్ డైరెక్టర్, వరంగల్ కృష్ణవేణి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని నేటి బాల్యానికి ఆనందకరమైనటువంటి బాల్యాన్ని అందించినట్లయితే రేపటి ఉత్తమ సమాజాన్ని నిర్మించిన



వాళ్లమవుతామని సూచించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలలకు బాలల హక్కుల ఒడంబడిక ఆధారంగా అనేక హక్కులు సంక్రమించడం జరిగింది, ఆ హక్కులను సంరక్షించే బాధ్యత ప్రభుత్వం, తల్లిదండ్రుల పైన ఉందని ఆ హక్కుల ఉల్లంఘన జరిగితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, హక్కుల సంరక్షణ అందరి బాధ్యత అని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల నుండి హాజరైన బాలలను వివిధ బాలల సంరక్షణ చట్టాల గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లలు బాలల సంరక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉంటే సరిపోదని వారికి సమస్యలు ఎదురైనప్పుడు ధైర్యంగా ఎదుర్కోవాలని మరియు చైల్డ్ హెల్ప్ లైన్ 1098, 181 ఉ 100 మొదలైన నంబర్లకు తెలియ జేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ గోపాలరావు మాట్లాడుతూ బాలలు వాళ్ళ హక్కుల సంరక్షణలో భాగంగానే పౌష్టికాహారం తీసుకునే హక్కు, మంచి వాతావరణంలో పెరిగే హక్కు కలిగి ఉన్నారని, పౌష్టికరమైనటువంటి ఆహారంతో మంచి వాతా వరణంలో సంరక్షించబడినట్లైతే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబ డతారని సూచించారు. బాల్యంలో చదువు ఎంత ముఖ్యమో దానితోపాటు పౌష్టికాహారం కూడా అంతే అవసరమని తెలుపుతూ, బాలలందరూ పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కే.వసుధ, చైర్పర్సన్ -బాలల సంక్షేమ సమితి ములుగు మాట్లాడుతూ నేటి పరిస్థితులలో బాలలకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయని, యుక్త వయసులో వారిలో వచ్చే మార్పులని ఎప్పటికప్పుడు గమనిస్తూ మంచివైపు నడుచుకోవాలని చెడుదారుల వైపు వెళ్ళకూడదు అని సూచించారు .తెలిసి తెలియని వయసులో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకునీ మంచి జీవితాన్ని కొనసాగించాలని సూచించారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా సంక్షేమ అధికారిని ఇ.వీ. ప్రేమలత మాట్లాడుతూ బాల్యంలో ఉన్నతమైన లక్ష్యాలని ఏర్పరచుకొని, క్రమశిక్షణతో వాటిని సాధించిన వారూ, మంచి నడవడిక కలిగిన వారు సమాజంలో ఉత్తమ పౌరులుగా గుర్తించబడతారని అన్నారు. భారత ప్రభుత్వం 1992లో అంతర్జాతీయ బాలల హక్కుల ఒడంబడిక పైన సంతకం చేసి బాలల హక్కులని సంరక్షించే బాధ్యతను తీసుకోవడం జరిగిందని, ఐక్యరాజ్యసమితి నవంబర్ 20నీ అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవంగా గుర్తించడమైనది అందుకని ఈ రోజుని అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం గా జరుపుకుంటామని, బాలల హక్కులకు ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేస్తూ ప్రతి ప్రభుత్వం బాలల హక్కులని సంరక్షించే బాధ్యతని తీసుకోవడం జరిగిందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన బాల బాలికలు నృత్యాలతో, పాటలతో అలరించారు. అనంతరం బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా మాట్లాడే బొమ్మ ద్వారా జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె.ఓంకార్ బాలలకు సురక్షిత స్పర్శ, అసురక్షిత స్పర్శ పైన అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎడ్యుకేషనల్ అధికారి- సిద్ధార్థ రెడ్డి, జిల్లా రూరల్ డెవలప్మెంట్ అధికారి, జువెనైల్ జస్టిస్ బోర్డ్ సభ్యులు- సుభాష్, డిసిఆర్బి- డిఎస్పి కిషోర్ కుమార్, కాల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ -రజిత, బాల బాలికల ప్రతినిధులు కృష్ణ ప్రసాద్, హర్షిత, జిల్లాలోని నలుగురు సిడిపిఓలు, సూపర్వైజర్లు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్, సఖి, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది కోనేరు సంస్థ సిబ్బంది మరియు వివిధ పాఠశాలల నుండి విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జియాగూడ ఇమామ్ పురలో ఆరెకటిక స్మశానవాటికలో బోర్ వెల



హైదరాబాద్:ఇమామ్ పురలో ఆరెకటిక హిందూ స్మశాన వాటికకు నీటి సమస్య తీరింది శుక్రవారం బోర్ మోటార్ బిగించి నీటి కొరత తీర్చారు ఈ కార్యక్రమంలో స్మశాన వాటిక చైర్మన్ పంతులు సురేష్ కుమార్, సమాజ సేవకులు పురుషోత్తం గ్రేటర్ హైదరాబాద్ ఆరెకటిక సంఘం ఉపాధ్యక్షులు నర్సింగ్ రావు ఉల్కుందాకర్, పంతులు రాకేష్, ఏ ప్రభు, జి భగవాన్ దాస్, పి రాకేష్ రాజ్ తదితరులు పాల్గొన్నారు


ఎవరి ఇళ్లలో భోజనం చేయకూడదంటే

● మన పూర్వీకులు చెప్పిన విధానం



అందోల్ నియోజకవర్గం ప్రతినిధి నవంబర్ 20 సంగారెడ్డి జిల్లా :పేదరికాన్ని ఆసరాగా తీసుకొని అధిక వడ్డీలు వసూలు చేస్తూ, ఎదుటి వారిని పీడించి ధనం ఆర్జించేవారి ఇంట్లో అన్నం తినటం మంచిది కాదు, దీనివల్ల మన మనసులో చెడు ఆలోచనలు కలుగుతాయి.(కోపిష్టి ఇల్లు)ఎ ప్పుడూ కోపంతో ఉండేవారి ఇంట్లో వ్యతిరేక శక్తి ఉంటుంది. కోపంతో పండిన,వడ్డించిన ఆహారం తినటం వల్ల,మనలోప్రశాంతత నశి స్తుంది(అవినీతిపరుల ఇల్లు)ఇతరులను మోస గించి లేదా అధర్మ మార్గంలో సంపాదించిన సొమ్ముతో వండి, వడ్డించే అన్నం తామసిక ఆహారం అలాంటి, ఆహారం తిన్నవారికి కూ డా ఆపాపంలో భాగం అవుతారని శాస్త్రం చెబు తోంది, ఇటువంటి వారి ఇళ్లలో భోజనం చేయకూడదు,(తీవ్ర అనారోగ్యంతో బాధ పడేవారి ఇల్లు)దీర్ఘకాలిక జబ్బులు, అంటు వ్యాధులతో బాధపడేవారి ఇళ్లలో భోజనం చేయటం వల్ల, ఆ ప్రభావం తినేవారిపై ఉండే అవకాశం ఉంది. అందువల్ల వీరి ఇళ్లలో భోజనం కూడదు(పిసినారి ఇల్లు)కొందరు సంపద ఉన్నా, ఇతరులకు పెట్టేందుకు ఇష్టఎ దరు మొహమాటంతో, ఆహ్వానించినప్పటికీ, లో పల బాధపడతారు అయిష్టంతో కూడిన ఆ ఆహారం తినడం మంచిది కాదు,అందువల్ల ఈ ఐదు ఇళ్లలో భోజనం చేయకూడదు. అహ ంకార స్వభావంగలదుర్యోధనుడు, ఏర్పాటు చేసి న విందు కాదని, వినయ స్వభావం కలిగిన విదురుని ఇంట భోజనం
చేశాడు కృష్ణభగవానుడు.....

ప్రారంభమైన ఇందిరమ్మ జీవిత బీమా పథకం
ప్రారంభోత్సవానికి హాజరైన ఉప సర్పంచ్ గుజ్జర్లపూడి చింటు



ఖమ్మం జిల్లా బ్యూరో నవంబర్ 20:
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టా త్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ బీమా పథకం మంగాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి మంగా పురం గ్రామ ఉప సర్పంచ్ గుజ్జర్లపూడి చింటు పాల్గొని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం లేదా మరణం సంభవించినప్పుడు ఆ కుటుంబం ఆర్థి కంగా కుంగిపోకుండా ఆదుకునేందుకు తెలం గాణ ప్రభుత్వం ?ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ను ప్రవేశపెడుతోందన్నారు . ఈ పథకానికి తెల్ల రేషన్ కార్డు ఉన్న 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సు గల కుటుంబ పెద్ద అర్హుడన్నారు .?ఎలాంటి ప్రీమియం చెల్లించ కుండ అర్హులైన కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందించబడుతుందన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరు ఈ కుటు ంబ జీవిత బీమా లో పేరు నమోదు చేసు కొవాలన్నారు.ఈ కార్యక్రమంలో, గ్రామ ఉప సర్పంచ్ గుజ్జర్లపూడి చింటు వార్డు సభ్యులు గ్రామపంచాయతీ సెక్రటరీ
పరుశురాం పాల్గొన్నారు

ప్రోటోకాల్ పాటించని కొల్చారం మండల బి ఆర్ఎస్ నాయకులు



● మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షులు వాల్దాస్ రాధ మల్లేష్ గౌడ్



కొల్చారం మండలం 20 నవంబర్ ప్రతినిధి :
బీఆర్ఎస్ నాయకుల తీరుపై బీజేపీ తీవ్ర ఖండనఈరోజు మెదక్ జిల్లా నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని కొల్చారం మండలం తుక్కాపూర్ గ్రామంలో మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షులు వా ల్దాస్ రాధామల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వల్దాస్ రాధామల్లేష్ గౌడ్ మాట్లాడుతూ.. తుక్కాపూర్ గ్రామంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించే విషయంలో కనీస ప్రభుత్వ ప్రోటోకాల్ పాటించకుండా, గ్రామానికి సంబంధించిన ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులకు తగిన గుర్తింపు ఇవ్వకుండా గ్రామ బీఆర్ఎస్ నాయకులే స్వయంగా ప్రారంభించడం ప్రజాస్వామ్య సంప్రదాయాలకు విరుద్ధమని అన్నారు. ఈ వ్యవహారాన్ని భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా శాఖ తీవ్రంగా ఖండిస్తోందని స్పష్టం చేశారు.కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం నిరంతరం కోట్లాది రూపాయల నిధులను కేటాయిస్తూ గ్రామాల మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. తుక్కాపూర్ గ్రామంలో కూడా కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామ పంచాయతీ భవనంతో పాటు సీసీ రోడ్లు, మహిళా సమాఖ్య భవనం, డ్రైనేజీ వ్యవస్థ తదితర అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలకు నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు.
కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతో గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుంటే, ఆ అభివృద్ధికి సహకరించిన కేంద్ర ప్రభుత్వాన్ని గుర్తించకుండా, రాజకీయ స్వార్థంతో వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు ఏ ఒక్క పార్టీకి లేదా వ్యక్తికి సంబంధించినవి కావని, అవి ప్రజల సొమ్ముతో ప్రజల కోసమే చేపట్టే కార్యక్ర మాలని గుర్తుంచుకోవాలని సూచించారు.ప్రభుత్వ కార్యక్ర మాల్లో ప్రోటోకాల్ అనేది వ్యక్తిగత ఇష్టాయిష్టాలకు సంబం ధించిన అంశం కాదని, అది రాజ్యాంగబద్ధమైన మరియు పరిపాలనా పరమైన విధానమని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో సంబ ంధిత ప్రజాప్రతినిధులకు తగిన గౌరవం, ప్రాధాన్యత కల్పించాల్సిన బాధ్యత అధికారులపై కూడా ఉందని పేర్కొ న్నారు.గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, ఏ నిధులతో ఏ పనులు జరుగుతున్నాయో పారద ర్శకంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పనులను రాజకీయ ప్రచారానికి వేదికగా మార్చకుండా, ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా నిర్వహించాలని హితవు పలికారు.
తుక్కాపూర్ గ్రామంలో జరిగిన ఈ ప్రోటోకాల్ ఉల్లంఘనపై సంబంధిత అధికారులు స్పందించి, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా శాఖ తరఫున డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షులు శ్రీ వల్దాస్ రాధామల్లేష్ గౌడ్ , కొల్చారం మండల అధ్యక్షుడు హరీష్ మరియు బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు

ఇంట్లోనే 100% స్వచ్ఛమైన పసుపు పొడి తయారీ, ఏడాది పాటు తాజాగా నిల్వ ఉంచే చిట్కాలు!



ఖమ్మం జిల్లా బ్యూరో నవంబర్ 20:
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టా త్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ బీమా పథకం మంగాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి మంగా పురం గ్రామ ఉప సర్పంచ్ గుజ్జర్లపూడి చింటు పాల్గొని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం లేదా మరణం సంభవించినప్పుడు ఆ కుటుంబం ఆర్థి కంగా కుంగిపోకుండా ఆదుకునేందుకు తెలం గాణ ప్రభుత్వం ?ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ను ప్రవేశపెడుతోందన్నారు . ఈ పథకానికి తెల్ల రేషన్ కార్డు ఉన్న 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సు గల కుటుంబ పెద్ద అర్హుడన్నారు .?ఎలాంటి ప్రీమియం చెల్లించ కుండ అర్హులైన కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందించబడుతుందన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరు ఈ కుటు ంబ జీవిత బీమా లో పేరు నమోదు చేసు కొవాలన్నారు.ఈ కార్యక్రమంలో, గ్రామ ఉప సర్పంచ్ గుజ్జర్లపూడి చింటు వార్డు సభ్యులు గ్రామపంచాయతీ సెక్రటరీ
పరుశురాం పాల్గొన్నారు

భారతీయ వంటకాల్లో పసుపుకు ప్రత్యేక స్థానం ఉంది. కూరలకు మంచి రంగు, రుచిని ఇవ్వడమే కాకుండా ఆరోగ్యానికి కూడా ఎన్నో విధాలుగా మేలు చేస్తుందని అధ్యయనం పేర్కొంది. పసుపులో ఉండే కర్కుమిన్ అనే సహజ పదార్థానికి యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి శరీర కణాలను.. ఫ్రీ ర్యాడికల్స్‌ను రక్షిస్తాయి. శరీరంలో ఇన్ఫ్లమేషన్‌ను తగ్గిస్తుంది. అంతేకాదు.. సంప్రదాయంగా పసుపును గాయాల సంరక్షణ, చర్మ సంరక్షణలోనూ ఉపయోగిస్తుంటారు.అందుకే పసుపును కేవలం వంటింటి దినుసుగానే కాకుండా ఆరోగ్యానికి ఉపయోగపడే పదార్థంగా కూడా చూస్తారు. అయితే మార్కెట్‌లో దొరికే పసుపు పొడి నాణ్యతపై కొన్నిసార్లు సందేహాలు ఉంటాయి. కొన్ని సందర్భాల్లో రంగులు, ఇతర పదార్థాలు కలిసే అవకాశం కూడా ఉంది. అందుకే వీలైనంత వరకు నాణ్యమైన పసుపు కొమ్ములతో ఇంట్లోనే పొడి తయారు చేసుకోవడం మంచిది. మరి స్వచ్ఛమైన పసుపు పొడిని ఎలా తయారు చేసుకోవాలి, ఎక్కువ రోజులు నాణ్యత తగ్గకుండా ఎలా నిల్వ చేసుకోవాలి వంటి విషయాలను తెలుసుకుందాం.
కొన్న పసుపు కొమ్ములపై మట్టి, ధూళి ఎక్కువగా ఉంటాయి. కాబట్టి వాటిని వెడల్పాటి గిన్నెలో నీరు పోసి బాగా కడగాలి.

కొమ్ములపై ఉన్న మట్టి పూర్తిగా పోయే వరకు రెండు మూడు సార్లు స్వచ్ఛమైన నీటితో శుభ్రం చేసుకోవాలి. ఆ తర్వాత ఒక శుభ్రమైన కాటన్ వస్త్రంపై వాటిని పరిచి, కొద్దిసేపు నీరంతా ఇంకిపోయేలా ఆరబెట్టాలి. కొమ్ములపై తడి లేకుండా చూసుకోవడం తర్వాతి స్టేజ్‌కు చాలా ముఖ్యం.?పచ్చి పసుపు కొమ్ములను నేరుగా ఎండబెట్టడం కంటే, ఉడికించడం వల్ల అనేక లాభాలున్నాయి. ఒక గిన్నెలో తగినన్ని నీళ్లు పోసి, అందులో శుభ్రం చేసిన పసుపు కొమ్ములు వేసి మీడియం మంటపై ఉడికించాలి. కొమ్ములు మెత్తబడే వరకు సుమారు 30 నుంచి 45 నిమిషాలు ఉడికించాలి. ఇలా ఉడికిస్తే పసుపులో ఉండే ఘాటైన వాసన తగ్గి, మంచి రంగు వస్తుంది, త్వరగా ఎండడానికి సహాయపడుతుంది. ఉడికిన తర్వాత నీటిని వంపేసి, కొమ్ములను చల్లారనివ్వాలి.ఉడికించి చల్లారిన పసుపు కొమ్ములు కొద్దిగా మెత్తగా ఉంటాయి. వాటిని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఇలా ముక్కలుగా కోస్తే.. ఎండలో త్వరగా ఎండిపోతాయి. ఇప్పుడు ఒక వెడల్పాటి పల్చటి క్లాత్ కానీ.. పెద్ద ప్లేట్ కానీ తీసుకుని, ఈ ముక్కలను ఎండలో పలుచగా ఆరబెట్టాలి. ఎండ తీవ్రతను బట్టి ఇవి పూర్తిగా ఎండడానికి 3 నుంచి 5 రోజులు పడుతుంది. ముక్కలను గట్టిగా పట్టుకుని విరిస్తే విరిగిపోయేలా మారే వరకు బాగా ఎండబెట్టాలి.బాగా ఎండిన పసుపు ముక్కలను మిక్సీ జార్‌లో వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. మిక్సీ పడుతు న్నప్పుడు మధ్యమధ్యలో ఆపుతూ తిప్పాలి, లేదంటే మిక్సీ వేడెక్కి పసుపులోని మంచి ఔషధ గుణాలు ఆవిరైపోతాయి. గ్రైండ్ చేసిన తర్వాత పసుపు పొడిని ఒక సన్నని జల్లెడ ఉపయోగించి జల్లించాలి. జల్లెడ పట్టిన తర్వాత మిగిలిన గరుకు భాగాలను మళ్లీ మిక్సీలో వేసి మెత్తగా పౌడర్ చేసుకోవాలి. ఇలా చేస్తే నాణ్యమైన, మృదువైన పసుపు
పొడి సిద్ధమవుతుంది.

సిరాజ్ ఎంపికపై రాజకీయ దుమారం



మతం పేరుతో పక్కనపెట్టారన్న కాంగ్రెస్ ఎంపీ.. ఆరోపణలను ఖండించిన బీజేపీ

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టులో హైదరాబాద్‌కు చెందిన స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌కు చోటు దక్కకపోవడం రాజకీయ వివాదానికి దారితీసింది. న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో సిరాజ్‌ను తుది జట్టులోకి తీసుకోకపోవడంపై కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మంచి ప్రదర్శన చేస్తున్నప్పటికీ సిరాజ్‌ను ఎంపిక చేయకపోవడానికి ఆయన పేరే కారణమై ఉండవచ్చని, మతపరమైన వివక్ష జరిగిందని ఆరోపించారు.సిరాజ్ గతంలో జట్టుకు ఎన్నో విజయాలు అందించారని, కీలక సమయాల్లో వికెట్లు తీసి తన ప్రతిభను నిరూపించుకున్నారని మసూద్ పేర్కొన్నారు. మంచి ప్రదర్శన ఉన్నప్పటికీ జట్టులో స్థానం కల్పించకపోవడం వెనుక వివక్ష ఉందని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి.**బీజేపీ తీవ్ర అభ్యంతరం** కాంగ్రెస్ ఎంపీ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందించారు. క్రికెట్‌లో మతాన్ని తీసుకురావడం సరికాదని, ఆటగాళ్ల ఎంపిక ప్రతిభ, జట్టు అవసరాలు, పరిస్థితుల ఆధారంగా జరుగుతుందని స్పష్టం చేశారు. సిరాజ్‌ను ఎంపిక చేయకపోవడాన్ని మతపరమైన వివక్షగా చిత్రీకరించడం ద్వారా కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాలు పొందాలని చూస్తోందని విమర్శించారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు సైతం కులం, మతం ఆధారంగా ఎవరికీ అవకాశాలు నిరాకరించడం లేదని పేర్కొన్నారు. **క్రికెట్ దిగ్గజాల అసంతృప్తి** సిరాజ్‌కు తుది జట్టులో చోటు కల్పించకపోవడంపై మాజీ క్రికెటర్లు సునీల్ గవాస్కర్, రవిశాస్త్రి కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. సిరాజ్ అనుభవం, బౌలింగ్ సామర్థ్యం, పోరాట పటిమను పరిగణనలోకి తీసుకోవాల్సిందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ చక్రంలో 11 మ్యాచ్‌ల్లో 43 వికెట్లు తీసి భారత బౌలర్లలో అత్యధిక వికెట్లు సాధించిన సిరాజ్‌ను పక్కనపెట్టడం చర్చనీయాంశమైంది. **జట్టు కూర్పే కారణమన్న యాజమాన్యం** మరోవైపు భారత జట్టు మేనేజ్‌మెంట్ సిరాజ్ ఎంపిక కాకపోవడంపై వివరణ ఇచ్చింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ జట్టు అవసరాలు, పిచ్ పరిస్థితులు, బౌలర్ల సామర్థ్యాలను పరిశీలించిన తర్వాతే తుది జట్టును ఎంపిక చేసినట్లు తెలిపారు. సిరాజ్ విషయంలో ఎలాంటి సమస్య లేదని, జట్టు సమతుల్యతను దృష్టిలో ఉంచుకునే ఈ నిర్ణయం తీసుకున్నామని కోటక్ స్పష్టం చేశారు. క్రీడలను రాజకీయాలకు దూరంగా ఉంచాలి. ఆటగాళ్ల ఎంపికపై విమర్శలు చేయడం ప్రజాస్వామ్యంలో సహజమే. అయితే సరైన ఆధారాలు లేకుండా మతపరమైన వివక్ష ఆరోపణలు చేయడం క్రీడా స్ఫూర్తికి మంచిది కాదు. అదే సమయంలో ప్రతిభావంతులైన ఆటగాళ్లకు తగిన గుర్తింపు, అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత జట్టు యాజమాన్యంపై ఉంది. దేశం తరఫున ఆడే ప్రతి ఆటగాడికి మతం, ప్రాంతం, కులంతో సంబంధం లేకుండా ప్రతిభే ప్రామాణికం కావాలి. క్రికెట్ మైదానంలో భారతీయులందరినీ ఏకం చేసే జాతీయ భావనకు ప్రాధాన్యత ఇవ్వాలి.

ఆసియా కప్‌లో భారత్ ఆచితూచి అడుగు



- నేపాల్‌తో తొలి పోరులో భారత యువ ఆటగాళ్లకు పరీక్ష.. రాణించని అభిషేక్, వైభవ్

దోహా: ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో భారత్-ఎ జట్టు ఆచితూచి ఆడుతోంది. శుక్రవారం నేపాల్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత యువ ఆటగాళ్లకు గట్టి పరీక్ష ఎదురైంది. టాస్ గెలిచిన నేపాల్ తొలుత బౌలింగ్ ఎంచుకోవడంతో బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. స్టార్ ఓపెనర్లు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. అభిషేక్ 13 బంతుల్లో 9 పరుగులు చేసి వెనుదిరగగా, వైభవ్ 32 బంతుల్లో 26 పరుగులు సాధించి వికెట్ కోల్పోయాడు.**నేపాల్ బౌలర్ల కట్టడి** నేపాల్ బౌలర్లు క్రమశిక్షణతో బౌలింగ్ చేస్తూ భారత బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టారు. పిచ్‌పై బంతి నెమ్మదిగా రావడంతో భారీ షాట్లు ఆడేందుకు భారత బ్యాటర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మూడో స్థానంలో వచ్చిన ఆయుష్ బదోని కూడా రెండు పరుగులకే పెవిలియన్ చేరడంతో భారత్ తొలి 11 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయింది. దీంతో ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాల్సిన బాధ్యత కెప్టెన్ తిలక్ వర్మ, మిగతా మధ్య వరుస బ్యాటర్లపై పడింది. **యువ ఆటగాళ్లకు కీలక అవకాశం** ఈ టోర్నీ భారత యువ క్రికెటర్లకు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు మంచి వేదికగా నిలుస్తోంది. కెప్టెన్ తిలక్ వర్మ నాయకత్వంలోని జట్టులో అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, రింకూ సింగ్ వంటి ప్రతిభావంతులున్నారు. గత ఏడాది సెమీఫైనల్లో బంగ్లాదేశ్-ఎ చేతిలో సూపర్ ఓవర్‌లో ఓటమి పాలైన భారత్ ఈసారి టైటిల్ సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగింది. ముఖ్యంగా టీ20 క్రికెట్‌లో దూకుడుగా ఆడే యువ బ్యాటర్లు 50 ఓవర్ల ఫార్మాట్‌కు అనుగుణంగా తమ ఆటతీరును మార్చుకోవాల్సిన అవసరం ఉంది. **పాకిస్థాన్‌తో తదుపరి పోరు** గ్రూప్-బిలో భారత్-ఎ, నేపాల్‌తో పాటు పాకిస్థాన్-ఎ, యూఏఈ జట్లు ఉన్నాయి. నవంబర్ 22న పాకిస్థాన్-ఎతో భారత్ తలపడనుంది. ఈ పోరు జట్టుకు మరో కీలక పరీక్ష కానుంది. యువ ఆటగాళ్లు ఒత్తిడిని అధిగమించి సమష్టిగా రాణిస్తే టైటిల్ వేటలో భారత్‌కు మెరుగైన అవకాశాలుంటాయి. యువ ప్రతిభకు రైజింగ్ స్టార్స్ వేదిక మంచి అవకాశాన్ని కల్పిస్తోంది. అయితే పేరున్న ఆటగాళ్లు జట్టులో ఉండటం మాత్రమే విజయానికి సరిపోదు. పరిస్థితులకు అనుగుణంగా ఆడటం, వికెట్లను కాపాడు కోవడం, కీలక సమయాల్లో బాధ్యత తీసుకోవడం అవసరం. ముఖ్యంగా అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు అందుకోవాల నుకునే యువ క్రికెటర్లు ఈ టోర్నీని సద్వినియోగం చేసుకోవాలి.



మోదీని కలిశాక మారిన అదృష్టం!

● ప్రధాని భేటీతో మళ్లీ పరుగుల వరద..

ఫామ్‌లోకి వచ్చిన సూర్యకుమార్ యాదవ్



ముంబై: టీమిండియా స్టార్ బ్యాటర్, మాజీ టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తన కెరీర్‌లో ఎదురైన ఒడిదుడుకుల గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసిన తర్వాత తన అదృష్టం మారిందని, మళ్లీ పరుగులు సాధించడం ప్రారంభించానని తెలిపాడు. ఇటీవల ఓ కార్యక్రమంలో అత్యుత్తమ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా ప్రధాని మోదీతో జరిగిన భేటీని గుర్తుచేసుకున్నాడు.**45 నిమిషాల పాటు సాగిన భేటీ** ప్రధానిని కలిసేందుకు వెళ్లినప్పుడు ఐదు లేదా పది నిమిషాలు మాత్రమే మాట్లాడతానని భావించానని, అయితే ఆ సమావేశం దాదాపు 45 నిమిషాల పాటు కొనసాగిందని సూర్యకుమార్ తెలిపాడు. ఈ భేటీలో తన కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారని, తన జీవితంలో మధురమైన సందర్భాల్లో ఇదొకటని పేర్కొన్నాడు. ప్రధానితో మాట్లాడిన అనుభవం తనకు ఎంతో ప్రత్యేకమని వెల్లడించాడు. **ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలనే విషయంపై చర్చ** క్రికెట్‌లో ఒత్తిడిని ఎదుర్కోవడం, క్లిష్ట పరిస్థితుల్లో ప్రశాంతంగా ఉండటం గురించి ప్రధానితో చర్చించినట్లు సూర్యకుమార్ తెలిపాడు. మ్యాచ్‌ల సమయంలో ఒత్తిడిని అధిగమించడం కొన్నిసార్లు కష్టంగా ఉంటుందని, దేశ ప్రధానిగా ఎన్నో బాధ్యతలు నిర్వహిస్తూ మోదీ వాటిని ఎలా సమర్థంగా ఎదుర్కొంటారో తెలుసుకోవాలనే ఆసక్తి తనకు కలిగిందని చెప్పాడు. తాను అడిగిన ప్రశ్నలకు ప్రధాని ఓపికగా సమాధానాలు ఇచ్చారని వివరించాడు.**మళ్లీ ఫామ్‌లోకి సూర్యకుమార్** టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత సూర్యకుమార్ యాదవ్ బ్యాటింగ్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. ఫామ్ కోల్పోవడంతో భారత జట్టులోనూ స్థానం కోల్పోయాడు. అయితే ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో వరుసగా రెండు అర్ధశతకాలు సాధించి తిరిగి ఫామ్‌లోకి వచ్చాడు. దీంతో మళ్లీ భారత జట్టులోకి పునరాగమనం చేస్తాడనే ఆశలు పెరిగాయి. **ఆత్మవిశ్వాసమే విజయానికి బాట** క్రీడాకారుల జీవితంలో విజయాలు, అపజయాలు సహజం. ఒక దశలో అద్భుతంగా రాణించిన ఆటగాళ్లు మరో దశలో ఫామ్ కోల్పోవచ్చు. అలాంటి సమయంలో మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం ఎంతో అవసరం. సూర్యకుమార్ యాదవ్ తాజా ప్రదర్శన కూడా అదే విషయాన్ని తెలియజేస్తోంది. తిరిగి తనదైన ఆటతీరుతో రాణించి జాతీయ జట్టులో స్థానం సంపాదించడమే ఇప్పుడు అతడి ముందున్న లక్ష్యం.

ఢిల్లీ క్యాపిటల్స్‌కు మహేళ జయవర్ధనే...

క్రికెట్ డైరెక్టర్‌గా శ్రీలంక మాజీ కెప్టెన్ నియామకం.. 2027 మహిళల ప్రీమియర్ లీగ్‌పై ప్రత్యేక దృష్టి



న్యూఢిల్లీ: శ్రీలంక క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ మహేళ జయవర్ధనే ఢిల్లీ క్యాపిటల్స్ క్రికెట్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. 2027 మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) సీజన్‌కు ముందు ఈ నియామకం జరిగింది. జట్టు వ్యూహరచన, ప్రతిభావంతులైన క్రీడాకారిణుల గుర్తింపు, ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది అభివృద్ధి వంటి కీలక బాధ్యతలను ఆయన పర్యవేక్షించనున్నారు. మహిళా క్రికెట్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌ను మరింత బలోపేతం చేయడమే ఈ నియామకం ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. **అంతర్జాతీయ అనుభవం.. విజయవంతమైన నాయకత్వం** మహేళ జయవర్ధనే అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యుత్తమ బ్యాటర్లలో ఒకరిగా గుర్తింపు పొందారు. శ్రీలంక తరపున 149 టెస్టులు, 448 వన్డేలు ఆడి వరుసగా 11,814, 12,650 పరుగులు సాధించారు. 2014లో శ్రీలంక టీ20 ప్రపంచకప్ విజేతగా నిలిచిన జట్టులో ఆయన కీలక సభ్యుడిగా ఉన్నారు. ఆటగాడిగా మాత్రమే కాకుండా కెప్టెన్‌గా, కోచ్‌గా కూడా విశేష అనుభవం సంపాదించారు. **ముంబై ఇండియన్స్‌కు మూడు టైటిళ్లు** కోచింగ్ రంగంలోనూ జయవర్ధనే తనదైన ముద్ర వేశారు. ముంబై ఇండియన్స్ ప్రధాన కోచ్‌గా వ్యవహరించిన సమయంలో 2017, 2019, 2020 సంవత్సరాల్లో మూడు ఐపీఎల్ టైటిళ్లను సాధించడంలో కీలక పాత్ర పోషించారు. టీ20 క్రికెట్‌లో జట్టు నిర్మాణం, ఆటగాళ్ల ఎంపిక, వ్యూహాత్మక నిర్ణయాల్లో ఆయనకు మంచి అనుభవం ఉంది. ఈ అనుభవం ఢిల్లీ క్యాపిటల్స్ మహిళల జట్టుకు ఉపయోగపడుతుందని ఫ్రాంచైజీ యాజమాన్యం ఆశిస్తోంది. **టైటిల్ లక్ష్యంగా ఢిల్లీ క్యాపిటల్స్** ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్య ప్రతినిధులు మహేళ నియామకంపై సంతోషం వ్యక్తం చేశారు. ఆయన అనుభవం, ఆధునిక క్రికెట్‌పై అవగాహన జట్టుకు కొత్త దిశానిర్దేశం చేస్తాయని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రతిభావంతులైన క్రీడాకారిణులు ఉన్న జట్టులో మరింత నిలకడ తీసుకురావడం, ఆటతీరును మెరుగుపరచడం తన ప్రధాన లక్ష్యమని మహేళ తెలిపారు. డబ్ల్యూపీఎల్‌లో ఇప్పటివరకు నాలుగుసార్లు రన్నరప్‌గా నిలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ మహిళల జట్టు వచ్చే సీజన్‌లో తొలి టైటిల్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. **మహిళా క్రికెట్‌కు కొత్త బలం** ప్రపంచ వ్యాప్తంగా మహిళా క్రికెట్‌కు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో అనుభవజ్ఞులైన మాజీ క్రికెటర్లకు కీలక బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యత సంతరించు కుంది. ఆటగా ళ్లలో నైపుణ్యాన్ని పెంపొందించడం, యువ ప్రతిభను వెలికితీయడం, మెరుగైన శిక్షణా విధా నాలను అమలు చేయడం ద్వారా జట్ల స్థాయిని పెంచవచ్చు. మహేళ జయవర్ధనే వంటి అనుభవజ్ఞుడి నాయకత్వం ఢిల్లీ క్యాపిటల్స్ మహిళల జట్టుకు ఎంతవరకు విజయాలను

బాల్ టాంపరింగ్ వివాదం మళ్లీ రగిల్చిన ఖవాజా!

ఆత్మకథలో సంచలన విషయాలు.. తీవ్రంగా స్పందించిన ఫ్యానీ డివిలియర్స్

స్పోర్ట్స్ డెస్క్: ఆస్ట్రేలియా క్రికెట్‌ను కుదిపేసిన 2018 బాల్ టాంపరింగ్ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. మాజీ ఆస్ట్రేలియా క్రికెటర్ ఉస్మాన్ ఖవాజా తన ఆత్మకథ 'సబర్'లో వెల్లడించిన విషయాలు క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ వ్యవహారంపై దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ ఫ్యానీ డివిలియర్స్ ఘాటుగా స్పందించినట్లు వార్తలు వెలువడ్డాయి. **ఆత్మకథలో సంచలన వ్యాఖ్యలు** 2018లో దక్షిణాఫ్రికాతో కేప్‌టౌన్‌లో జరిగిన టెస్టు మ్యాచ్ సందర్భంగా ఆస్ట్రేలియా ఆటగాడు కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ ఇసుక కాగితంతో బంతి స్వభావాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తూ కెమెరాలకు చిక్కాడు. ఈ ఘటన అప్పట్లో ప్రపంచ క్రికెట్‌లో పెను సంచలనం సృష్టించింది. అప్పటి కెప్టెన్ స్టీవ్ స్మిత్, వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్‌కు ఏడాది పాటు నిషేధం విధించగా, బాన్‌క్రాఫ్ట్‌పై తొమ్మిది నెలల నిషేధం పడింది.అయితే ఈ ఘటనలో కేవలం ముగ్గురికే సంబంధం ఉందన్న అప్పటి అధికారిక వాదనను ఖవాజా తన ఆత్మకథలో ప్రశ్నించాడు. జట్టులోని చాలామందికి బంతి ఆకారాన్ని మార్చే ప్రయత్నాల గురించి తెలుసని, డ్రెస్సింగ్‌రూమ్‌లో ఈ అంశంపై చర్చలు జరిగాయని పేర్కొన్నాడు. తాను స్వయంగా బంతిని దెబ్బతీయలేదని, కానీ జరుగుతున్న విషయాలు తనకు తెలుసని అంగీకరించాడు. జట్టుగా అందరూ బాధ్యత తీసుకోవాల్సి ఉండగా, ముగ్గురిపైనే నింద పడటం సరికాదన్నది ఆయన అభిప్రాయం. **సహచరులపై నమ్మకద్రోహమా?** ఖవాజా వెల్లడించిన విషయాలు క్రికెట్ వర్గాల్లో భిన్నాభిప్రాయాలకు దారితీశాయి. ఈ నేపథ్యంలో ఫ్యానీ డివిలియర్స్ ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టినట్లు ఆంధ్రజ్యోతి కథనం పేర్కొంది. ఆత్మకథ ద్వారా పాత వివాదాన్ని మళ్లీ తెరపైకి తీసుకురావడం, సహచర ఆటగాళ్లను వివాదంలోకి లాగడం సరైన చర్య కాదన్న విమర్శలు వ్యక్తమయ్యాయి. జట్టు అంతర్గత విషయాలను బహిరంగంగా వెల్లడించడం ద్వారా సహచరుల నమ్మకాన్ని దెబ్బతీశారన్న అభిప్రాయాలు వినిపించాయి.**ఖవాజా వివరణ** తన వ్యాఖ్యలపై వస్తున్న విమర్శలకు ఖవాజా కూడా స్పందించాడు. తాను ఎవరినీ ఇబ్బందుల్లోకి నెట్టాలని ప్రయత్నించలేదని స్పష్టం చేశాడు. ఈ ఘటనలో తనతో పాటు పర్యటనలో పాల్గొన్న వారందరూ బాధ్యత తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలిపాడు. నిషేధానికి గురైన ముగ్గురు ఆటగాళ్లు మిగతావారి తరఫున కూడా శిక్ష అనుభవించారని, వారికి న్యాయం జరగాలన్నదే తన ఉద్దేశమని వివరించాడు. **మళ్లీ చర్చకు వచ్చిన ఎనిమిదేళ్ల నాటి ఘటన** ఎనిమిదేళ్ల క్రితం ముగిసినట్లు భావించిన బాల్ టాంపరింగ్ వివాదం ఖవాజా ఆత్మకథతో మరోసారి చర్చనీయాంశమైంది. అప్పట్లో క్రికెట్ ఆస్ట్రేలియా నిర్వహించిన విచారణలో వెల్లడైన అంశాలు, ఇప్పుడు ఖవాజా చెబుతున్న విషయాల మధ్య వ్యత్యాసాలు కొత్త ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఆటగాళ్ల మధ్య పరస్పర ఆరోపణలు, పాత జట్టు వ్యవహారాలపై భిన్నమైన వాదనలు ఆస్ట్రేలియా క్రికెట్‌లో మరోసారి కలకలం రేపుతున్నాయి.





విజయ్ సేతుపతి రూట్లో నస్లెన్

'ప్రేమలు'లో అమాయకమైన లవర్ బాయ్‌గా కనిపించిన నస్లెన్ ఇప్పుడు సూర్యకే విలన్‌గా మారిపోయారు. 'సీన్' సినిమాలో ఈశ్వరన్ పాత్రతో తనలోని మరో యాంగిల్ చూపించారు. అంతకుముందు 'లోకా'లో కళ్యాణి ప్రియదర్శన్‌తో కలిసి నటించారు. ఇప్పుడు 'బ్యాచిలర్ పార్టీ డ్యూక్స్'లోనూ పెద్ద తారాగణంతో స్క్రీన్ షేర్ చేసుకున్నారు. హీరోగా మంచి క్రేజ్ వచ్చినా సోలో సినిమాల కోసమే ఎదురుచూడకుండా ఇలా విభిన్నమైన పాత్రలు ఎంచుకుంటున్న తీరు చూస్తుంటే విజయ్ సేతుపతి గుర్తుకొస్తున్నారు. విజయ్ సేతుపతి కూడా తన కెరీర్‌లో హీరో పాత్రలకే పరిమితం కాలేదు. '96'లో ప్రేమికుడిగా మెప్పించిన ఆయన 'విక్రమ్ వేద', 'మాస్టర్', 'విక్రమ్', 'జవాన్' సినిమాల్లో నెగెటివ్ పాత్రలతో అదరగొట్టారు. మరోవైపు 'మహారాజ'తో సోలో హీరోగానూ భారీ విజయం అందుకున్నారు. స్టార్ హీరోలతో కలిసి నటించడానికి ఎప్పుడూ వెనకాడలేదు. పాత్ర నచ్చితే తన ఇమేజ్ గురించి పెద్దగా పట్టించుకోకుండా సినిమాలు చేయడం సేతుపతికి బాగా కలిసొచ్చింది. ఇప్పుడు నస్లెన్ కూడా దాదాపు అలాంటి రూట్‌లోనే వెళ్తున్నారు. 'ప్రేమలు'తో యువతలో మంచి ఫాలోయింగ్ సంపాదించిన తర్వాత వరుస ప్రేమకథలు చేసే అవకాశం ఉన్నా, సూర్య 'సీన్'లో సైకో కిల్లర్ పాత్రకు ఓకే చెప్పారు. దర్శకుడు జీతూ మాధవన్ కూడా నస్లెన్ లాంటి యంగ్ హీరో ఈ పాత్రకు అంగీకరిస్తారా అని మొదట అనుకున్నారట. కానీ నస్లెన్ తన కొత్త ఇమేజ్‌ను వదిలి ఇంత డార్క్ క్యారెక్టర్ చేయడం విశేషం. అయితే విజయ్ సేతుపతి జర్నీలో నస్లెన్ నేర్చుకోవాల్సిన మరో విషయం కూడా ఉంది. ఒక దశలో సేతుపతికి విలన్ ఆఫర్లు ఎక్కువయ్యాయి. స్టార్ హీరోల సినిమాల్లో తన నన్నివేశాలు ఎడిటింగ్‌లో తగ్గిపోయిన సందర్భాలున్నాయని కూడా చెప్పారు. దీంతో కొంతకాలం విలన్ పాత్రలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. నస్లెన్ కూడా వరుసగా పెద్ద హీరోల సినిమాల్లో విలన్ పాత్రలు చేస్తే, హీరోగా సంపాదించుకున్న గుర్తింపు కంటే నెగెటివ్ క్యారెక్టర్లకే డిమాండ్ పెరిగే ఛాన్స్ ఉంది.

పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన సమంత..



ప్రముఖ నటి సమంత మాతృత్వపు మధురిమలను ఆస్వాదిస్తున్నారు. ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. ఈ విషయాన్ని సమంత, ఆమె భర్త, ప్రముఖ దర్శకుడు రాజ్ నిడిమోరు స్వయంగా సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు.బాబు చిన్ని వేళ్లు సమంత వేలిని పట్టుకున్న అపురూపమైన చిత్రాన్ని పంచుకుంటూ తమ కుమారుడి పేరును 'దేవ్ నిడిమోరు'గా ఖరారు చేసినట్లు ప్రకటించారు. 2026 నవంబరు 19న తమ బాబు జన్మించాడని, ఈ సమయం తమ జీవితంలోనే అత్యంత ఆనందకరమైన క్షణమని ఈ జంట భావోద్వేగంతో రాసుకొచ్చారు.బాబు రాకకు ముందే, నవంబరు 17న వీరి ఇంట్లో కుటుంబ సభ్యుల సమక్షంలో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. తల్లీబిడ్డల ఆరోగ్యం, సుఖ ప్రసవం కోసం 'మాతృ శిశు మంగళ ఆశీర్వాదం' పేరుతో వేడుక జరిగింది. ఈ పూజలో సమంత ఎరుపు రంగు సాంప్రదాయ దుస్తుల్లో మెరవగా, రాజ్ క్రీమ్ కలర్ కుర్తా, తెల్లటి పైజామాలో కనిపించారు. కుటుంబ పెద్దల ఆశీర్వాదం తీసుకుంటూ, శ్రీసూక్తం, గాయత్రీ దేవి హోమంలో వారు పాల్గొన్నారు.ఈ వేడుక విశేషాలను రాజ్ సోదరి సోషల్ మీడియాలో పంచుకున్నారు. కుటుంబంలోని పిన్నమ్మలు, పెద్దమ్మలు అందరూ ఒకచోట చేరి సమంతకు, పుట్టబోయే బిడ్డకు దీవెనలు అందించారని ఆమె పేర్కొన్నారు. పద్మశ్రీ శోభారాజు ప్రత్యేకంగా స్వరపరిచిన గీతాన్ని కుటుంబ సభ్యులు ఆలపించి వేడుకను మరింత ఘనంగా మార్చారు.సమంత, రాజ్‌లు 2025 డిసెంబరు 1న కోయంబత్తూరులోని ఇషా యోగా సెంటర్ లింగ భైరవి ఆలయంలో అత్యంత సన్నిహితుల మధ్య వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. 'ది ఫ్యామిలీ మ్యాన్ 2', 'సిటాడెల్: హనీ బన్నీ', 'మా ఇంటి బంగారం' వంటి చిత్రాల్లో వీరిద్దరూ కలిసి పనిచేశారు. ఆ తర్వాత 2026 జూన్‌లో తాను గర్భవతినన్న విషయాన్ని వెల్లడించిన సమంత, 'మా ఇంటి బంగారం' చిత్రం అనంతరం ప్రసవం కోసం నటన నుంచి విరామం తీసుకుంటున్నట్లు ప్రకటించింది. ఇప్పుడు బాబు రాకతో ఆ ఇంట్లో పండగ వాతావరణం నెలకొంది.

ఆకలేస్తే చిరంజీవి గారి ఇంటికెళ్లి భోజనం చేసేవాడిని : నాజర్ భావోద్వేగం



సినీ పరిశ్రమలో విలక్షణ నటనతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ నటుడు నాజర్, తన కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న గడ్డు పరిస్థితులను గుర్తుచేసుకున్నారు. చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టడానికి ముందు, ఆ తర్వాత అవకాశాల కోసం తిరుగుతున్న సమయంలో ఎన్నో ఆకలి రోజులను చూశానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆ క్లిష్ట సమయంలో మెగాస్టార్ చిరంజీవి కుటుంబం తనకు అందించిన మద్దతును ఆయన ఎంతో భావోద్వేగంతో పంచుకున్నారు.అవకాశాల కోసం చెన్నైలో ఎదురుచూస్తున్న రోజుల్లో భోజనానికి కూడా ఇబ్బంది పడిన సందర్భాలు ఎదురయ్యాయని నాజర్ వెల్లడించారు. అలాంటి సమయాల్లో తాను చిరంజీవి ఇంటికి వెళ్లి భోజనం చేసేవాడ్నని తెలిపారు. అప్పట్లో చిరంజీవి వరుస షూటింగులతో బిజీగా ఉండేవారని, తన స్నేహితుడి ద్వారా చిరంజీవి అర్ధాంగి సురేఖను సంప్రదించి, ఇంట్లో భోజనం ఉందో లేదో తెలుసుకునేవాడ్నని వివరించారు. భోజనం అందుబాటులో ఉందని తెలియగానే అక్కడికి వెళ్లి తిని వచ్చేవాడ్నని చెప్పారు. ఒక్కోసారి తాను వెళ్లి భోజనం చేసి వచ్చిన విషయం చిరంజీవికి తెలిసేది కాదని, ఆయన షూటింగులో ఎక్కడో ఉండేవారని తెలిపారు. వారి కుటుంబం తనకు చేసిన ఆ సాయం వెలకట్టలేనిదని నాజర్ పేర్కొన్నారు.నటన వైపు అడుగులు వేయడంలో తన తండ్రి ప్రోత్సాహం ఎంతో ఉందని నాజర్ తెలిపారు. తనలోని ప్రతిభను గుర్తించి సినీ రంగంలోకి వెళ్లమని తండ్రే సూచించారని చెప్పారు. ఆ తర్వాత చెన్నై చేరుకుని ఓ చిన్న ఉద్యోగంలో చేరారు. యాక్టింగ్ స్కూల్ ఫీజు చెల్లించే స్తోమత లేకపోవడంతో, ఆఫీస్ సమయం ముగిసిన తర్వాత అదనంగా చిన్న చిన్న పనులు చేస్తూ డబ్బు ఆదా చేసుకున్నారు. చిత్రపరిశ్రమలో ఒక నటుడిగా నిలదొక్కుకోవడానికి తనకు దాదాపు 15 ఏళ్ల సమయం పట్టిందని ఆయన వివరించారు.ఇక తెలుగు చిత్రపరిశ్రమలో తన అరంగేట్రం గురించి మాట్లాడుతూ.. వెంకటేశ్ హీరోగా తెరకెక్కిన 'చంటి' సినిమాతో తాను టాలీవుడ్‌కు పరిచయమయ్యానని తెలిపారు. ఆ సమయంలో తనకు తెలుగు భాష అస్సలు రాదని, కానీ స్టార్ హీరో అయినప్పటికీ వెంకటేశ్ ఎంతో ఓపికగా ప్రతి డైలాగ్‌ను వివరించి, పాత్ర స్వభావాన్ని అర్థం చేసుకునేలా ప్రోత్సహించారని చెప్పారు.కష్టకాలంలో చిరంజీవి, సురేఖ చూపిన దాతృత్వం.. అలాగే వెంకటేశ్ అందించిన సహకారం తన సినీ ప్రయాణంలో ఎప్పటికీ మరచిపోలేనివని నాజర్ కృతజ్ఞతతో స్మరించుకున్నారు. ఎటువంటి గుర్తింపును ఆశించకుండా నిస్వార్థంగా చేసే సాయమే అత్యంత గొప్పదని ఆయన అన్నారు.

తెలిసిన వారినే ప్రశ్నించడానికి ఎందుకు వెనుకాడుతున్నాం?



సమాజంలో ఎక్కడైనా చిన్నపిల్లలపై లైంగిక వేధింపుల ఘటన జరిగినప్పుడు అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడి ఆవేదన వ్యక్తం చేస్తాం. కానీ ఆ వార్త పాతబడగానే మళ్లీ ఎప్పటిలాగే మౌనంలోకి జారిపోతామన్నది అంతే నిజం. తాజాగా ఈ అంశంపై బాలీవుడ్ నటి విద్యాబాలన్ ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారులపై జరిగే ఇలాంటి అఘాయిత్యాలను అరికట్టే బాధ్యత పిల్లలది కాదని.. పూర్తిగా పెద్దలదేనని కుండబద్దలు కొట్టారు. 2018 నుంచి -అర్పణ్- అనే స్వచ్ఛంద సంస్థకు గుడ్‌విల్ అంబాసిడర్‌గా పనిచేస్తున్న విద్యాబాలన్.. చైల్డ్ సేఫ్టీ వీక్ సందర్భంగా సమాజంలోని లోపాలను ఎత్తి చూపారు. వేధింపులకు పాల్పడే వ్యక్తులు ఎవరూ పట్టుబడరనే ధీమాతోనే రెచ్చిపోతున్నారని విద్యాబాలన్ అభిప్రాయపడ్డారు. పిల్లల మౌనం.. కుటుంబ పరువు పోతుందనే పెద్దల భయం.. పోలీసులకు ఫిర్యాదు చేయడానికి సమాజం వెనుకాడే ధోరణే నేరగాళ్లకు కొండంత అండగా మారుతుందన్నారు. కఠినమైన అడుగులు వేయాల్సిన చోట పెద్దలంతా ఆగిపోతున్నారని.. మనకు ఎంతో నమ్మకమైన.. తెలిసిన వారినే ప్రశ్నించడానికి ఎందుకు వెనుకాడుతున్నామని విద్య సూటిగా ప్రశ్నించారు. సొంత కుటుంబంలోనే కొన్ని కఠినమైన హద్దులు గీయడం.. ఒక చిన్నారి ధైర్యం చేసి తనకు జరిగిన అన్యాయాన్ని చెప్పినప్పుడు దాన్ని గుడ్డిగా కొట్టిపారేయకుండా నమ్మడం పెద్దల కనీస బాధ్యత అని విద్యాబాలన్ గుర్తు చేశారు. ఇంటి పరువు బజారున పడుతుందనే భయంతో నిజాన్ని నాలుగు గోడల మధ్యే సమాధి చేయడం వల్ల నేరగాళ్లకు మరింత బలం చేకూరుతుందని హెచ్చరించారు. పోక్సో చట్టం ఎంత కఠినంగా ఉందో? ప్రజల్లోకి తీసుకెళ్లి నేరం చేస్తే శిక్ష తప్పదనే భయం ప్రతి ఒక్కరిలో కలగాలన్నారు. గతంలో తాను నటించిన -కహానీ 2- సినిమాలో దుర్గా రాణి పాత్ర చేస్తున్నప్పుడే బాలల వేధింపుల వెనుక ఉన్న చేదు నిజాలు.. బాధితులపై జీవితాంతం ఉండే మానసిక గాయాల గురించి లోతుగా అర్థమైందని విద్యాబాలన్ గుర్తు చేసుకున్నారు. ఆ సినిమా విడుదలైన తర్వాతే ఇన్నాళ్లూ కార్పెట్ కింద దాచిపెట్టిన ఈ సున్నితమైన అంశంపై ఇళ్లలో చర్చ మొదలైందన్నారు. అయితే ఇలాంటి కథలను తెరకెక్కించేటప్పుడు దర్శక,నిర్మాతలు బాధితులను తప్పుపట్టకుండా.. సంచలనాల కోసం కాకుండా ఎంతో బాధ్యతగా చూపించాలని సూచించారు.కవలం సినిమాలు తీయడం వల్లనో? సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం వల్లో? చిన్నారులకు రక్షణ దక్కదని విద్యాబాలన్ తేల్చి చెప్పారు. సినిమాలు కేవలం ఒక చర్చను మాత్రమే మొదలుపెట్టగలవని ఆ తర్వాత క్షేత్రస్థాయిలో పనిచేసే సంస్థలకు అండగా నిలవడం.. బాధితులకు న్యాయం జరిగేలా చూడటం అందరి బాధ్యత అన్నారు. ఇటీవలే విద్యాబాలన్ -జైలర్ 2- లో కాంత పాత్రతో ఎలా అలరించారో తెలిసిందే. కల్పక్ ఫ్యామిలీ వారసురాలిగా విద్య ఓ రేంజ్ లో అదరగొట్టారు. ప్రస్తుతం విద్య బాలన్ నటిస్తోన్న మరో మూడు బాలీవుడ్ చిత్రాలు ఆన్ సెట్స్ లో ఉన్నాయి.

'ఆయనతో ఒక్క ఫోటో చాలనుకున్నా..

ప్రముఖ నటి, దర్శకురాలు రేణూ దేశాయ్ చాలా కాలం తర్వాత మళ్లీ వెండితెరపై కనిపించబోతున్నారు. మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ఓం' చిత్రంతో ఆమె నటిగా పునరాగమనం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, ఈ అవకాశం ఎలా వచ్చింది, తన ఆరోగ్య రహస్యం ఏంటి అనే విషయాలపై ఆసక్తికరమైన వివరాలు పంచుకున్నారు.మమ్ముట్టి లాంటి గొప్ప నటుడితో కలిసి నటించే అవకాశం రావడం తనను ఆశ్చర్యపరిచిందని రేణూ దేశాయ్ అన్నారు. "గతేడాది ఆయన సినిమాలు చూస్తూ, ఎప్పటికైనా ఆయన్ను కలిసి ఒక ఫొటో దిగితే చాలనుకున్నాను. కానీ ఆయన సరసన నటించే అవకాశం వస్తుందని కలలో కూడా ఊహించలేదు" అని తెలిపారు. మహాశివరాత్రి రోజున తాను కామాఖ్య దేవాలయంలో ఉన్నప్పుడు చెన్నై నుంచి ఓ అసిస్టెంట్ డైరెక్టర్ ఫోన్ చేసి మమ్ముట్టి సినిమాలో భార్య పాత్రకు ఆఫర్ చేశారని చెప్పారు. మొదట దాన్ని ఒక ప్రాంక్ కాల్ అనుకుని నమ్మలేకపోయానని ఆమె గుర్తుచేసుకున్నారు. రెండు నెలల తర్వాత చిత్రానికి 'ఓం' అని పేరు ప్రకటించగానే తనకు గూస్‌బంప్స్ వచ్చాయని, ఇదంతా దైవ సంకల్పమేనని భావిస్తున్నానని అన్నారు.గత ఏడాది తనకు ఒక సర్జరీ జరిగిందని, దానివల్ల దాదాపు ఆరు నెలల పాటు పూర్తి విశ్రాంతి తీసుకున్నానని రేణూ దేశాయ్ తెలిపారు. ఆ సమయంలో కిచిడీ, పెసరపప్పు, సొరకాయ వంటి తేలికపాటి ఆహారం మాత్రమే తీసుకున్నానని చెప్పారు. ఈ ఆహార నియమాలు, విశ్రాంతి వల్లే శరీరంలో వాపు తగ్గి ఇప్పుడు మరింత ఫ్రెష్‌గా కనిపిస్తున్నానని తన ఆరోగ్య రహస్యాన్ని వెల్లడించారు. సోషల్ మీడియాలో సాధారణంగా కనిపించే తనకు భిన్నంగా, ఓ నటిగా మళ్లీ ప్రేక్షకుల ముందుకు రావడం సంతోషంగా ఉందని రేణూ దేశాయ్ పేర్కొన్నారు.



బన్నీ రేసులో బోయపాటి నెంబర్ - 4!



-పుష్ప- విజయంతో పాన్ ఇండియా బాక్సాఫీస్‌ను శాసిస్తున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తదుపరి సినిమాల విషయం లో పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం బన్నీ చేతిలో ఉన్న క్రేజీ ప్రాజెక్టుల జాబితా చూస్తే? అసక్తి అంతకంతకు రెట్టింపు అవుతుంది. అందులో మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను స్థానం ఇప్పుడు చర్చ నీయాంశంగా మారింది. అల్లు అర్జున్ తదుపరి సినిమాల రేసులో బోయపాటి ప్రాజెక్ట్ నాలుగో స్థానంలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బన్నీ ఫోకస్ అంతా తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ తెరకెక్కిస్తోన్న భారీ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ ఎంటర్‌టైనర్ -రాకా- పైనే పెట్టారు. సన్ పిక్చర్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరు గుతోంది. గతంలో ఇద్దరి కాంబినేషన్‌లో రిలీజ్ అయిన -సరైనోడు- బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనం సృష్టించిందో తెలిసిందే. ఈ నేపథ్యంలో బన్నీ కోసం బోయపాటి పవర్‌ఫుల్ మైథలాజికల్ టచ్ ఉన్న కథను సిద్ధం చేస్తున్నారని.. అది బన్నీకి బాగా నచ్చి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ప్రచారం జరుగుతోంది.అయితే ఏ సినిమా ఎప్పుడు పట్టాలెక్కుతుందన్నది అధికారికంగా క్లారిటీ రావాల్సి ఉంది. లోకేష్ ప్రాజెక్ట్ మాత్రం వచ్చే ఏడాది పట్టాలెక్కుతుంది. ఈ సినిమా షూటింగ్ కూడా లోకేష్ వేగంగానే పూర్తి చేస్తారు. ఈ విషయంలో లోకేష్ పెద్దగా సమయం తీసుకోరు. చిత్రీకరణ ముగించే విషయంలో లోకేష్ -లియో- స్ట్రాటజీ అనుసరిస్తారని చిత్ర వర్గాల నుంచి తెలుస్తోంది. ఎలా చూసుకున్నా? బోయపాటి ప్రాజెక్ట్ పట్టాలెక్కాలంటే? ఎలా లేదన్నా రెండున్నరేళ్లకు పైగా సమయం పడుతుంది.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,

Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com